ఈ పేపర్ కోసం
www.visionandhra.in
చూడండి

విజన్ ఆంధ్ర

తెలుగు దినపత్రిక

VISION ANDHRA TELUGU DAILY



శనివారం 21-11-2026 | Saturday 21November, 2026 | విజయవాడ | ➪ పేజీలు: 8 | ➪ వెల: రూ.1.00 | PUBLISHED FROM: HYDERABAD,NALGONDA, VIJAYAWADA

సంపుటి: 01 సంచిక: 286 | Vol.No 01 Issue No . 286 | Vijayawada | www.visionandhra.in

సమగ్ర ఆరోగ్యమే లక్ష్యం



- సమగ్ర ఆరోగ్య విధానంతోనే మెరుగైన వైద్య సేవలు
- మానవ, పశు వైద్యం, పర్యావరణ నిపుణులు సమన్వయంతో పనిచేయాలి: రాష్ట్రపతి ద్రౌపది ముర్ము

న్యూఢిల్లీ: నవంబర్ 20 (విజన్ ఆంధ్ర)

దేశంలో ఆరోగ్య సేవలను మరింత మెరుగుపరిచేందుకు సమగ్ర ఆరోగ్య విధానాన్ని అమలు చేయాల్సిన అవసరం ఉందని రాష్ట్రపతి ద్రౌపది ముర్ము పేర్కొన్నారు. న్యూఢిల్లీలోని అటల్ బిహారీ వాజ్‌పేయి వైద్య విజ్ఞాన సంస్థ, డాక్టర్ రామ్ మనోహర్ లోహియా ఆసుపత్రి 12వ స్నాతకోత్సవంలో ఆమె పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రపంచ ఆరోగ్య రంగంలో 'ఒకే ఆరోగ్యం' భావనకు ఎంతో ప్రాధాన్యం ఉందన్నారు. మానవులు, జంతువులు, వృక్షజాలం, పర్యావరణం పరస్పరం అనుసంధానమై ఉన్నందున ఒక రంగంలో తలెత్తే ఆరోగ్య సమస్యలు ఇతర రంగాలపైనా ప్రభావం చూపుతాయని వివరించారు. అనేక అంటువ్యాధులు జంతువుల నుంచి మనుషులకు వ్యాపిస్తుండగా, వాయు, జల కాలుష్యం, వాతావరణ మార్పులు కూడా మానవ ఆరోగ్యానికి ముప్పుగా పరిణమిస్తున్నాయని తెలిపారు. అందువల్ల మానవ వైద్యం, పశువైద్యం, పర్యావరణ శాస్త్ర నిపుణులు సమన్వయంతో పనిచేయాలని సూచించారు.వ్యాధుల నివారణ, ముందస్తు గుర్తింపుతో పాటు భవిష్యత్తులో ఎదురయ్యే ఆరోగ్య సంక్షోభాలను సమర్థంగా ఎదుర్కొనేందుకు ఈ సమగ్ర విధానం దోహదపడుతుందని రాష్ట్రపతి అన్నారు. ప్రజల ఆరోగ్యంపై సామాజిక, ఆర్థిక, పోషకాహార, పర్యావరణ పరిస్థితులు ప్రత్యక్ష ప్రభావం చూపుతాయని పేర్కొన్నారు. స్థానిక ఆరోగ్య సమస్యలు, పరిస్థితులకు అనుగుణంగా చికిత్సా విధానాలు, వ్యాధి నివారణ చర్యలపై పరిశోధనలను ప్రోత్సహించాలని సూచించారు.దేశ ఆరోగ్య అవసరాలకు అనుగుణంగా కేంద్ర ప్రభుత్వం 2017లో జాతీయ ఆరోగ్య విధానాన్ని సవరించిందని రాష్ట్రపతి గుర్తుచేశారు. ఈ విధానంలో వ్యాధుల చికిత్సతో పాటు నివారణ, ఆరోగ్య పరిరక్షణకు ప్రాధాన్యం కల్పించినట్లు తెలిపారు. పునరావాస, ఉపశమన వైద్య సేవలను కూడా బలోపేతం చేశారని వివరించారు. మానసిక ఒత్తిడి, మధుమేహం, క్యాన్సర్ వంటి అసంక్రమిత వ్యాధులు పెరుగుతున్న నేపథ్యంలో వాటి నివారణపై ప్రత్యేక దృష్టి సారించాల్సిన అవసరం ఉందన్నారు.గత దశాబ్ద కాలంలో కేంద్ర ప్రభుత్వం చేపట్టిన ఆరోగ్య రంగ కార్యక్రమాల ఫలితంగా ప్రాథమిక స్థాయి నుంచి ఉన్నత స్థాయి వరకు వైద్య సేవలు విస్తరించాయని పేర్కొన్నారు. స్నాతకోత్సవంలో పట్టాలు అందుకున్న వైద్యులు తమ పరిశోధనలు, నైపుణ్యాలతో వైద్య సేవలను మరింత సమర్థవంతంగా, అందుబాటులో, తక్కువ ఖర్చుతో ప్రజలకు చేరువ చేయాలని పిలుపునిచ్చారు. ముఖ్యంగా మారుమూల ప్రాంతాలు, పేద, వెనుకబడిన వర్గాలకు వైద్య సేవలు అందించడంపై దృష్టి పెట్టాలని సూచించారు. వైద్యుల నైపుణ్యం సమాజంలోని ప్రతి వర్గానికీ ప్రయోజనం చేకూర్చేలా వారి ఆలోచనలు, కార్యాచరణ ఉండాలని రాష్ట్రపతి ద్రౌపది ముర్ము ఆకాంక్షించారు.

త్వరలో ఏపీ రేర్ ఎర్త్ డెవలప్‌మెంట్

కార్పొరేషన్ ఏర్పాటు

- ఒడిశా, జార్ఖండ్ బొగ్గు బ్లాకుల వేలంలో పాల్గొంటున్న ఏపీఎండీసీ
- గనుల శాఖపై అధికారులతో సీఎం చంద్రబాబు సమీక్ష
- ఏపీఎండీసీ ఐపీవోకు వెళ్లేందుకు ముఖ్యమంత్రి ఆమోదం



అమరావతి, నవంబర్ 20: (విజన్ ఆంధ్ర)


ఎన్ఎండీసీ తరహాలో ఏపీఎండీసీని అత్యున్నత స్థాయి మైనింగ్ సంస్థగా తీర్చిదిద్దేలా కార్యాచరణ చేపట్టాలని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అధికారులకు సూచించారు. ఇందుకోసం అవసరమైతే ప్రైవేట్ ఏజెన్సీల సాయం కూడా తీసుకోవాలని స్పష్టం చేశారు. శుక్రవారం క్యాంపు కార్యాలయంలో గనుల శాఖపై ముఖ్యమంత్రి అధికారులతో సమీక్ష నిర్వహించారు. రాష్ట్రంలో కొత్త ఖనిజ నిక్షేపాల గుర్తింపు, సమర్థ వినియోగం, ఆదాయార్జన అవకాశాలు తదితర అంశాలపై చర్చించారు. అలాగే రాష్ట్రంలో ఖనిజ వనరుల విలువ పెంచేలా ప్రణాళికలు సిద్ధం చేయాలని, మన వనరులు...మన రాష్ట్రంలోనే వినియోగంలోకి తెచ్చేలా ప్రయత్నించాలని సీఎం అన్నారు. ఖనిజ వనరులను కేవలం ఆదాయార్జనగా చూడకుండా...భవిష్యత్ ఆస్తిగా మార్చడమే లక్ష్యం కావాలన్నారు.

రాష్ట్రంలో 209 క్లస్టర్లుగా ఖనిజ నిక్షేపాలు

రాష్ట్రంలో 74,860 చ.కి.మీ. పరిధిలో మొత్తం 582 మినరల్ పొటెన్షియల్ ఏరియాలు గుర్తించి, 209 క్లస్టర్లుగా విభజించినట్లు తెలిపారు. ఈ సందర్భంగా వచ్చే ఏడాది డిసెంబర్ లక్ష్యంగా ఏపీఎండీసీని స్టాక్ మార్కెట్‌లో లిస్ట్ చేసేలా ఐపీఓ కార్యాచరణ ప్రతిపాదనలకు ముఖ్యమంత్రి అంగీకరించారు. ఏపీఎండీసీ ఈక్విటీ విలువ ఆధారంగా ఐపీవోకు వెళ్లేలా సీఎం నిర్దేశించారు. ఖనిజ నిర్వహణ కోసం ప్రత్యేకంగా ఏపీ రేర్ ఎర్త్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ (ఆర్ఈడీసీ) ఏర్పాటుకు సీఎం ఆమోదం తెలిపారు. రేర్ ఎర్త్ మినరల్స్ అన్వేషణ, వాటికి విలువ పెంచడమే లక్ష్యం కావాలన్నారు. వచ్చే ఐదేళ్లలో ఖనిజ అన్వేషణ, వేలం ప్రక్రియ వేగవంతం చేసేలా ప్రణాళికలు అమలు చేయాలని సీఎం స్పష్టం చేశారు. పెండింగ్‌లో ఉన్న 6,500 క్వారీ లీజు దరఖాస్తులు, 223 రెన్యువల్స్ పరిష్కారానికి గడువు పొడిగింపు ప్రతిపాదనలపై సమీక్షలో చర్చించారు. పెండింగ్ దరఖాస్తులు, రెన్యువల్స్ పరిష్కారంతో



భీమవరం ఆక్వాకల్చర్ క్లస్టర్ అభివృద్ధి కోసం ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ఐస్‌లాండ్ ఓషన్ క్లస్టర్ మధ్య ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు సమక్షంలో ఎంఓయూ కుదిరింది. చేపలు, రొయ్యల సంపూర్ణ వినియోగం, సముద్ర ఉత్పత్తుల ద్వారా అదనపు విలువ సృష్టించేందుకు ఇది దోహదపడనుంది. ఆధునిక ప్రాసెసింగ్ టెక్నాలజీ, మెరైన్ బయోటెక్నాలజీ, వ్యర్థాల నుంచి విలువైన ఉత్పత్తుల తయారీలో పరస్పర సహకారం అందించుకోనున్నాయి. పరిశోధన, సాంకేతిక పరిజ్ఞాన మార్పిడి, శిక్షణ, స్టార్టప్‌ల ప్రోత్సాహానికి ఐస్‌లాండ్ క్లస్టర్ సహకారం అందించనుంది. ఈ అంతర్జాతీయ భాగస్వామ్యంతో ఆంధ్రప్రదేశ్ ఆక్వాకల్చర్ రంగంలో సుస్థిర అభివృద్ధి, ఎగుమతులు, అదనపు ఆదాయ అవకాశాలకు బాటలు పడనున్నాయి.



తుఫాన్లతో ఏపీలో ఉద్యాన పంటలకు

రూ.1,092 కోట్ల నష్టం

- అర్నబ్, మురసు తుఫానులతో నష్టపోయిన ఉద్యాన రైతాంగం
- ఉద్యాన పంటల పునరుద్ధరణకు రూ.96 కోట్ల అదనపు సాయానికి వినతి
- కేంద్ర వ్యవసాయ శాఖ మంత్రి శివరాజ్ సింగ్ చౌహాన్‌కు సీఎం చంద్రబాబు లేఖ

అమరావతి, నవంబరు 20: (విజన్ ఆంధ్ర)

రెండు వరుస తుఫాన్ల కారణంగా దెబ్బ తిన్న ఉద్యాన పంటల పునరుద్ధరణకు వివిధ కేంద్ర పథకాల కింద అదనపు సాయం అందించాలని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు కేంద్ర వ్యవసాయ శాఖ మంత్రి శివరాజ్ సింగ్ చౌహాన్‌కు లేఖ రాశారు. ఇటీవల సంభవించిన అర్నబ్, మురసు తుపానుల కారణంగా రాష్ట్రంలో ఉద్యాన పంటలకు భారీ నష్టం వాటిల్లిందని లేఖలో ముఖ్యమంత్రి తెలిపారు. ఈ ఏడాది అక్టోబర్ 28, నవంబర్ 2, తేదీలలో వరుసగా ఏపీని తాకిన ఈ రెండు తుపానుల ధాటికి 18 జిల్లాల్లోని 29,960 హెక్టార్లలో ఉద్యాన పంటలు దెబ్బతిన్నాయని, దీనివల్ల 71,576 మంది రైతులు నష్టపోయారని పేర్కొన్నారు.

ప్రభుత్వానికి సుమారు రూ.400 కోట్ల ఆదాయం వచ్చే అవకాశం ఉంది. అలాగే, థర్మల్ విద్యుత్ కేంద్రాలకు బొగ్గు సరఫరా కోసం ఒడిశా, జార్ఖండ్‌లో మూడు బొగ్గు బ్లాకుల వేలంలో ఏపీఎండీసీ పాల్గొంటున్నట్టు అధికారులు ముఖ్యమంత్రికి వెల్లడించారు. మూడు బొగ్గు బ్లాకుల్లో మొత్తం 1,774.6 మిలియన్ టన్నుల మేర బొగ్గు నిల్వలు ఉన్నాయి. సమీక్షలో సీఎస్ సాయిప్రసాద్, గనుల శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ ముఖేష్ కుమార్ మీనా, ఆర్థిక శాఖ కార్యదర్శి రోనాల్డ్ రోస్, ఇతర ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

రాజ్యాంగ విలువల పరిరక్షణకు

బాధ్యతాయుత పౌరసత్వం



- హక్కులతోపాటు విధులకూ సమాన ప్రాధాన్యం ఇవ్వాలి..
- రాజ్యాంగం మన గణతంత్రానికి నైతిక మార్గదర్శి: ఉపరాష్ట్రపతి సి.పి. రాధాకృష్ణన్

న్యూఢిల్లీ: నవంబర్ 20 (విజన్ ఆంధ్ర)

పౌరులు తమ హక్కులతోపాటు బాధ్యతలను కూడా సమర్థంగా నిర్వర్తించినప్పుడే రాజ్యాంగ విలువలు బలోపేతం అవుతాయని ఉపరాష్ట్రపతి సి.పి. రాధాకృష్ణన్ అన్నారు. న్యూఢిల్లీలోని కాన్‌స్టిట్యూషన్ క్లబ్‌లో బెన్నెట్ విశ్వవిద్యాలయం న్యాయ విద్యా విభాగం నిర్వహించిన ఐదో రాజ్యాంగ వారోత్సవాలు2026ను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రాజ్యాంగం కేవలం చట్టపరమైన పత్రం మాత్రమే కాదని, దేశ గణతంత్రానికి నైతిక మార్గదర్శి అని పేర్కొన్నారు. రాజ్యాంగ విలువలు సంస్థలు, చట్టపుస్తకాలకే పరిమితం కాకుండా ప్రజల రోజువారీ జీవితంలో భాగం కావాలని సూచించారు. ప్రజాస్వామ్యం పరిఢవిల్లాలంటే సంస్థలు జవాబుదారీతనంతో వ్యవహరించాలని, భిన్నాభిప్రాయాలను గౌరవించాలని, పౌరులు హక్కులు, విధులను బాధ్యతగా నిర్వర్తించాలని స్పష్టం చేశారు.ప్రధాని నరేంద్ర మోదీ నాయకత్వంలో గత దశాబ్ద కాలంలో సాధించిన అభివృద్ధి ఫలితాలు రాజ్యాంగ ఆశయాలను ప్రజల జీవితాల్లోకి తీసుకువచ్చాయని ఉపరాష్ట్రపతి అన్నారు. సుమారు 50 కోట్ల మంది పేదరికం నుంచి బయటపడటం, పేదలకు నాలుగు కోట్ల పక్కా ఇళ్ల నిర్మాణం, జల్‌జీవన్ మిషన్ ద్వారా గ్రామీణ ప్రాంతాల్లో 82 శాతానికి పైగా ఇళ్లకు కుళాయి నీటి సదుపాయం కల్పించడం వంటి అంశాలను ప్రస్తావించారు. గతంలో అభివృద్ధికి దూరంగా ఉన్న సరిహద్దు గ్రామాలు ప్రస్తుతం అభివృద్ధి కేంద్రాలుగా మారుతున్నాయని తెలిపారు.రాజ్యాంగ పరిషత్‌లోని 15 మంది మహిళా సభ్యుల సేవలను గుర్తుచేసిన ఆయన, మహిళల భాగస్వామ్యం దేశ నిర్మాణంలో కీలకమని పేర్కొన్నారు.

లేళ్ల అప్పిరెడ్డికి

మూడు రోజుల పోలీస్ కస్టడీ

గుంటూరు: నవంబర్ 20 (విజన్ ఆంధ్ర)

వైసీపీ ఎమ్మెల్సీ లేళ్ల అప్పిరెడ్డికి న్యాయస్థానంలో ఎదురుదెబ్బ తగిలింది. ఆయనను మూడు రోజుల పాటు పోలీసుల కస్టడీకి అప్పగిస్తూ గుంటూరు కోర్టు ఉత్తర్వులు జారీ చేసింది.గుంటూరు జిల్లా వెంగళాయపాలెంలో స్థానిక సంస్థల ఎన్నికల అనంతరం బ్యాలెట్ పెట్టెల తరలింపు సమయంలో వివాదం చోటుచేసుకుంది. ఎన్నికల విధులకు ఆటంకం కలిగించడంతో పాటు, బ్యాలెట్ పెట్టెను బలవంతంగా లాక్కున్నారనే ఆరోపణలపై నల్లపాడు పోలీసులు అప్పిరెడ్డిని అరెస్ట్ చేశారు. అప్పటి నుంచి ఆయన రాజమండ్రి కేంద్ర కారాగారంలో రిమాండ్‌లో ఉన్నారు.కేసు దర్యాప్తులో భాగంగా అప్పిరెడ్డిని మరింతగా విచారించాల్సి ఉందని పేర్కొంటూ పోలీసులు కోర్టులో కస్టడీ పిటిషన్ దాఖలు చేశారు. దీనిపై విచారణ జరిపిన న్యాయస్థానం మూడు రోజుల పోలీస్ కస్టడీకి అనుమతించింది. దీంతో పోలీసులు ఆయనను జైలు నుంచి తీసుకెళ్లి విచారించనున్నారు.
మరోవైపు, బెయిల్ కోరుతూ అప్పిరెడ్డి తరపు న్యాయవాదులు దాఖలు చేసిన పిటిషన్‌పై వాదనలు పూర్తయ్యాయి. ఇరుపక్షాల వాదనలు విన్న న్యాయస్థానం తీర్పును వాయిదా వేసింది. నవంబర్ 25న బెయిల్ పిటిషన్‌పై నిర్ణయం వెలువరించనున్నట్లు తెలిపింది.

టీడీపీ సీనియర్ నేత ముక్కా ముత్యాల నాయుడు

మృతి పట్ల ముఖ్యమంత్రి సంతాపం

- విశాఖ మేయర్ ముక్కా శ్రావణికి ఫోన్లో సీఎం పరామర్శ

అమరావతి, నవంబర్ 20 (విజన్ ఆంధ్ర)

విశాఖ మేయర్ ముక్కా శ్రావణి తండ్రి, టీడీపీ సీనియర్ నాయకులు ముక్కా ముత్యాలనాయుడు గుండెపోటుతో మరణించడం పట్ల ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు సంతాపం వ్యక్తం చేశీశీశారు. ఆయన మరణ వార్త తెలుసుకున్న సీఎం చంద్రబాబు.. ముక్కా శ్రావణికి ఫోన్ చేసి పరామర్శించారు. కార్పొరేటర్‌గా ముత్యాలనాయుడు విశాఖ ప్రజలకు, పార్టీకి అందించిన సేవలను సీఎం గుర్తు చేసుకున్నారు. శ్రావణి కుటుంబ సభ్యులతోనూ మాట్లాడిన ముఖ్యమంత్రి, ఈ కష్ట సమయంలో



ధైర్యంగా ఉండాలన్నారు. ముత్యాలనాయుడు ఆత్మకు శాంతి చేకూరాలని భగవంతుడిని ప్రార్థిస్తూ, వారి కుటుంబ సభ్యులకు ముఖ్యమంత్రి తన ప్రగాఢ సానుభూతిని తెలిపారు.

కొనకళ్ల నారాయణరావుకు అస్వస్థత

విజయవాడ: నవంబర్ 20 (విజన్ ఆంధ్ర)

ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థ ఛైర్మన్, టీడీపీ సీనియర్ నేత కొనకళ్ల నారాయణరావు శుక్రవారం ఉదయం అస్వస్థతకు గురయ్యారు. తీవ్రంగా కళ్లు తిరగడంతో కుటుంబ సభ్యులు వెంటనే ఆయనను సమీపంలోని ఆస్పత్రికి తీసుకెళ్లారు. అక్కడ పరీక్షించిన వైద్యులు మెదడులో రక్తం గడ్డకట్టినట్లు గుర్తించినట్లు సమాచారం. మెరుగైన వైద్యం కోసం ఆయనను విజయవాడలోని ఆస్పత్రికి తరలించారు. ప్రస్తుతం వైద్యుల పర్యవేక్షణలో చికిత్స పొందుతున్నారు.ఈ విషయం తెలుసుకున్న రాష్ట్ర గనులు, ఎక్సైజ్ శాఖ మంత్రి కొల్లు రవీంద్ర ఆస్పత్రికి చేరుకుని వైద్యులను అడిగి ఆయన ఆరోగ్య పరిస్థితిని తెలుసుకున్నారు. కుటుంబ సభ్యులతో మాట్లాడి ధైర్యం చెప్పారు. మెరుగైన వైద్యం అందించాలని వైద్య బృందానికి సూచించారు. అనంతరం మంత్రి మాట్లాడుతూ కొనకళ్ల



నారాయణరావు ఆరోగ్యం ప్రస్తుతం నిలకడగా ఉందని, ఎవరూ ఆందోళన చెందాల్సిన అవసరం లేదని తెలిపారు. ఆయన అస్వస్థతకు గురయ్యారన్న విషయం తెలుసుకున్న కూటమి నాయకులు, కార్యకర్తలు ఆస్పత్రికి చేరుకుని ఆరోగ్య పరిస్థితిని తెలుసుకుంటున్నారు. త్వరగా కోలుకోవాలని ఆకాంక్షిస్తున్నారు.

నేడు పశ్చిమ బెంగాల్, ఉత్తరప్రదేశ్‌లో

ప్రధాని పర్యటన

- ఐఐటీ ఖరగ్‌పూర్ వజ్రోత్సవంలో పాల్గొననున్న మోదీ..
- లక్నోలో ఐదో నైపుణ్య పట్టాల ప్రదానోత్సవానికి హాజరు

న్యూఢిల్లీ: నవంబర్ 20 (విజన్ ఆంధ్ర)

ప్రధానమంత్రి నరేంద్ర మోదీ నవంబరు 21న పశ్చిమ బెంగాల్, ఉత్తరప్రదేశ్ రాష్ట్రాల్లో పర్యటించనున్నారు. ఉదయం 9.45 గంటలకు ఐఐటీ ఖరగ్‌పూర్ 75వ వార్షికోత్సవ వేడుకల్లో పాల్గొని ప్రసంగించనున్నారు. సంస్థ 75 ఏళ్ల ప్రస్థానానికి గుర్తుగా 75 మంది విద్యార్థులతో ఆయన ముఖాముఖి మాట్లాడనున్నారు. 1951లో స్థాపించిన ఐఐటీ ఖరగ్‌పూర్ దేశంలోనే తొలి భారతీయ సాంకేతిక విద్యాసంస్థగా గుర్తింపు పొందింది. సాంకేతిక విద్య, పరిశోధన, నూతన ఆవిష్కరణల రంగాల్లో కీలక పాత్ర పోషిస్తోంది.అనంతరం బిహార్‌లోని వైశాలికి వెళ్లి పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు చేయనున్నారు. ఆ తర్వాత ఉత్తరప్రదేశ్‌లోని లక్నోకు చేరుకుని సాయంత్రం 5.30 గంటలకు గోమతీనగర్‌లోని ఇందిరాగాంధీ ప్రతిష్ఠాన్‌లో నిర్వహించే ఐదో నైపుణ్య పట్టాల ప్రదానోత్సవంలో పాల్గొంటారు. ఈ కార్యక్రమంలో పారిశ్రామిక శిక్షణ సంస్థలు, జాతీయ నైపుణ్య శిక్షణ సంస్థలు, శిక్షకుల శిక్షణ సంస్థలకు చెందిన జాతీయ స్థాయి




52 మంది ప్రతిభావంతులను వారి అత్యుత్తమ ప్రతిభకు గుర్తింపుగా సత్కరించనున్నారు. నైపుణ్యాభివృద్ధి, వృత్తివిద్యలో ప్రతిభ కనబరిచిన యువతను ప్రోత్సహించడమే ఈ వేడుకల ప్రధాన ఉద్దేశమని కేంద్రం వెల్లడించింది.

కార్తిగై దీపానికి ప్రత్యేక రైళ్లు

విశాఖపట్నం: నవంబర్ 20 (విజన్ ఆంధ్ర)

తమిళనాడులోని తిరువణ్ణామలైలో జరిగే కార్తిగై దీపం మహోత్సవాలకు వెళ్లే భక్తుల సౌకర్యార్థం రైల్వే శాఖ ప్రత్యేక రైళ్లను ప్రకటించింది. విశాఖపట్నంతిరువణ్ణామలైతో పాటు తిరుపతివిశాఖపట్నం మధ్య ప్రత్యేక సర్వీసులు నడపనున్నట్లు వెల్లడించింది. విశాఖపట్నంతిరువణ్ణామలై ప్రత్యేక రైలు (08579) నవంబరు 22 రాత్రి 11.50 గంటలకు విశాఖలో బయలుదేరి, నవంబరు 23 సాయంత్రం 5.50 గంటలకు తిరువణ్ణామలై చేరుకుంటుంది. తిరుగు ప్రయాణంలో (08580) నవంబరు 23 రాత్రి 9 గంటలకు బయలుదేరి, నవంబరు 24 మధ్యాహ్నం 2 గంటలకు విశాఖ చేరుకుంటుంది.

తిరుమల శ్రీవారిని దర్శించుకున్న మంత్రి నారాయణ, సింగపూర్ మంత్రి డాక్టర్ టాన్ సీ లెంగ్



తిరుమల (విజన్ ఆంధ్ర) శ్రీ వెంకటేశ్వర స్వామి వారిని ఆంధ్రప్రదేశ్ పురపాలక శాఖ మంత్రి పొంగూరు నారాయణ, సింగపూర్ మంత్రి డాక్టర్ టాన్ సీ లెంగ్ కలిసి దర్శించుకున్నారు. ఆలయానికి విచ్చేసిన వీరికి తిరుమల తిరుపతి దేవస్థానం అధికారులు ఘనస్వాగతం పలికి, ప్రత్యేక దర్శన ఏర్పాట్లు చేశారు. దర్శనానంతరం రంగనాయకుల మండపంలో వేదపండితులు వీరికి ఆశీర్వచనం అందించగా, అధికారులు స్వామివారి తీర్థప్రసాదాలను అందజేశారు.

సంపాదకీయం

కరిగిపోతున్న డాలర్ డ్రీమ్స్

అమెరికాలో ఉన్నత విద్య , ఆపై మంచి ఉద్యోగం.. ఇది ప్రపంచంలోని చాలా మంది డ్రీమ్. దశాబ్దాలుగా భారతీయులకు కూడా అమెరికా ఫస్ట్ చాయిస్. కానీ, ఇప్పుడు ఆ పరిస్థితి మారుతున్నట్లు కనిపిస్తోంది. వీసా అనిశ్చితులు, క్లిష్టమైన ఉద్యోగ మార్కెట్, మారుతున్న వలస విధానాల కారణంగా అమెరికాలో చదువుకోవాలనే విద్యార్థుల నిర్ణయాలు సంక్లిష్టంగా మారాయి. ఫలితంగా 2025-26 విద్యా సంవత్సరంలో అమెరికా విశ్వవిద్యాలయాల్లో భారతీయ విద్యార్థుల సంఖ్య 6 శాతం తగ్గి 3,39,435కు చేరుకుంది. ఇదే సమయంలో చైనా విద్యార్థుల సంఖ్య 4 శాతం తగ్గి 2,54,458కి పరిమితమైంది.అన్నింటికంటే ముఖ్యంగా గమనించాల్సిన విషయం ఏమిటంటే.. అమెరికా విద్యాసంస్థల్లో కొత్తగా చేరుతున్న విద్యార్థుల సంఖ్య. 2025-26లో అంతర్జాతీయ విద్యార్థుల ప్రవేశాలు 18 శాతం పడిపోయి 2,28,123కు చేరాయి. గతంలో చేరిన మొత్తం విద్యార్థుల సంఖ్యతో పోలిస్తే, ఈ గణాంకాలు విద్యార్థులు ఇప్పటికీ అమెరికాను ఎంచుకుంటున్నారా? లేదా? అనేదానికి స్పష్టమైన నిదర్శనంగా నిలుస్తాయి.'ఫాల్ 2026 స్నాప్‌షాట్' నివేదిక ప్రకారం.. ఈ తగ్గుదల మరింత కొనసాగే సూచనలు కనిపిస్తున్నాయి. సర్వేలో పాల్గొన్న విద్యాసంస్థల వివరాల ప్రకారం.. గ్రాడ్యుయేట్ విద్యార్థుల సంఖ్య 15 శాతం, అండర్ గ్రాడ్యుయేట్ల సంఖ్య 3 శాతం, ఓపీటీ విద్యార్థుల సంఖ్య 6 శాతం తగ్గింది. గత ఏడాది ఇదే సమయంతో పోలిస్తే కొత్త అంతర్జాతీయ విద్యార్థుల ప్రవేశాలు 15 శాతం తగ్గాయి.ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఇంటర్నేషనల్ ఎడ్యుకేషన్ నవంబర్ 16న విడుదల చేసిన 'ఓపెన్ డోర్స్ 2026' నివేదిక ప్రకారం.. 2025-26లో అమెరికా ఉన్నత విద్యాసంస్థల్లో మొత్తం అంతర్జాతీయ విద్యార్థుల సంఖ్య 3 శాతం తగ్గి 11,46,163కు చేరుకుంది. 800కు పైగా విద్యాసంస్థలపై నిర్వహించిన ప్రత్యేక 'ఫాల్ 2026 స్నాప్‌షాట్' సర్వేలో ప్రస్తుత విద్యా సంవత్సరంలో అంతర్జాతీయ విద్యార్థుల సంఖ్య 9 శాతం తగ్గగా, కొత్త ప్రవేశాలు 15 శాతం పడిపోయినట్లు నమోదైంది.భారత్ విషయానికొస్తే ఈ మార్పు చాలా స్పష్టంగా కనిపిస్తోంది. కేవలం ఏడాది క్రితం అంటే 2024-25లో అంతకుముందు ఏడాది కంటే 10 శాతం వృద్ధితో భారత్ నుంచి రికార్డు స్థాయిలో 3,63,019 మంది విద్యార్థులు అమెరికాకు వెళ్లారు. వరుసగా మూడో ఏడాది కూడా చైనాను వెనక్కి నెట్టి అమెరికాకు అత్యధిక మంది విద్యార్థులను పంపే దేశంగా భారత్ అగ్రస్థానంలోనే కొనసాగుతున్నప్పటికీ, ఆ వేగం మాత్రం మందగించింది. అమెరికాలోని మొత్తం అంతర్జాతీయ విద్యార్థుల్లో దాదాపు 52 శాతం మంది భారత్, చైనాకు చెందినవారే.భారతీయ విద్యార్థులు అత్యధికంగా ఇష్టపడే ఇంజనీరింగ్, టెక్నాలజీ, మేనేజ్‌మెంట్ కోర్సులు ఉండే 'గ్రాడ్యుయేట్' (మాస్టర్స్) స్థాయిలోనే ఈ తగ్గుదల ఎక్కువగా ఉంది. భారతీయ గ్రాడ్యుయేట్ విద్యార్థుల సంఖ్య ఏకంగా 34 శాతం పడిపోయి 1,16,609కు చేరగా, అండర్ గ్రాడ్యుయేట్ ప్రవేశాలు కేవలం 1 శాతం తగ్గి 39,711 వద్ద నిలిచాయి.ఈ వ్యత్యాసం చాలా విషయాలను స్పష్టం చేస్తోంది. చాలా భారతీయ కుటుంబాలకు అమెరికాలో మాస్టర్స్ డిగ్రీ అంటే కేవలం చదువుకు సంబంధించిన పెట్టుబడి మాత్రమే కాదు.. అది వృత్తిపరమైన అనుభవం, మెరుగైన సంపాదన, దీర్ఘకాలిక విదేశీ కెరీర్‌కు ఒక మార్గం. అమెరికాలో చదువు ఖర్చు భారీగా పెరుగుతున్న తరుణంలో, చదువు పూర్తయ్యాక ఉద్యోగం దొరుకుతుందన్న నమ్మకం సన్నగిల్లడం విద్యార్థులను ఆలోచనలో పడేస్తోంది.ఇప్పటికే అమెరికాలో చదువు పూర్తి చేసి ఉద్యోగం చేస్తున్నవారు లేకపోయి ఉంటే, భారతీయ విద్యార్థుల సంఖ్యలో ఈ తగ్గుదల మరింత తీవ్రంగా ఉండేదని నిపుణులు చెబుతున్నారు. చదువు తర్వాత తాత్కాలికంగా పనిచేసేందుకు వీలుకల్పించే ఓపీటీ కింద ఉన్న భారతీయుల సంఖ్య 27 శాతం పెరిగి 1,82,201కు చేరుకుంది. నివేదికలోని మొత్తం భారతీయ విద్యార్థుల్లో వీరే సగానికి పైగా ఉన్నారు.మరోవైపు, చైనా విద్యార్థుల సంఖ్యలో తగ్గుదల కొంత తక్కువగానే ఉంది. చైనా గ్రాడ్యుయేట్ విద్యార్థులు 5 శాతం తగ్గి 1,14,043కు, అండర్ గ్రాడ్యుయేట్లు 5 శాతం తగ్గి 74,594కు, ఓపీటీలో ఉన్నవారు 1 శాతం తగ్గి 61,545కు పరిమితమయ్యారు. ప్రపంచవ్యాప్తంగా అన్ని దేశాల విద్యార్థులను కలిపి చూస్తే, మాస్టర్స్ విద్యార్థులు 22 శాతం తగ్గడంతో మొత్తం గ్రాడ్యుయేట్ ప్రవేశాలు 13 శాతం పడిపోయి 4,23,078కు చేరాయి. అయితే డాక్టోరల్ (పీహెచ్‌డీ) విద్యార్థుల సంఖ్య 3 శాతం పెరగగా, అండర్ గ్రాడ్యుయేట్ ప్రవేశాల్లో పెద్దగా మార్పు లేకుండా 3,56,165 వద్ద స్థిరంగా ఉన్నాయి.ఓపీటీ గణాంకాలు ప్రత్యేకంగా గమనించాల్సినవి. ఎందుకంటే గత కొన్నేళ్లుగా గ్రాడ్యుయేషన్ పూర్తి చేసిన అంతర్జాతీయ విద్యార్థులు పెద్ద సంఖ్యలో ఉండటంతో 2025-26లో ఓపీటీలో ఉన్నవారి సంఖ్య 14 శాతం పెరిగి 3,35,785కు చేరుకుంది. అయితే, ఈ విభాగం కూడా ఇప్పుడు తగ్గుముఖం పట్టడం ప్రారంభమైందని తాజా సర్వే సూచిస్తోంది.అమెరికా విశ్వవిద్యాలయాలకు ఈ పరిణామాలు కేవలం అడ్మిషన్లకే పరిమితం కావు. అంతర్జాతీయ విద్యార్థులు వాటికి గణనీయంగా ఆదాయం, పరిశోధన ప్రతిభ, నైపుణ్యం కలిగిన గ్రాడ్యుయేట్లను అందించే ప్రధాన వనరులు. అమెరికా వాణిజ్య శాఖ ప్రకారం.. 2025లో అంతర్జాతీయ విద్యార్థులు అమెరికా ఆర్థిక వ్యవస్థకు దాదాపు 56 బిలియన్ డాలర్ల ఆదాయాన్ని సమకూర్చారు.అందుకే అంతర్జాతీయ విద్యార్థులను ఆకర్షించాలనే ఆసక్తి అమెరికా విశ్వవిద్యాలయాల్లో ఇంకా బలంగానే ఉంది. 'ఫాల్ స్నాప్‌షాట్' సర్వేలో 75 శాతం విద్యాసంస్థలు క్యాంపస్‌లో అంతర్జాతీయ దృక్పథం అవసరమని పేర్కొనగా, 60 శాతం సంస్థలు విదేశీ విద్యార్థుల ఆర్థిక సహకారాన్ని అంగీకరించాయి. ఏకంగా 91 శాతం విద్యాసంస్థలు సైన్స్, టెక్నాలజీ, ఇంజనీరింగ్, మ్యాథమెటిక్స్ విభాగాల్లో అంతర్జాతీయ విద్యార్థులను చేర్చుకోవడానికి తాము ప్రాధాన్యత ఇస్తున్నట్లు తెలిపాయి. 75 శాతం సంస్థలు కంప్యూటర్ సైన్స్‌ను, చెరో 59 శాతం సంస్థలు ఇంజనీరింగ్, బయోలాజికల్ సైన్సెస్‌ను తమ ప్రధాన రిక్రూట్‌మెంట్ విభాగాలుగా గుర్తించాయి. 2025-26లో మొత్తం అంతర్జాతీయ విద్యార్థుల్లో 57 శాతం మంది స్టెమ్ (ST,z) కోర్సుల్లోనే ఉన్నారు. ఇందులో మ్యాథమెటిక్స్, కంప్యూటర్ సైన్స్‌లో 2,86,168 మంది, ఇంజనీరింగ్‌లో 2,14,193 మంది విద్యార్థులు చదువుతున్నారు.

సంజీవని సేవలకు ప్రత్యేక శిక్షణ..
క్షేత్రస్థాయిలో వైద్య సేవలు మరింత మెరుగుపడాలి!

.- వైద్యాధికారులు, సంజీవని మిత్రులకు తొమ్మిది రోజుల పాటు శిక్షణ తరగతులు

- శిక్షణ కేంద్రాన్ని సందర్శించి సిబ్బందికి కలెక్టర్ శ్యామ్ ప్రసాద్ దిశానిర్దేశం



పుట్టపర్తి, నవంబర్ 20((విజన్ ఆంధ్ర) విలేకరి)

శ్రీ సత్యసాయి జిల్లా వ్యాప్తంగా ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన 'సంజీవని' ఆరోగ్య కార్యక్రమాన్ని మరింత సమర్థవంతంగా అమలు చేసేందుకు వైద్య ఆరోగ్య శాఖ ప్రత్యేక చర్యలు చేపట్టింది. ప్రజలకు నాణ్యమైన వైద్య సేవలు అందించడంతో పాటు, కార్యక్రమాన్ని పారదర్శకంగా ప్రజల్లోకి తీసుకెళ్లే లక్ష్యంతో వైద్యాధికారులు, సంజీవని మిత్రులకు ప్రత్యేక శిక్షణ అందిస్తున్నారు.

తొమ్మిది రోజుల పాటు శిక్షణ తరగతులు

జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారిణి డాక్టర్ ఫైరోజా బేగం పర్యవేక్షణలో పుట్టపర్తిలోని సంస్కృతి స్కూల్ ఆఫ్ ఇంజినీరింగ్ ప్రాంగణంలో నవంబర్ 20 నుంచి 28వ తేదీ వరకు తొమ్మిది రోజుల పాటు ఈ శిక్షణ కార్యక్రమం కొనసాగనుంది. TATA MD సంస్థ సాంకేతిక సహకారం, సమన్వయంతో నిర్వహిస్తున్న ఈ శిక్షణలో ఆ సంస్థకు చెందిన నిపుణులైన ట్రైనర్లు చరణ్, ప్రసాద్ వైద్య సిబ్బందికి అవసరమైన అంశాలపై అవగాహన కల్పిస్తున్నారు.

శిక్షణలో భాగంగా రోగుల వివరాలను కచ్చితంగా నమోదు చేయడం, డిజిటల్ హెల్త్ రికార్డుల నిర్వహణ, ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని వైద్య సేవల్లో వినియోగించే విధానాలపై ప్రత్యేకంగా బోధిస్తున్నారు. అలాగే ప్రజలకు సకాలంలో మెరుగైన వైద్య సేవలు అందించడంలో వైద్యాధికారులు, సంజీవని మిత్రులు నిర్వర్తించాల్సిన పాత్ర, బాధ్యతలను వివరించి, క్షేత్రస్థాయిలో ఎదురయ్యే పరిస్థితులను సమర్థవంతంగా ఎదుర్కొనేలా తగిన శిక్షణ ఇస్తున్నారు.

శిక్షణ కేంద్రాన్ని పరిశీలించిన జిల్లా కలెక్టర్

ఈ శిక్షణా కార్యక్రమాన్ని జిల్లా కలెక్టర్ ఎ. శ్యామ్ ప్రసాద్ సందర్శించారు. శిక్షణ పొందుతున్న వైద్యాధికారులు, సంజీవని మిత్రులతో ముఖాముఖి మాట్లాడి శిక్షణ అందిస్తున్న విధానం, వారికి కల్పించిన వసతులను పరిశీలించారు. శిక్షణలో నేర్చుకుంటున్న అంశాలను క్షేత్రస్థాయిలో ఎలా అమలు చేయాలనే విషయాలపై సిబ్బందికి పలు సూచనలు చేశారు.

సంజీవని కార్యక్రమాన్ని వందశాతం విజయవంతం చేయాలి

ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా చేపట్టిన సంజీవని కార్యక్రమాన్ని జిల్లాలో నూటికి నూరు శాతం విజయవంతం చేయాలని సూచించారు. గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లో ప్రతి ఒక్కరికీ నాణ్యమైన, మెరుగైన వైద్య సేవలు అందేలా వైద్య సిబ్బంది పూర్తి అంకితభావంతో పనిచేయాలన్నారు. శిక్షణలో పొందిన పరిజ్ఞానాన్ని విధుల్లో సమర్థవంతంగా వినియోగిస్తూ, పరస్పర సమన్వయంతో ప్రజలకు మెరుగైన ఆరోగ్య సేవలు అందించాలని దిశానిర్దేశం చేశారు.

ఈ కార్యక్రమంలో సంజీవని కార్యక్రమ నోడల్ అధికారి డాక్టర్ జె. పద్మజ, డీపీఓ-ఎన్‌హెచ్‌ఎం ఇన్‌చార్జ్, TATA MD బృందం ప్రతినిధులు, వివిధ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల వైద్యాధికారులు, సంజీవని మిత్రులు, వైద్య ఆరోగ్య శాఖ సిబ్బంది పాల్గొన్నారు.

నల్లమాడలో వైసీపీ షాక్..
పల్లె సమక్షంలో పసుపు కండువా కప్పుకున్న మాజీ సర్పంచ్!



పెమనకుంటపల్లి తాండలో ఒకేసారి 12 కుటుంబాలు టీడీపీలో చేరిక.. మాజీ మంత్రి పల్లె రఘునాథ్ రెడ్డి ఆధ్వర్యంలో పార్టీలోకి ఆహ్వానం

నల్లమాడ, నవంబర్ 20 ((విజన్ ఆంధ్ర) విలేకరి)

శ్రీ సత్యసాయి జిల్లా పుట్టపర్తి నియోజకవర్గం నల్లమాడ మండలంలో తెలుగుదేశం పార్టీకి రోజురోజుకూ ఆదరణ పెరుగుతోందని ఆ పార్టీ నాయకులు పేర్కొన్నారు. తాజాగా నల్లమాడ మాజీ సర్పంచ్ ఆర్.కె. రంగలాల్ నాయక్ వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీని వీడి తెలుగుదేశం పార్టీలో చేరారు. ఆయనతో పాటు పెమనకుంటపల్లి తాండకు చెందిన 12 కుటుంబాల వారు మాజీ మంత్రి డాక్టర్ పల్లె రఘునాథ్ రెడ్డి ఆధ్వర్యంలో టీడీపీ తీర్థం పుచ్చుకున్నారు. మాజీ మంత్రి పల్లె రఘునాథ్ రెడ్డి వారికి పార్టీ కండువాలు కప్పి సాదరంగా పార్టీలోకి ఆహ్వానించారు. ఒకేసారి పలువురు నాయకులు, కుటుంబాలు టీడీపీలో చేరడంతో నల్లమాడ మండల రాజకీయాల్లో ఈ పరిణామం ప్రాధాన్యత సంతరించుకుంది.

వైఎస్సార్సీపీని వీడి టీడీపీలో చేరిన వారిలో నల్లమాడ మాజీ సర్పంచ్ ఆర్.కె. రంగలాల్ నాయక్, ఆర్.కె. రమణ నాయక్, ఆర్.జి. కృష్ణా నాయక్, తిప్పా నాయక్, శ్రీరాములు నాయక్, ఆర్. కమిలి భాయి, బి. చౌలిబాయి, ఆర్.హెచ్. శాంతి బాయి, ఆర్. అక్కులప్ప నాయక్, ఆర్. శంకర్ నాయక్, తిరుపాల్ నాయక్, కృష్ణ నాయక్ తదితరులు ఉన్నారు. వీరంతా మాజీ మంత్రి పల్లె రఘునాథ్ రెడ్డి నాయకత్వంపై విశ్వాసంతో తెలుగుదేశం పార్టీలో చేరినట్లు తెలిపారు.

ప్రజల మనిషి పల్లె రఘునాథ్ రెడ్డి

ఈ సందర్భంగా నల్లమాడ మాజీ సర్పంచ్ రంగలాల్ నాయక్ మాట్లాడుతూ మాజీ మంత్రి డాక్టర్ పల్లె రఘునాథ్ రెడ్డి ప్రజల మనిషి అని, ప్రజలకు సేవ చేయాలనే సంకల్పంతో నిరంతరం పనిచేసే నాయకుడని కొనియాడారు. పార్టీ కార్యకర్తలను సొంత బిడ్డల్లా చూసుకునే గొప్ప మనస్తత్వం ఆయనదని పేర్కొన్నారు. గతంలో పల్లె రఘునాథ్ రెడ్డి మంత్రిగా ఉన్న సమయంలో తాను నల్లమాడ సర్పంచ్‌గా బాధ్యతలు నిర్వహించానని, అప్పట్లో పార్టీలకతీతంగా గ్రామ అభివృద్ధికి నిధులు కేటాయించి సహకరించారని గుర్తుచేశారు. ప్రజల అవసరాలు, గ్రామాల అభివృద్ధి పట్ల ఆయనకు ప్రత్యేక శ్రద్ధ ఉండేదని తెలిపారు.

చంద్రబాబు నాయకత్వంలో రాష్ట్రం అభివృద్ధి పథంలో

ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు నాయకత్వంలో రాష్ట్రం అభివృద్ధి దిశగా ముందుకు సాగుతోందని రంగలాల్ నాయక్ పేర్కొన్నారు. పుట్టపర్తి నియోజకవర్గ అభివృద్ధి కోసం ఎమ్మెల్యే పల్లె సింధూర రెడ్డి చేస్తున్న కృషి అభినందనీయమన్నారు. పుట్టపర్తిలో విమానాల తయారీ పరిశ్రమ ఏర్పాటు, పెడపల్లిలో మహిళలకు ఉపాధి కల్పించే గార్మెంట్స్ పరిశ్రమ వంటి అభివృద్ధి ప్రతిపాదనలు నియోజకవర్గానికి ఎంతో ఉపయోగకరంగా ఉంటాయని తెలిపారు. సత్యసాయి బాబా జయంతిని రాష్ట్ర పండుగగా ప్రకటించాలన్న ఎమ్మెల్యే పల్లె సింధూర రెడ్డి విజ్ఞప్తికి ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు సానుకూలంగా స్పందించి, సత్యసాయి బాబా శతజయంతి వేడుకలను రాష్ట్ర ప్రభుత్వం ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించడం హర్షణీయమన్నారు. ఇలాంటి అభివృద్ధి, ప్రజా సంక్షేమ కార్యక్రమాలతో రాష్ట్రం మరింత ముందుకు సాగుతుందనే నమ్మకంతోనే తాము తెలుగుదేశం పార్టీలో చేరినట్లు వెల్లడించారు.

- కొత్తగా చేరిన వారికి పార్టీ అండగా ఉంటుంది

ఈ సందర్భంగా మాజీ మంత్రి పల్లె రఘునాథ్ రెడ్డి పార్టీలో చేరిన వారందరికీ స్వాగతం పలుకుతూ తెలుగుదేశం పార్టీ అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని సూచించారు. పార్టీ బలోపేతానికి ప్రతి ఒక్కరూ కలిసికట్టుగా పనిచేయాలని, గ్రామస్థాయిలో ప్రజలకు అందుబాటులో ఉంటూ వారి సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని పిలుపునిచ్చారు.

ఈ కార్యక్రమంలో మండల కన్వీనర్ మైలే శంకర్, హాస్పిటల్ డైరెక్టర్ డాక్టర్ బుట్టి నాగభూషణం నాయుడు, సొసైటీ డైరెక్టర్ నాగ్య నాయక్, సేవే నాయక్, రవీందర్ నాయక్, అశోక్ నాయక్, శంకర్ నాయక్, హరిలాల్ నాయక్, నారాయణ నాయక్, బొజ్జె నాయక్ తదితర తెలుగుదేశం పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



రాజ్యాంగ విలువల పరిరక్షణకు
బాధ్యతాయుత పౌరసత్వం

మొదటిపేజీ తరువాయి

మహిళా సాధికారత నుంచి మహిళా నాయకత్వంలోని అభివృద్ధి దిశగా భారత్ ముందుకు సాగుతోందని చెప్పారు. మహిళలకు రాజకీయ ప్రాతినిధ్యం పెంచే నారీశక్తి వందన్ చట్టం వంటి చర్యలు ఈ దిశగా దోహదపడుతున్నాయని వివరించారు.రాజ్యాంగంలోని 21వ అధికరణం పరిధి కాలానుగుణంగా విస్తరించి గౌరవప్రదమైన జీవనం, జీవనోపాధి, ఆరోగ్యం, గృహవసతి, వ్యక్తిగత గోప్యత, విద్య, పర్యావరణ పరిరక్షణ వంటి హక్కులకు విస్తరించిందని ఉపరాష్ట్రపతి తెలిపారు. అభివృద్ధితోపాటు పర్యావరణ పరిరక్షణకు సమాన ప్రాధాన్యం ఇవ్వాలని సూచించారు. సహజ వనరులను వినియోగించుకునేటప్పుడు భవిష్యత్ తరాలకు వాటిని భద్రంగా అందించాల్సిన బాధ్యతను మరవకూడదన్నారు. బాధ్యతాయుత వినియోగం, పర్యావరణహిత జీవనశైలిపై ప్రజల్లో అవగాహన పెంచాలని పిలుపునిచ్చారు.ప్రధాని ప్రారంభించిన మిషన్ లైఫ్ కార్యక్రమం పర్యావరణ పరిరక్షణకు అనుగుణమైన జీవనశైలిని ప్రపంచవ్యాప్తంగా ప్రోత్సహిస్తోందని పేర్కొన్నారు. డిజిటల్ ప్రజా మౌలిక సదుపాయాలు, కృత్రిమ మేధ, సాంకేతిక ఆవిష్కరణల్లో భారత్ సాధిస్తున్న పురోగతిని ప్రస్తావిస్తూ, సాంకేతికత మానవాళి సేవకు ఉపయోగపడాలని, రాజ్యాంగ విలువలకు అనుగుణంగా ఉండాలని స్పష్టం చేశారు. విద్యార్థులు బాధ్యతాయుత పౌరులుగా ఎదిగి, నిర్మాణాత్మక చర్చల్లో పాల్గొంటూ ప్రజాస్వామ్య సంస్థల బలోపేతానికి కృషి చేయాలని సూచించారు. 2047 నాటికి అభివృద్ధి చెందిన భారత్ లక్ష్యాన్ని సాధించే క్రమంలో రాజ్యాంగ విలువలే దేశ ప్రగతికి పునాదిగా నిలవాలని ఉపరాష్ట్రపతి ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో కేంద్ర న్యాయ, పార్లమెంటరీ వ్యవహారాల సహాయ మంత్రి అర్జున్ రామ్ మేఘ్వాల్, భారత అటార్నీ జనరల్ ఆర్. వెంకటరమణి, బెన్నెట్ విశ్వవిద్యాలయ ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.



తుఫాన్లతో ఏపీలో ఉద్యాన పంటలకు రూ.1,092 కోట్ల నష్టం

మొదటిపేజీ తరువాయి

అర్నబ్ తుఫాను కారణంగా 215 మండలాల్లోని 23,211 హెక్టార్లలోని ఉద్యాన పంటలు దెబ్బతిన్నట్టు వివరించారు. ఒక్క అరటి పంటే 15,549 హెక్టార్లలో దెబ్బతిందని వివరించారు. మురసు తుఫాను ప్రభావంతో 108 మండలాల్లోని 6,748 హెక్టార్లలో ఉద్యాన పంటలు దెబ్బతిన్నాయని సీఎం తెలిపారు. దెబ్బతిన్న తోటల పునరుద్ధరణ, రైతులను ఆదుకునేందుకు వివిధ కేంద్ర పథకాల కింద అదనంగా రూ.96.33 కోట్ల సాయం అందించాలని సీఎం కోరారు. అత్యధికంగా అరటి పంట తీవ్రస్థాయిలో దెబ్బతిందని దానిని పునరుద్ధరించేందుకు మిషన్ ఫర్ ఇంటిగ్రేటెడ్ హార్టికల్చర్ డెవలప్మెంట్ స్కీమ్ కింద హెక్టారుకు రూ.44 వేల చొప్పున నిధులు అందించాలని కోరారు. రాష్ట్రీయ కృషి వికాస్ యోజన కింద ఎండుమిర్చి, కూరగాయల పంటలను ఆదుకోవాలని లేఖలో విజ్ఞప్తి చేశారు. అలాగే కోనసీమ, కాకినాడ, తూర్పుగోదావరి, పశ్చిమగోదావరి, ఏలూరు, కృష్ణ, బాపట్ల, తదితర జిల్లాల్లో మొవ్వ విరిగిన కొబ్బరి చెట్లకు కోకోనట్ డెవలప్మెంట్ బోర్డు నుంచి ఆర్థిక సహకారం అందించాలని కోరారు. తోటల పునరుద్ధరణ, దీర్ఘకాలిక ఆర్థిక నష్టాలను తగ్గించేందుకు త్వరితగతిన సాయం అందించాలని ముఖ్యమంత్రి చంద్రబాబు తన లేఖలో విజ్ఞప్తి చేశారు.

విజన్ ఆంధ్ర
తెలుగు దినపత్రిక

శ్రీ సత్యసాయి జిల్లా పరిషత్ నూతన చైర్మన్‌గా పరిటాల శ్రీరామ్

వైస్ చైర్మన్‌గా దాసరి సునేత్ర ప్రమాణ స్వీకారం

ప్రమాణ స్వీకారం చేయించిన జిల్లా కలెక్టర్ శ్యామ్ ప్రసాద్













పుట్టపర్తి,నవంబర్,20((విజన్ ఆంధ్ర) ప్రత్యేక ప్రతినిధి)

శ్రీ సత్యసాయి జిల్లా పరిషత్ నూతన పాలకవర్గం కొలువుదీరింది. పుట్టపర్తి రైల్వే స్టేషన్ సమీపంలోని రెవెన్యూ భవన్‌లో అత్యంత కోలాహలంగా నిర్వహించిన ప్రత్యేక కార్యక్రమంలో జిల్లా పరిషత్ చైర్మన్, వైస్ చైర్మన్ ఎన్నిక ప్రక్రియ ప్రశాంతంగా ముగిసింది.ఈ ఎన్నికల్లో జిల్లా పరిషత్ చైర్మన్‌గా పరిటాల శ్రీరామ్, వైస్ చైర్మన్‌గా దాసరి సునేత్ర ఏకగ్రీవ మెజారిటీతో ఎన్నికయ్యారు. అనంతరం జరిగిన కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ శ్యామ్ ప్రసాద్ నూతనంగా ఎన్నికైన చైర్మన్ పరిటాల శ్రీరామ్, వైస్ చైర్మన్ దాసరి సునేత్రతో పాటు జిల్లా పరిషత్ ప్రాదేశిక నియోజకవర్గ సభ్యుల (జడ్పీటీసీ) చేత పదవీ బాధ్యతల ప్రమాణ స్వీకారం చేయించారు.

ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ శ్యామ్ ప్రసాద్ మాట్లాడుతూ..నూతనంగా ఎన్నికైన చైర్మన్, వైస్ చైర్మన్ మరియు జడ్పీటీసీ సభ్యులకు హృదయపూర్వక శుభాకాంక్షలు తెలియజేశారు. జిల్లాలోని గ్రామీణ ప్రాంతాల మౌలిక వసతుల కల్పన, ప్రభుత్వ సంక్షేమ పథకాలను అర్హులైన ప్రతి ఒక్కరికీ చేరవేయడంలో ప్రజాప్రతినిధుల పాత్ర ఎంతో కీలకమని పేర్కొన్నారు. అధికార యంత్రాంగం, ప్రజాప్రతినిధులు సమన్వయంతో పనిచేసి శ్రీ సత్యసాయి జిల్లాను అన్ని రంగాల్లో అగ్రగామిగా నిలపాలని ఆకాంక్షించారు.

నూతన చైర్మన్ పరిటాల శ్రీరామ్ మాట్లాడుతూ..తనపై నమ్మకంతో ఈ బాధ్యతను అప్పగించిన కూటమి నాయకులకు, జడ్పీటీసీ సభ్యులకు కృతజ్ఞతలు తెలిపారు. జిల్లా అభివృద్ధికి, ప్రజల సమస్యల పరిష్కారానికి నిరంతరం అందుబాటులో ఉంటూ శక్తివంచన లేకుండా కృషి చేస్తానని స్పష్టం చేశారు.

ఈ కార్యక్రమానికి బీసీ సంక్షేమ శాఖ మంత్రి సవిత,ఎంపీ పార్థసారధి,రాప్తాడు ఎమ్మెల్యే పరిటాల సునీత,మడకసిర ఎమ్మెల్యే ఎంఎస్ రాజు, కదిరి ఎమ్మెల్యే కందికుంట వెంకటప్రసాద్,పుట్టపర్తి ఎమ్మెల్యే పల్లె సింధూరారెడ్డి,మాజీ మంత్రి పల్లె రఘునాథ్ రెడ్డి,మాజీ ఎంఎల్‌సి గుండుమాల తిప్పేస్వామి ఇతర ప్రజాప్రతినిధులు, కూటమి పార్టీల ముఖ్య నాయకులు, కార్యకర్తలు మరియు వివిధ శాఖల జిల్లా అధికారులు పెద్ద ఎత్తున హాజరై నూతన పాలకవర్గానికి అభినందనలు తెలియజేశారు.


శ్రీ పద్మావతి అమ్మవారికి వెండి తిరుమంజన పాత్ర బహూకరణ



తిరుపతి, నవంబర్ 20((విజన్ ఆంధ్ర) ప్రతినిధి)

తిరుచానూరులోని శ్రీ పద్మావతి అమ్మవారికి శుక్రవారం ఎస్వీబీసీ ఛైర్మన్ శ్రీధర్ వర్మ రూ.5 లక్షల విలువైన 2.5 కిలోల వెండి తిరుమంజన పాత్రను బహూకరించారు. ఈ సందర్భంగా ఎస్వీబీసీ ఛైర్మన్ శ్రీధర్ వర్మ, వారి సతీమణి, కార్పొరేటర్ జ్యోత్స్న, కుమార్తె హర్షిత వర్మతో కలిసి శ్రీ పద్మావతి అమ్మవారి ఆలయానికి చేరుకుని, ఆలయ ఏఈవో దేవరాజులుకు వెండి తిరుమంజన పాత్రను అందజేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ అర్చకులు బాబు స్వామి, టెంపుల్ ఇన్స్పెక్టర్ లక్ష్మీ కాంతం, ఇతర అధికారులు పాల్గొన్నారు.

సార్వత్రిక విద్యాపీఠాన్ని సద్వినియోగం చేసుకోండి



మాట్లాడుతున్న సార్వత్రిక విద్యాపీఠం రాష్ట్ర కోఆర్డినేటర్ రవీంద్రనాథ్

ఆమడగూరు, నవంబర్ 20((విజన్ ఆంధ్ర) ప్రతినిధి)

శ్రీ సత్యసాయి జిల్లా మండల కేంద్రంలోని ఆమడగూరు పి.యం శ్రీ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు ఆంధ్రప్రదేశ్ సార్వత్రిక విద్యాపీఠం సార్వత్రిక విద్య ఆధ్యయన కేంద్రాన్ని మంజూరు చేసిందని సత్య సాయి జిల్లా పరీక్షల అసిస్టెంట్ కమిషనర్ ఎం.లాజర్ మరియు ఓపెన్ స్కూల్ స్టేట్ కోఆర్డినేటర్ పి. రవీంద్రనాథ్ లు తెలిపారు. శుక్రవారం ఇరువురు పాఠశాలను సందర్శించారు.ఈ సంధర్భంగా పాఠశాలలో బోధన,బోధనేతర సిబ్బందితో ప్రత్యేక సమావేశం నిర్వహించారు.మిషన్ మార్చి 2027 కార్య క్రమంలో భాగంగా పదవ తరగతి గదికి వెళ్లి విద్యార్థులతో ముఖాముఖి మాట్లాడారు.విద్యార్థుల మొబైల్ ఫోన్లకు దూరంగా ఉండి ఇష్టపడి, కష్టపడి చదవాలని,వెనకబడిన విద్యార్థులపై ప్రత్యేక వ్యక్తిగత దృష్టి సారించి వంద శాతం ఉత్తీర్ణతకు కృషి చేయాలని ఉపాధ్యాయులను కోరారు. ప్రతి ఒక్క ఉపాధ్యాయుడు కొత్తగా మంజూరైన సార్వత్రిక విద్యాపీఠ ప్రవేశాల కోసం కృషి చేయాలని, ఓపెన్ స్కూల్ విద్యావిధానం యొక్క ప్రాముఖ్యతను ప్రజల్లోకి విస్తృతంగా తీసుకెళ్లాలని, చదువు మధ్యలో మానేసిన విద్యార్థులు మరియు విద్యను కొనసాగించలేకపోయిన అర్హులైన వారికి అవగాహన కల్పించాలని సూచించారు. ఓపెన్ స్కూల్ అడ్మిషన్లు పెంచేందుకు విస్తృత ప్రచార కార్యక్రమాలు నిర్వహించాలని, ప్రతి ఒక్కరు ఈ కార్యక్రమంలో భాగస్వాములు కావాలని తెలిపారు. ఈ అవకాశాన్ని పదవ తరగతి మరియు ఇంటర్మీడియట్ తప్పిన విద్యార్థులు,అంగన్వాడి వర్కర్స్, హోంగార్డ్స్, ఆశా వర్కర్లు,మహిళా సంఘ సభ్యులు, చిన్న చిన్న పనులు చేసుకుంటూ జీవించే ప్రతి ఒక్కరు కూడా ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని తెలియజేశారు.సెల్ఫ్ హెల్ప్ గ్రూప్స్, మెప్మా, ఐసిడిఎస్, మెడికల్ డిపార్ట్మెంట్, డ్వాక్రా, డ్వామా మొదలగు అన్ని డిపార్ట్మెంట్లో పదవ తరగతి ఇంటర్మీడియట్ పాస్ కాని వారందరూ కూడా ఓపెన్ స్కూల్ ను సద్వినియోగం చేసుకోనవలెనని తెలియజేశారు. సమావేశ అనంతరం సార్వత్రిక విద్యాపీఠ ప్రవేశాలకు సంబంధించిన గోడ పత్రికలను ఉపాధ్యాయులతో కలిసి ఆవిష్కరించడం జరిగినది. ఈ కార్యక్రమంలో జిల్లా అసిస్టెంట్ కమిషన్ ఫర్ గవర్నమెంట్ ఎగ్జామినేషన్ లాజరు,ఓపెన్ స్కూల్ స్టేట్ కోఆర్డినేటర్ రవీంద్రనాథ్, ఇంచార్జ్ ప్రధానోపాధ్యాయులు ప్రభాకర్ రెడ్డి, మండల విద్యాశాఖాధికారిని సంపూర్ణ బోధన బోధనేతర సిబ్బంది పాల్గొన్నారు.

పకడ్బందీగా జనగణన రెండో దశ నిర్వహణ

ఆర్డీఓలు,మున్సిపల్ కమిషనర్లు,

తహసీల్దార్లు,ఎంపిడిఓలు టెక్నికల్ అసిస్టెంట్ కు

శిక్షణలో జిల్లా కలెక్టర్ దిశానిర్దేశం

పుట్టపర్తి నవంబర్ 20((విజన్ ఆంధ్ర) ప్రత్యేక ప్రతినిధి)

శుక్రవారం పుట్టపర్తి సాంస్కృతి కళాశాలలో జిల్లాలో జరగనున్న జనగణన (Census) రెండో దశ ప్రక్రియను అత్యంత పకడ్బందీగా నిర్వహించేందుకు ఆర్డీఓలు,మున్సిపల్ కమిషనర్లు, తహసీల్దార్లు,ఎంపిడిఓలు టెక్నికల్ అసిస్టెంట్ కు శిక్షణ కార్యక్రమం, జిల్లా కలెక్టర్ శ్యామ్ ప్రసాద్ సమక్షంలో మరియు జిల్లా జనగణన నోడల్ అధికారి సూర్యపర్ధన్ రెడ్డి ఆధ్వర్యంలో విజయవంతంగా నిర్వహించబడింది.

ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ..

దేశ ప్రగతికి మరియు భవిష్యత్ ప్రణాళికల రూపకల్పనకు జనగణన గణాంకాలు ఎంతో కీలకమని తెలిపారు. క్షేత్రస్థాయి విధుల నిర్వహణలో ఆర్డీఓలు,మున్సిపల్ కమిషనర్లు, తహసీల్దార్లు,ఎంపిడిఓలు టెక్నికల్ అసిస్టెంట్ కు పాత్ర వెన్నెముక వంటిదని పేర్కొన్నారు. నేడు శిక్షణ పొందిన ఈ ఆర్డీఓలు,మున్సిపల్ కమిషనర్లు, తహసీల్దార్లు,ఎంపిడిఓలు టెక్నికల్ అసిస్టెంట్ కు తదుపరి దశలో క్షేత్రస్థాయిలో ప్రత్యక్షంగా విధులు నిర్వహించే సూపర్‌వైజర్లు మరియు ఎన్యూమరేటర్లకు నాణ్యమైన శిక్షణను అందిస్తారని తెలిపారు. జనగణన ప్రక్రియను ఎటువంటి లోటుపాట్లు లేకుండా సమర్థవంతంగా పూర్తి చేసేందుకు ప్రతి ఒక్కరూ మార్గదర్శకాలు మరియు విధివిధానాలపై పూర్తి స్థాయి అవగాహన కలిగి ఉండాలని సూచించారు.

జనగణన రెండో దశ షెడ్యూల్ వివరాలు:

స్వీయ గణన (సెల్ఫ్ ఏనుమేరేషన్) – జనవరి 10 నుండి జనవరి 24 వరకు

ఈ 15 రోజుల కాలంలో ప్రజలు డిజిటల్ మాధ్యమాల ద్వారా స్వయంగా తమ కుటుంబ వివరాలను ఆన్‌లైన్‌లో నమోదు చేసుకునే వెసులుబాటు కల్పించబడింది.

క్షేత్రస్థాయి జనగణన (ఫీల్డ్ ఏనుమేరేషన్) – జనవరి 25 నుండి ఫిబ్రవరి 28 వరకు:

మొత్తం 35 రోజుల పాటు క్షేత్రస్థాయిలో ఇంటింటి సర్వే నిర్వహించబడుతుంది. ఈ సమయంలో ఎన్యూమరేటర్లు ప్రతి ఇంటిని సందర్శించి కుటుంబ సభ్యుల సమగ్ర వివరాలను సేకరిస్తారు.

పునఃపరిశీలన మార్చి 1 నుండి మార్చి 5 వరకు:

ఈ 5 రోజుల పాటు సేకరించిన వివరాల పునఃపరిశీలన కార్యక్రమం నిర్వహించబడుతుంది. ఎవరైనా నమోదు కాకుండా మిగిలిపోయినా, లేదా మార్పులు చేర్పులు ఉన్నా ఈ దశలో సరిచేయబడతాయి.

జనగణన ప్రక్రియలో భాగంగా నియమించబడిన ఫీల్డ్ ట్రైనర్లు శిక్షణ తరువాత ఎన్యుమరేటర్లులకు శిక్షణ ఇచ్చి ప్రతి ఇంటిని సందర్శించి వివరాలను సేకరిస్తుండగా, సూపర్‌వైజర్లు ఈ మొత్తం ప్రక్రియను నిరంతరం పర్యవేక్షిస్తూ తగు సూచనలు అందిస్తారని అధికారులు తెలిపారు.

జిల్లా జనగణన నోడల్ అధికారి సూర్యవర్ధన్ రెడ్డి మాట్లాడుతూ, జనగణన ప్రక్రియలో ఎలాంటి పొరపాట్లకు తావులేకుండా, ప్రతి కుటుంబానికి సంబంధించిన ఖచ్చితమైన మరియు వాస్తవ సమాచారాన్ని సేకరించడం ద్వారా అత్యంత విశ్వసనీయమైన గణాంకాలను రూపొందించవచ్చని పేర్కొన్నారు. ఈ జాతీయ ప్రాధాన్యత కలిగిన కార్యక్రమం విజయవంతం కావడానికి జిల్లా ప్రజలందరూ తమ ఇళ్లకు వచ్చే ఎన్యూమరేటర్లకు సరైన సమాచారం అందించి, పూర్తి సహకారం అందించాలని ఆయన విజ్ఞప్తి చేశారు.

తనకల్లు అభివృద్ధే లక్ష్యంగా వినోద్ ముందడుగు



తనకల్లు నవంబర్ 20 (విజన్ ఆంధ్ర)

తనకల్లు: తనకల్లు మేజర్ గ్రామ పంచాయతీ వైఎస్సార్‌సీపీ బలపరిచిన సర్పంచ్ అభ్యర్థి వినోద్ యువకుడు, ఉత్సాహవంతుడు, నిండు మానవత్వం కలిగిన వ్యక్తిగా ప్రజల ముందుకు వస్తున్నారు. మంచితనానికి మారుపేరుగా, గ్రామ ప్రజలతో కుటుంబ సభ్యుడిలా కలిసిపోయే మనస్తత్వం కలిగిన వ్యక్తిగా ఆయనకు గుర్తింపు ఉందని ఆయన మద్దతుదారులు పేర్కొంటున్నారు. సమాజమే ఒక దేవాలయమని, ప్రజలే దేవుళ్లని నమ్మే సిద్ధాంతంతో గ్రామ ప్రజల సేవకు ముందుకు వచ్చిన వినోద్‌కు అవకాశం కల్పిస్తే తనకల్లును ఆదర్శ గ్రామంగా తీర్చిదిద్దుతారనే నమ్మకాన్ని వ్యక్తం చేస్తున్నారు. గ్రామానికి అవసరమైన నిధులు తీసుకురావడం, ప్రతి వీధికి రోడ్డు సౌకర్యం కల్పించడం, ప్రతి ఇంటికి తాగునీటి వసతి, వీధి దీపాలు ఏర్పాటు చేయడం వంటి అభివృద్ధి కార్యక్రమాలకు ప్రాధాన్యత ఇస్తారని చెబుతున్నారు. అంతేకాకుండా గ్రామంలో ఏ కుటుంబానికి కష్టం వచ్చినా, ఏ వ్యక్తికి ఆపద ఎదురైనా అండగా నిలవడం ఆయన లక్ష్యమని పేర్కొంటున్నారు. ఓర్పు, సహనం, సేవాభావంతో గ్రామ అభివృద్ధికి కృషి చేస్తారనే విశ్వాసంతో తనకల్లు ప్రజలందరూ వినోద్‌కు తమ అమూల్యమైన ఓటును వేసి, వేయించి అఖండ మెజారిటీతో గెలిపించాలని ఆయన మద్దతుదారులు విజ్ఞప్తి చేస్తున్నారు.

వే ఫౌండేషన్ ఆధ్వర్యంలో బాలల దినోత్సవ వారోత్సవాలు



తిరుపతి, నవంబర్ 20((విజన్ ఆంధ్ర) ప్రతినిధి)

బాలల దినోత్సవ వారోత్సవాల సందర్భంగా తిరుపతి మంగళంలోని బాలుర పరిశీలనా గృహంలో వే ఫౌండేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన బాలల వారోత్సవాల ముగింపు కార్యక్రమం శుక్రవారం ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా జిల్లా ప్రాంతీయ రవాణా అధికారి మురళీమోహన్, మానస్ హాస్పిటల్ మానసిక వైద్య నిపుణులు డాక్టర్ కిషోర్ కుమార్ హాజరయ్యారు. అలాగే రత్నశేఖర్, థామస్, మహిళా విశ్వవిద్యాలయ ప్రొఫెసర్ లలిత కుమారి పాల్గొని బాలలకు తమ విలువైన సందేశాలను అందించారు. ఈ సందర్భంగా ముఖ్య అతిథులు మాట్లాడుతూ బాలలు జీవితంలో ఎదురయ్యే సవాళ్లను ధైర్యంగా ఎదుర్కోవాలని, ఆత్మవిశ్వాసం, క్రమశిక్షణ, మంచి ఆలోచనా విధానం అలవర్చుకోవాలని సూచించారు. ముఖ్యంగా పిల్లల్లో మానసిక స్థైర్యాన్ని పెంపొందించడం, వారి భావోద్వేగాలను అర్థం చేసుకోవడం, సానుకూల దృక్పథాన్ని పెంచడం ఎంతో అవసరమని డాక్టర్ కిషోర్ కుమార్ వివరించారు. ప్రతి బాలుడిలోనూ ప్రత్యేకమైన ప్రతిభ ఉంటుందని, వారికి సరైన ప్రోత్సాహం, మార్గదర్శకత్వం అందిస్తే ఉన్నత స్థాయికి ఎదగగలరని అతిథులు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో వే ఫౌండేషన్ వ్యవస్థాపకులు డాక్టర్ పైడి అంకయ్య స్వయంగా రచించిన 'మంచి మనసుతో మంచి సమాజం వైపు' అనే పుస్తకాన్ని ప్రముఖ మానసిక వైద్య నిపుణులు డాక్టర్ కే. కిషోర్ కుమార్ ఆవిష్కరించి అందజేశారు. ఈ పుస్తకంలో పిల్లల నడవడిక, వారి వ్యక్తిత్వ వికాసం, తల్లిదండ్రులు పిల్లల పట్ల ఎలా వ్యవహరించాలి, పిల్లల్లో మంచి విలువలు, క్రమశిక్షణ, మానవీయత ఎలా పెంపొందించాలి అనే అంశాలను చక్కగా వివరించారని డాక్టర్ కిషోర్ కుమార్ అభిప్రాయపడ్డారు. సమాజంలో మంచి మార్పు తీసుకురావడానికి ఉపయోగపడే విలువైన ఆలోచనలను పుస్తక రూపంలో అందించిన డాక్టర్ పైడి అంకయ్యను ఆయన ప్రత్యేకంగా అభినందించారు. ఈ కార్యక్రమంలో బాలుర పరిశీలనా గృహం సూపరింటెండెంట్, సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

దేవరింటివారిపల్లిలో వైఎస్సార్‌సీపీ అభ్యర్థి తాటిచర్ల షమీమ్ ప్రచారం

నల్ల చెరువు నవంబర్ 20 (విజన్ ఆంధ్ర)

నల్లచెరువు మండల పరిధిలోని దేవరింటివారిపల్లి గ్రామంలో వైఎస్సార్‌సీపీ బలపరిచిన సర్పంచ్ అభ్యర్థి తాటిచర్ల షమీమ్ ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ ప్రచార కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ రవికుమార్ రెడ్డి పాల్గొని అభ్యర్థితో కలిసి గ్రామంలో పర్యటించారు.

ఈ సందర్భంగా గ్రామ నాయకులు, స్థానిక మహిళలు, గ్రామస్తులు ప్రచారంలో పాల్గొన్నారు. గ్రామంలోని ప్రజలను కలుసుకుంటూ అభ్యర్థి ప్రచారం కొనసాగించారు. కార్యక్రమంలో స్థానిక నాయకులు, పార్టీ కార్యకర్తలు పాల్గొన్నారు.

అల్లుగుండు సర్పంచ్ అభ్యర్థిగా ఓయనమల శివారెడ్డి నామినేషన్ దాఖలు

నల్ల చెరువు నవంబర్ 20 (విజన్ ఆంధ్ర)

నల్లచెరువు మండల పరిధిలోని అల్లుగుండు గ్రామ పంచాయతీ తెలుగుదేశం పార్టీ బలపరిచిన సర్పంచ్ అభ్యర్థిగా యనమల శివారెడ్డి నామినేషన్ దాఖలు చేశారు. జోగన్నపేటలోని రిటర్నింగ్ అధికారి వద్ద ఆయన నామినేషన్ పత్రాలను సమర్పించారు. ఈ కార్యక్రమంలో టీడీపీ మండల కన్వీనర్ రాజశేఖర్ బాబుతో పాటు పలువురు పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

మీనాక్షి మృతి ఘటనపై సమగ్ర విచారణ జరపాలి

బాధ్యులను గుర్తించి కఠినంగా శిక్షించాలి

ఐద్వా గిరిజన మహిళా సంఘం జిల్లా జాయింట్ సెక్రటరీ దీసరి దేముడమ్మ డిమాండ్



అనంతగిరి, నవంబర్ 19((విజన్ ఆంధ్ర) ప్రతినిధి)

అల్లూరి సీతారామరాజు జిల్లా అరకు లోయలో అనుమానాస్పద స్థితిలో మృతి చెందిన ఐటీఐ విద్యార్థిని కిల్లో మీనాక్షి (20) మృతి ఘటనపై సమగ్ర, నిష్పక్షపాత విచారణ జరిపించాలని ఐద్వా గిరిజన మహిళా సంఘం జిల్లా జాయింట్ సెక్రటరీ దీసరి దేముడమ్మ డిమాండ్ చేశారు.

ఈ సందర్భంగా అనంతగిరి మండలంలో నిర్వహించిన మీడియా సమావేశంలో ఆమె మాట్లాడుతూ.. మీనాక్షి మృతి వెనుక ఉన్న వాస్తవాలను వెలికితీసి, ఘటనకు బాధ్యులైన వారిని గుర్తించి చట్ట ప్రకారం కఠినంగా శిక్షించాలని కోరారు. మీనాక్షి కుటుంబానికి ప్రభుత్వం తక్షణమే తగిన నష్టపరిహారం అందించి, ఆర్థికంగా ఆదుకోవాలని విజ్ఞప్తి చేశారు. బాధిత కుటుంబానికి న్యాయం జరిగే వరకు వారి తరఫున ఐద్వా గిరిజన మహిళా సంఘం అండగా నిలబడి పోరాటం కొనసాగిస్తుందని ఐద్వా గిరిజన మహిళా సంఘం జిల్లా జాయింట్ సెక్రటరీ దీసరి దేముడమ్మ స్పష్టం చేశారు.

బైండోవర్ నిబంధనలు ఉల్లంఘిస్తే సెక్యూరిటీ బాండ్ మొత్తాన్ని రికవరీ చేస్తాం

- విజయనగరం జిల్లా ఎస్పీ ఎ.ఆర్.దామోదర్, ఐపీఎస్



విజయనగరం, నవంబర్ 20((విజన్ ఆంధ్ర) ప్రత్యేక ప్రతినిధి)

గ్రామ పంచాయతీ ఎన్నికలను సజావుగా, ప్రశాంతంగా, పారదర్శకంగా నిర్వహించేందుకు జిల్లా పోలీసు శాఖ పటిష్టమైన ముందస్తు చర్యలు చేపడుతున్నదని, ఇందులో భాగంగా ఇప్పటికే 26వేల మందిపై బైండోవరు కేసులు నమోదు చేశామని జిల్లా ఎస్పీ ఎ.ఆర్.దామోదర్, ఐపీఎస్ శుక్రవారం తెలిపారు.

జిల్లా ఎస్పీ ఎఆర్. దామోదర్, ఐపీఎస్ మాట్లాడుతూ – ఎన్నికల సమయంలో గ్రామాల్లో వర్గ విభేదాలు, పాత కక్షలు, రాజకీయ విభేదాల కారణంగా గొడవలు సృష్టించే అవకాశం ఉన్న వ్యక్తులను ముందుగానే గుర్తించి, వారిపై బైండోవర్ చర్యలు చేపడుతున్నామన్నారు. సంబంధిత వ్యక్తులను మండల ఎగ్జిక్యూటివ్ మెజిస్ట్రేట్ ఎదుట హాజరుపరిచి, ఎన్నికల సమయంలో ఎటువంటి గొడవలకు, అల్లర్లకు పాల్పడకుండా, శాంతిభద్రతలకు విఘాతం కలిగించకుండా మంచి ప్రవర్తనతో వ్యవహరిస్తామని స్వంత పూచీకత్తుతో కూడిన సెక్యూరిటీ బాండ్లను స్వీకరిస్తున్నామన్నారు.

జిల్లాలో ఇప్పటివరకు సుమారు 26 వేల మందిపై బైండోవర్ చర్యలు చేపట్టి, ఒక్కొక్కరి నుండి రూ.2 లక్షల నుంచి రూ.3 లక్షల వరకు స్వంత పూచీకత్తుతో సెక్యూరిటీ బాండ్లు స్వీకరించినట్లుగా ఎస్పీ తెలిపారు.

బైండోవర్ నిబంధనలు ఉల్లంఘిస్తే ఎదురయ్యే చట్టపరమైన పరిణామాలు:

మండల ఎగ్జిక్యూటివ్ మెజిస్ట్రేట్ ఎదుట బాండ్ ఇచ్చిన వ్యక్తులు, బాండ్ అమలులో ఉన్న సమయంలో బాండులో పేర్కొన్న షరతులను తప్పనిసరిగా పాటించాలి.

బాండ్ ఇచ్చిన తరువాత కూడా ఎన్నికల సందర్భంగా గొడవలకు పాల్పడినా, శాంతిభద్రతలకు విఘాతం కలిగించినా, బెదిరింపులకు దిగినా లేదా ఇతర నేరాలకు పాల్పడినా వారిపై పోలీసులు చట్టపరమైన చర్యలు చేపడతారన్నారు.

బాండ్ షరతులను ఉల్లంఘించినట్లుగా నిర్ధారణ అయితే, సంబంధిత ఎగ్జిక్యూటివ్ మెజిస్ట్రేట్ చట్ట ప్రకారం విచారణ జరిపి, స్వంత పూచీకత్తుగా ఇచ్చిన బాండ్ మొత్తాన్ని జప్తు చేయడం లేదా జరిమానాగా వసూలు చేస్తామన్నారు.

బాండ్ ఉల్లంఘనకు సంబంధించి చట్టప్రకారం తదుపరి విచారణ చేపట్టి, అవసరమైన సందర్భాల్లో సంబంధిత వ్యక్తులను నిర్బంధంలోకి తీసుకునే చర్యలు కూడా ఉంటాయన్నారు.

బైండోవర్ చర్యలు తీసుకున్న వ్యక్తులు ఇతర నేరాలకు పాల్పడితే, ఆయా నేరాలకు సంబంధించిన ప్రత్యేక కేసులు నమోదు చేసి, చట్ట ప్రకారం దర్యాప్తు చేసి చర్యలు తీసుకుంటామన్నారు.

ఓటర్లను బెదిరించడం, ఓటు వేయకుండా అడ్డుకోవడం, ప్రలోభాలకు గురిచేయడం, పోలింగ్ కేంద్రాల వద్ద గొడవలు సృష్టించడం, ఎన్నికల ప్రక్రియకు ఆటంకం కలిగించడం వంటి చర్యలను తీవ్రంగా పరిగణిస్తామని జిల్లా ఎస్పీ ఎఆర్ దామోదర్, ఐపీఎస్ హెచ్చరించారు.

ప్రజలకు జిల్లా ఎస్పీ విజ్ఞప్తి:

ప్రతి ఒక్కరూ చట్టాన్ని గౌరవిస్తూ సంయమనంతో వ్యవహరించాలని, ప్రతి పౌరుడు తన ఓటు హక్కును స్వేచ్ఛగా, నిర్భయంగా వినియోగించుకునేలా సహకరించాలని ప్రజలను జిల్లా ఎస్పీ ఎఆర్ దామోదర్, ఐపీఎస్ కోరారు.

జడ్పీ చైర్‌పర్సన్ ఎన్నికకు ముందు పైడితల్లి అమ్మవారిని దర్శించుకున్న మజ్జి సిరి సహస్ర (సిరమ్మ)



విజయనగరం, నవంబర్ 20((విజన్ ఆంధ్ర) ప్రత్యేక ప్రతినిధి)

విజయనగరం జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ అభ్యర్థిగా కూటమి ప్రభుత్వం ప్రకటించిన తెలుగుదేశం పార్టీ అరకు పార్లమెంట్ పరిశీలకులు, ఉమ్మడి విజయనగరం జిల్లా మాజీ జడ్పీ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు (చిన్న శ్రీను) కుమార్తె మజ్జి సిరి సహస్ర (సిరమ్మ) శుక్రవారం జడ్పీ చైర్‌పర్సన్ ఎన్నిక నేపథ్యంలో విజయనగరం పట్టణంలోని ఉత్తరాంధ్ర ఇలవేల్పు శ్రీ పైడితల్లి అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె భర్త బడ్డుకొండ ప్రదీప్ నాయుడు వెంట ఉన్నారు.కూటమి ప్రభుత్వం జడ్పీ చైర్‌పర్సన్ అభ్యర్థిగా తన పేరును ప్రకటించిన నేపథ్యంలో, శుక్రవారం ఎన్నికల ప్రక్రియ ప్రారంభానికి ముందు అమ్మవారినీ భక్తిశ్రద్ధలతో దర్శనం చేసుకున్నారు అమ్మ వారి ఆశీస్సులు తీసుకున్నారు. జిల్లా ప్రజలకు సేవ చేసే అవకాశం లభించాలని, విజయనగరం జిల్లా అభివృద్ధి, ప్రజల సంక్షేమం కోసం అంకితభావంతో పనిచేసే శక్తిని ప్రసాదించాలని అమ్మవారిని ప్రార్థించారు.అమ్మవారి ఆశీస్సులతో ఎన్నికల ప్రక్రియ సజావుగా సాగాలని, జిల్లా సమగ్ర అభివృద్ధి, ప్రజా సంక్షేమమే లక్ష్యంగా తన బాధ్యతలను నిర్వర్తించేలా దీవించాలని కోరుతూ అమ్మవారి ఆశీస్సులు పొందారు.



బద్వేల్ లో ఓ ప్రైవేట్ స్కూల్ లో క్షుద్ర పూజల కలకలం...



బద్వేలు, నవంబర్ 20 ((విజన్ ఆంధ్ర) విలేకరి)

బద్వేలు పట్టణంలోని సుందరయ్య కాలనీ శ్రీ విద్య స్కూల్ లో శుక్రవారం దారుణం బయటపడింది...ఆఫీస్ రూమ్ లో 12 అడుగుల లోతు గుంత.గుంత వద్ద నిమ్మకాయలు, యంత్రాలు, వెంట్రుకలు..అర్ధరాత్రి గుంతలో దిగి పూజలు..20 రోజులు స్కూల్ లోనే సాధువు.. మద్యం, మాంసం.పేరెంట్స్ నిలదీయడంతో సాధువు పరార్.. ప్రిన్సిపాల్ పరార్...పిల్లల భద్రత ఏది?.. ఆగ్రహంతో పేరెంట్స్..పేరెంట్స్ సమాచారంతో రంగంలోకి పోలీసులు...ఘటనా స్థలానికి చేరుకున్న బద్వేల్ పోలీసులు... బద్వేల్ అర్బన్ పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేసిన తల్లిదండ్రులు...స్కూల్ యాజమాన్యంపై చర్యలు తీసుకోవాలని తల్లిదండ్రులు డిమాండ్.

నీతి ఆయోగ్ 52వ ఎంపవర్డ్ కమిటీ సమావేశంలో అల్లూరి జిల్లా కలెక్టర్ సమర్పించిన 'ఆహుతి అరణ్య' ప్రతిపాదనలకు ఆమోదం

- **గిరిజన సంస్కృతి, సంప్రదాయాలు, జీవనోపాధి, పర్యాటక అభివృద్ధికి సమగ్ర వేదికగా 'ఆహుతి అరణ్య'**
- **గిరిజన మహిళలు, స్వయం సహాయక సంఘాలు, యువత, కళాకారులు, స్థానిక ఉత్పత్తిదారులకు ఉపాధి, ఆర్థిక స్వావలంబన కల్పించడమే లక్ష్యం**

పాడేరు, నవంబర్ 20((విజన్ ఆంధ్ర) ప్రత్యేక ప్రతినిధి)

నీతి ఆయోగ్, భారత ప్రభుత్వ ఆధ్వర్యంలో నిర్వహించిన 52వ ఎంపవర్డ్ కమిటీ సమావేశం (52nd ఎంపవర్డ్ కమిటీ మీటింగ్ ADP Window-1) వీడియో కాన్ఫరెన్స్‌లో అల్లూరి సీతారామరాజు జిల్లా కలెక్టర్ శ్రీమతి టి. నిశాంతి సమర్పించిన 'ఆహుతి అరణ్య' ప్రాజెక్టు ప్రతిపాదనలకు ఆమోదం లభించింది. జిల్లాలో గిరిజన సంస్కృతి, సంప్రదాయాలు, సహజ వనరులు, స్థానిక ఉత్పత్తులను ప్రోత్సహిస్తూ గిరిజన కుటుంబాలకు స్థిరమైన జీవనోపాధి అవకాశాలు కల్పించే లక్ష్యంతో కలెక్టర్ ఈ ప్రతిపాదనలను సమావేశంలో వివరించారు.

ఈ ప్రాజెక్టును కేవలం ఒక పర్యాటక ఆకర్షణగా కాకుండా, గిరిజన మహిళలు, స్వయం సహాయక సంఘాలు, యువత, సంప్రదాయ కళాకారులు, స్థానిక ఉత్పత్తిదారులు ప్రత్యక్షంగా భాగస్వాములై ఆర్థికంగా అభివృద్ధి చెందే సమగ్ర గిరిజన జీవనోపాధి, పర్యాటక అభివృద్ధి కేంద్రంగా రూపొందించాలని ప్రతిపాదించారు.

గిరిజన వారసత్వ సంపదను ఆర్థిక అవకాశాలుగా మలచడం ప్రాజెక్టు ప్రతిపాదనలో పేర్కొన్న వివరాల ప్రకారం అల్లూరి సీతారామరాజు జిల్లాలో సుమారు 90.71 శాతం జనాభా షెడ్యూల్డ్ తెగలకు చెందినవారు. జిల్లాలో అపారమైన గిరిజన సాంస్కృతిక వారసత్వం, ఆదివాసీ సంప్రదాయ విజ్ఞానం, స్థానిక కళలు, హస్తకళలు, అరకులోయ కాఫీ, చిరుధాన్యాలు, వ్యవసాయ ఉత్పత్తులు, అటవీ ఆధారిత ఉత్పత్తులు సమృద్ధిగా ఉన్నాయి.

ఈ ప్రత్యేకతలను పర్యాటక రంగంతో అనుసంధానం చేయడం ద్వారా గిరిజన ప్రాంతాల సమగ్ర అభివృద్ధికి విస్తృత అవకాశాలు ఉన్నాయి. ముఖ్యంగా గిరిజన మహిళలు, స్వయం సహాయక సంఘాలు, యువత, స్థానిక కళాకారులు, చిన్న తరహా ఉత్పత్తిదారులకు ఉపాధి, స్వయం ఉపాధి, వ్యాపార అవకాశాలు కల్పించడం ఈ ప్రాజెక్టు ప్రధాన ఉద్దేశం.

ఐదు ప్రధాన రంగాల సమన్వయంతో 'ఆహుతి అరణ్య' అభివృద్ధి



గిరిజన సంస్కృతి, సంప్రదాయాల పరిరక్షణ:

గిరిజనుల ప్రాచీన సంప్రదాయాలు, జీవన విధానం, ధింసా నృత్యం, జానపద కళలు, సంప్రదాయ సంగీతం, హస్తకళలు, స్థానిక ఆచార వ్యవహారాలను పర్యాటకులకు పరిచయం చేసేలా ప్రత్యేక వేదికలు ఏర్పాటు చేయడం ఈ ప్రాజెక్టులో ముఖ్యమైన అంశం. తద్వారా గిరిజన సంస్కృతి, వారసత్వ సంపదకు జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో గుర్తింపు తీసుకురావడానికి అవకాశం ఉంటుంది.

గిరిజన జీవనోపాధులు, మహిళా సాధికారత:

గిరిజన మహిళలు, స్వయం సహాయక సంఘాలు, యువతకు వివిధ ఉపాధి, వ్యాపార అవకాశాలు కల్పించడం ద్వారా ఆర్థిక స్వావలంబన సాధించేలా ప్రోత్సహించనున్నారు. స్థానిక ఆహార పదార్థాల తయారీ, సంప్రదాయ వంటకాలు, హస్తకళల ఉత్పత్తి, పర్యాటక సేవలు, చిన్న తరహా వ్యాపారాల నిర్వహణలో గిరిజనులను భాగస్వాములుగా చేయడం లక్ష్యంగా పెట్టుకున్నారు.

వ్యవసాయం, అరకులోయ కాఫీకి ప్రోత్సాహం:

అరకులోయ కాఫీకి మరింత గుర్తింపు తీసుకురావడంతో పాటు సేంద్రియ వ్యవసాయ ఉత్పత్తులు, చిరుధాన్యాలు, స్థానిక పంటలు, గిరిజన ఆహార పదార్థాలు, విలువ ఆధారిత ఉత్పత్తుల మార్కెటింగ్‌కు ప్రాధాన్యత ఇవ్వనున్నారు. రైతులు తమ ఉత్పత్తులను నేరుగా వినియోగదారులకు విక్రయించుకునే అవకాశాలు కల్పించడం ద్వారా మెరుగైన ఆదాయం పొందేందుకు దోహదపడనుంది.

పర్యావరణహిత పర్యాటక అభివృద్ధి:

జిల్లాలోని ప్రకృతి అందాలు, జీవవైవిధ్యం, గిరిజన జీవనశైలి, సంప్రదాయ ఆహారం, స్థానిక కళలు, ప్రకృతి ఆధారిత పర్యాటక అనుభవాలను సమన్వయం చేస్తూ పర్యావరణహిత పర్యాటకాన్ని ప్రోత్సహించనున్నారు.

పర్యాటకులు గిరిజన సంస్కృతి, సంప్రదాయాలను దగ్గరగా తెలుసుకునేలా ప్రత్యేక అనుభవాలను అందించడం ఈ ప్రాజెక్టు ప్రత్యేకతగా నిలవనుంది.. మార్కెటింగ్, మార్కెట్ అనుసంధానాలు:



గిరిజన ఉత్పత్తిదారులు, కళాకారులు, రైతులు, స్వయం సహాయక సంఘాలు తయారు చేసిన ఉత్పత్తులను ఒకే వేదికపై ప్రదర్శించి విక్రయించుకునే సౌకర్యం కల్పించడం ఈ ప్రాజెక్టులో కీలకమైన అంశం.

మధ్యవర్తులపై ఆధారపడకుండా పర్యాటకులు, వినియోగదారులకు నేరుగా ఉత్పత్తులను విక్రయించే అవకాశం కల్పించడం ద్వారా స్థానిక ఉత్పత్తిదారులకు మెరుగైన ఆదాయం లభించనుంది.

గిరిజనుల భాగస్వామ్యంతో స్థిరమైన ఆర్థిక అభివృద్ధి

'ఆహుతి అరణ్య' ప్రాజెక్టు ప్రధాన లక్ష్యం జిల్లాలోని గిరిజన సంస్కృతి, సహజ వనరులు, వ్యవసాయ సంపదను స్థిరమైన ఆర్థిక అవకాశాలుగా మార్చడం. పర్యాటక రంగం ద్వారా ఏర్పడే ఆదాయ అవకాశాల్లో స్థానిక గిరిజన కుటుంబాలకు ప్రత్యక్షంగా ప్రయోజనం చేకూరేలా జీవనోపాధి వ్యవస్థను అభివృద్ధి చేయడం ఈ ప్రాజెక్టు ప్రధాన ఆలోచన.

ఈ కేంద్రం ద్వారా గిరిజన మహిళలకు ఉపాధి, యువతకు వ్యాపార అవకాశాలు, కళాకారులకు గుర్తింపు, రైతులకు మార్కెట్ సదుపాయాలు, స్థానిక ఉత్పత్తిదారులకు విక్రయ వేదిక లభించే అవకాశం ఉంది.

మొత్తంగా, నీతి ఆయోగ్ 52వ ఎంపవర్డ్ కమిటీ సమావేశంలో ఆమోదం పొందిన 'ఆహుతి అరణ్య' ప్రాజెక్టు అల్లూరి సీతారామరాజు జిల్లాలో గిరిజన సంస్కృతి పరిరక్షణ, మహిళా సాధికారత, యువతకు ఉపాధి, వ్యవసాయ ఉత్పత్తులకు మార్కెటింగ్, పర్యావరణహిత పర్యాటక అభివృద్ధిని ఒకే వేదికపైకి తీసుకువచ్చే సమగ్ర అభివృద్ధి కార్యక్రమంగా నిలవనుంది. గిరిజన సమాజాన్ని అభివృద్ధిలో భాగస్వాములుగా తీర్చిదిద్దుతూ వారి సంప్రదాయాలకు గౌరవం, వారి ఉత్పత్తులకు మార్కెట్, వారి కుటుంబాలకు స్థిరమైన ఆదాయం కల్పించే దిశగా ఈ ప్రాజెక్టు కీలక ముందడుగుగా నిలవనుంది.

గ్రామ పంచాయతీ ఎన్నికల నిర్వహణకు పకడ్బందీ ఏర్పాట్లు చేపట్టాలి

ఎన్నికల విధుల్లో పాల్గొనే అధికారులందరూ సమన్వయంతో పనిచేయాలి

జిల్లా కలెక్టర్ శ్రీమతి టి. నిశాంతి, ఐఏఎస్



పాడేరు, నవంబర్ 20((విజన్ ఆంధ్ర) ప్రత్యేక ప్రతినిధి)

అల్లూరి సీతారామరాజు జిల్లాలో గ్రామ పంచాయతీ ఎన్నికలను స్వేచ్ఛగా, పారదర్శకంగా, ప్రశాంత వాతావరణంలో నిర్వహించేందుకు సంబంధిత అధికారులు సమన్వయంతో పనిచేస్తూ పకడ్బందీ ఏర్పాట్లు చేపట్టాలని జిల్లా కలెక్టర్ శ్రీమతి టి. నిశాంతి, ఐఏఎస్ ఆదేశించారు.

శుక్రవారం జిల్లా కలెక్టరేట్‌లోని వీడియో కాన్ఫరెన్స్ హాలులో గ్రామ పంచాయతీ ఎన్నికల నిర్వహణకు సంబంధించి డీపీఓ, డీఎల్పీఓలు, ఎన్నికల విధుల్లో పాల్గొనే వివిధ శాఖల అధికారులు, సంబంధిత సిబ్బందితో జిల్లా కలెక్టర్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎన్నికల సన్నద్ధత, నిర్వహణ ఏర్పాట్లు, అధికారుల బాధ్యతలు, ఎన్నికల ప్రవర్తనా నియమావళి అమలు తదితర అంశాలపై సమీక్షించి పలు సూచనలు, ఆదేశాలు జారీ చేశారు.

ఎన్నికల విధులపై అధికారులకు స్పష్టమైన బాధ్యతలు

గ్రామ పంచాయతీ ఎన్నికల నిర్వహణలో ప్రతి అధికారి తమకు కేటాయించిన విధులను బాధ్యతాయుతంగా నిర్వహించాలని కలెక్టర్ సూచించారు. ఎన్నికల ప్రక్రియలో ఎలాంటి పొరపాట్లకు తావులేకుండా ముందస్తు ప్రణాళికతో అన్ని ఏర్పాట్లు పూర్తి చేయాలని ఆదేశించారు.

ఎన్నికల నిర్వహణకు అవసరమైన సిబ్బంది నియామకం, శిక్షణ, పోలింగ్ కేంద్రాల గుర్తింపు, మౌలిక సదుపాయాల కల్పన, ఎన్నికల సామగ్రి సిద్ధం చేయడం వంటి అంశాలపై ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు.

పోలింగ్ కేంద్రాల్లో అన్ని మౌలిక సదుపాయాలు కల్పించాలి

ప్రతి పోలింగ్ కేంద్రంలో ఓటర్లకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అవసరమైన మౌలిక సదుపాయాలు కల్పించాలని కలెక్టర్ ఆదేశించారు. తాగునీరు, విద్యుత్, మరుగుదొడ్లు, ర్యాంపులు, ఇతర అవసరమైన సౌకర్యాలను ముందుగానే పరిశీలించి అందుబాటులో ఉంచాలని తెలిపారు.

పోలింగ్ కేంద్రాల పరిసరాలను పరిశుభ్రంగా ఉంచడంతో పాటు ఓటర్లు సులభంగా తమ ఓటు హక్కును వినియోగించుకునేలా తగిన ఏర్పాట్లు చేయాలని సూచించారు.

ఎన్నికల ప్రవర్తనా నియమావళిని కచ్చితంగా అమలు చేయాలి

గ్రామ పంచాయతీ ఎన్నికల నేపథ్యంలో అమల్లో ఉన్న ఎన్నికల ప్రవర్తనా నియమావళిని సంబంధిత అధికారులు కచ్చితంగా అమలు చేయాలని కలెక్టర్ స్పష్టం చేశారు. ఎన్నికల నియమావళి ఉల్లంఘనలకు సంబంధించిన ఫిర్యాదులపై తక్షణమే స్పందించి, నిబంధనల ప్రకారం చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.

ఎన్నికల ప్రక్రియలో పారదర్శకత, నిష్పక్షపాత ధోరణి పాటిస్తూ అన్ని రాజకీయ పక్షాలు, అభ్యర్థులకు సమాన అవకాశాలు కల్పించేలా అధికారులు వ్యవహరించాలని సూచించారు.

సమన్వయంతో ఎన్నికల ప్రక్రియ విజయవంతం చేయాలి

గ్రామ పంచాయతీ ఎన్నికల నిర్వహణలో డీపీఓ, డీఎల్పీఓలు, ఎంపీడీఓలు, ఇతర సంబంధిత శాఖల అధికారులు పరస్పర సమన్వయంతో పనిచేయాలని కలెక్టర్ తెలిపారు. క్షేత్రస్థాయిలో ఎదురయ్యే సమస్యలను వెంటనే ఉన్నతాధికారుల దృష్టికి తీసుకువచ్చి పరిష్కరించుకోవాలని సూచించారు.

ఎన్నికల నిర్వహణకు సంబంధించి ప్రతి దశలో నిరంతర పర్యవేక్షణ ఉండాలని, నిర్దేశించిన గడువులోగా అన్ని ఏర్పాట్లు పూర్తి చేసి ఎన్నికల విధులకు సిద్ధంగా ఉండాలని అధికారులను ఆదేశించారు.

ఈ సమావేశంలో డీపీఓ, డీఎల్పీఓలు, గ్రామ పంచాయతీ ఎన్నికల నిర్వహణకు సంబంధించిన వివిధ శాఖల జిల్లా అధికారులు, ఇతర సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

ధర్మవరంలో పరిటాల శ్రీరామ్‌కు ఘన స్వాగతం

ధర్మవరం, నవంబర్ 20((విజన్ ఆంధ్ర) ప్రతినిధి)

శ్రీసత్యసాయి జిల్లా తొలి జెడ్పీ చైర్మన్‌గా ప్రమాణ స్వీకారం చేసేందుకు బయలుదేరిన పరిటాల శ్రీరామ్‌కు ధర్మవరం పట్టణంలో శుక్రవారం ఘన స్వాగతం లభించింది. పట్టణంలోని ప్రధాన రహదారుల వెంట టీడీపీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పెద్ద ఎత్తున తరలివచ్చి ఆయనకు పూలమాలలు వేసి, శాలువాలతో సత్కరిస్తూ ఆత్మీయ స్వాగతం పలికారు. దారి పొడవునా జై పరిటాల శ్రీరామ్, జై తెలుగుదేశం అంటూ నినాదాలు చేస్తూ తమ అభిమానాన్ని చాటుకున్నారు. కార్యకర్తలు, అభిమానుల ఉత్సాహంతో ధర్మవరం పట్టణంలో సందడి వాతావరణం నెలకొంది.



ప్రజా పరిషత్ చైర్ పర్సన్ గా

పూషడపు రోహిణి ప్రమాణ స్వీకారం



బాపట్ల నవంబర్ 20 (విజన్ ఆంధ్ర)



జిల్లా ప్రజా పరిషత్ పరిపాలన సంస్థ నూతన కమిటీ పరోక్ష ఎన్నిక ప్రక్రియను జిల్లా ఎన్నికల అధికారి, జిల్లా కలెక్టర్ డాక్టర్ వి వినోద్ కుమార్ నిర్వహించారు. బాపట్ల జిల్లాకు మొట్టమొదటి జిల్లా ప్రజా పరిషత్ చైర్ పర్సన్ గా పూషడపు రోహిణి ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. వైస్ చైర్ పర్సన్ గా కలవకూరి పిచ్చమ్మ ఏకగ్రీవంగా ఎన్నికైనట్లు జిల్లా ఎన్నికల అధికారి వినోద్ కుమార్ శుక్రవారం ప్రకటించారు. తదుపరి వారికి ధ్రువీకరణ పత్రాన్ని అందజేశారు. బాపట్ల జిల్లా ఏర్పడిన అనంతరం జిల్లా ప్రజా పరిషత్ నూతన పరిపాలన సంస్థకు చైర్ పర్సన్ గా పూషడపు రోహిణి బాధ్యతలు స్వీకరించారు. వైస్ చైర్ పర్సన్ గా కలవకూరి పిచ్చమ్మ బాధ్యతలు చేపట్టారు. నూతన పాలకవర్గానికి జిల్లా ఎన్నికల అధికారి కలెక్టర్ డాక్టర్ వినోద్ కుమార్, రాష్ట్ర రెవెన్యూ శాఖ మంత్రి అనగాని సత్యప్రసాద్, బాపట్ల పార్లమెంట్ సభ్యులు తెన్నేటి కృష్ణ ప్రసాద్, శాసనమండలి సభ్యులు పోతుల సునీత, బాపట్ల శాసనసభ్యులు వేగేశన నరేంద్ర వర్మ, పర్చూరు శాసనసభ్యులు ఏలూరి సాంబశివరావు, వేమూరు శాసనసభ్యులు నక్కా ఆనంద్ బాబు, బుడా చైర్మన్ సలగల రాజశేఖర్ బాబు అభినందనలు తెలిపారు. పూల మొక్కలతో వారిని అభినందించారు. బాపట్ల లోని స్థానిక జిల్లా పరిషత్ కార్యాలయంలో జిల్లా ప్రజా పరిషత్ చైర్ పర్సన్, వైస్ చైర్ పర్సన్ ఎన్నిక ప్రక్రియ జరిగింది. జిల్లా ఎన్నికల అధికారి, జిల్లా కలెక్టర్ డాక్టర్ వినోద్ కుమార్.వి ఎన్నికల ప్రిసైడింగ్ అధికారిగా వ్యవహరించగా, ఏపీవోగా జిల్లా పరిషత్ సీఈవో విజయలక్ష్మి వ్యవహరించారు. మొదట 20 మంది జెడ్పీటీసీ సభ్యులతో జిల్లా ఎన్నికల అధికారి ప్రమాణ స్వీకారం చేయించారు. తదుపరి సభ్యులందరికీ ధ్రువీకరణ పత్రాన్ని అందజేశారు. మధ్యాహ్నం 1:50 గంటలకు జిల్లా ప్రజా పరిషత్ చైర్ పర్సన్, వైస్ చైర్ పర్సన్ ల పదవులకు నామినేషన్ దాఖలు చేసుకోవాలని ప్రిసైడింగ్ అధికారి ప్రకటించారు. మధ్యాహ్నం రెండు గంటలకు అభ్యర్థుల నుంచి నామినేషన్ పత్రాలను ఎన్నికల అధికారి స్వీకరించారు. ఒక్కొక్క పదికి ఒక్కొక్క నామినేషన్ రావడంతో రెండు పదవులు ఏకగ్రీవమైనట్లు ఎన్నికల ప్రిసైడింగ్ అధికారి ప్రకటించారు. మధ్యాహ్నం 2:05 గంటలకు చైర్మన్, వైస్ చైర్ పర్సన్ పదవులకు ఎన్నికైన వారితో ఎన్నికల అధికారి ప్రమాణ స్వీకారం చేయించారు. అనంతరం 2:12 గంటలకు బాపట్ల జిల్లాలో మొట్టమొదటి జిల్లా పరిషత్ నూతన పరిపాలన పాలకవర్గం సమావేశం జరిగింది. మధ్యాహ్నం 2:52 గంటలకు చైర్మన్, వైస్ చైర్మన్ లు బాధ్యతలు స్వీకరించారు. ఈ కార్యక్రమంలో బాపట్ల ఆర్డిఓ హరికుమార్, అధికారులు, 18 మంది జడ్పిటిసి సభ్యులు, తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధి, సంక్షేమానికి

కూటమి ప్రభుత్వం పెద్దపీట వేసింది

: రాష్ట్ర రెవెన్యూ శాఖ మంత్రి అనగాని సత్య ప్రసాద్



బాపట్ల నవంబర్ 20 (విజన్ ఆంధ్ర)



అభివృద్ధి, సంక్షేమానికి కూటమి ప్రభుత్వం పెద్దపీట వేసిందని రాష్ట్ర రెవెన్యూ శాఖ మంత్రి అనగాని సత్య ప్రసాద్ తెలిపారు. జిల్లా ప్రజా పరిషత్ నూతన పాలకవర్గ ఎన్నిక, తదుపరి తొలి సమావేశం స్థానిక జిల్లా పరిషత్ కార్యాలయంలో శుక్రవారం జరిగింది. జిల్లా పరిషత్ తొలి సమావేశానికి జిల్లా ప్రజా పరిషత్ చైర్ పర్సన్ పూషడపు రోహిణి అధ్యక్షత వహించారు. ఎన్నికైన సభ్యులందరికీ కరచాలనం చేసి, పూల మొక్కలతో మంత్రి అభినందనలు తెలిపారు. ఎన్నికలు ప్రశాంత వాతావరణంలో నిర్వహించడంపై జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ డాక్టర్ వినోద్ కుమార్ ను మంత్రి సత్యప్రసాద్ ప్రత్యేకంగా సన్మానించారు.

త్రిబుల్ ఇంజిన్ సర్కార్ గా రాష్ట్ర పురోభివృద్ధి వైపు పయనిస్తుందని మంత్రి చెప్పారు. కేంద్రంలో మోడీ సర్కార్, రాష్ట్రంలో కూటమితో నారా చంద్రబాబు నాయుడు, స్థానిక సంస్థల ఎన్నికల్లో కూటమికి ప్రజలు పట్టం కట్టారన్నారు. రాష్ట్రం అభివృద్ధి వైపు వెళ్లేందుకు ప్రజలు అవకాశం కల్పించడం సంతోషదాయకమన్నారు. భావితరాలు బాగుండాలని, ముఖ్యంగా మీ పిల్లలు బాగుండాలని ప్రభుత్వం ఎంతగానో కృషి చేస్తుందన్నారు. ప్రగతిని కాంక్షిస్తూ రాబోయే తరాలకు ఇప్పుడే సీఎం పునాదులు వేస్తున్నారన్నారు. రాష్ట్ర ప్రగతితో పాటు నేటి నుండి పల్లె ప్రగతి జరగనుందన్నారు. గ్రామాలలో ప్రతి సమస్య పరిష్కారానికి స్థానిక సంస్థల ప్రజాప్రతినిధులు సహకరించాలన్నారు.పల్లెలన్ని వికసించనున్నాయన్నారు. విజన్ 2020 లక్ష్యంతో ఆనాటి ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఎంతో ముందు చూపుతో హైదరాబాద్ ను అభివృద్ధి చేశారన్నారు. కూటమి పాలనలో బాపట్ల జిల్లా పర్యాటక రంగంగా అభివృద్ధి చెందుతోందన్నారు. జడ్పిటిసి సభ్యులు ప్రజలకు అందుబాటులో ఉండాలని, మీ అందరికీ మేము అందుబాటులో ఉంటామన్నారు. అభివృద్ధిలో అందరూ భాగస్వాములు కావాలని జిల్లా కలెక్టర్ డాక్టర్ వినోద్ కుమార్.వి, స్పష్టం చేశారు. నూతన పాలకవర్గ ఏర్పాటైనందున జిల్లా ప్రజా పరిషత్ కార్యాలయం భవన నిర్మాణానికి రూ.రెండు కోట్లు నిధులు విడుదల చేస్తున్నట్లు ప్రకటించారు. ప్రజాస్వామ్యంలో అందరూ కలిసి పనిచేయాలని సూచించారు. ప్రభుత్వ పథకాలను ప్రతి ఒక్కరికి అందించడమే నా లక్ష్యం అని జిల్లా ప్రజా పరిషత్ చైర్ పర్సన్ పూషడపు రోహిణి తెలిపారు. జిల్లాలోని ప్రతి గ్రామాన్ని ఆదర్శ గ్రామంగా తీర్చి దిద్దుతామన్నారు. బాపట్ల జిల్లాలోని గ్రామాల అభివృద్ధికి నా వంతు కృషి చేస్తానన్నారు. ముఖ్యంగా చెరుకుపల్లి ప్రజలకు ఆమె కృతజ్ఞతలు తెలిపారు. నూతనంగా ఏర్పడిన జిల్లాలో జిల్లా ప్రజా పరిషత్ కు తొలి మహిళ చైర్ పర్సన్ గా బాధ్యతలు చేపట్టడం నాకెంతో సంతోషంగా ఉందన్నారు. ప్రజలకు అందుబాటులో ఉండి, మేలు జరిగేలా చర్యలు తీసుకుంటామన్నారు. నాపై ఉంచిన బాధ్యతను చిత్తశుద్ధితో నెరవేరుస్తానని జిల్లా ప్రజా పరిషత్ వైస్ చైర్ పర్సన్ కలవకూరి పిచ్చమ్మ అన్నారు. ఈ పదవిలో ఉండడానికి సహకరించిన ప్రజలందరికీ ఆమె కృతజ్ఞతలు తెలిపారు. గ్రామాలలో అభివృద్ధి ఇకనుంచి పరుగులు పెడుతోందని బాపట్ల పార్లమెంట్ సభ్యులు, పానెల్ స్పీకర్, హోం వ్యవహారాల స్టాండింగ్ కమిటీ సభ్యులు తెన్నేటి కృష్ణ ప్రసాద్ తెలిపారు. ఇప్పటివరకు ఢిల్లీలో ప్రధానమంత్రిగా మోడీ, అమరావతిలో ముఖ్యమంత్రిగా నారా చంద్రబాబు నాయుడుతో డబుల్ ఇంజిన్ సర్కార్ పాలన సాగించిందన్నారు. జిల్లా ప్రజా పరిషత్ పరిపాలన వ్యవస్థ మూడో ఇంజిన్ గా రాష్ట్రానికి నిలిచిందన్నారు. కేంద్ర రాష్ట్ర నుంచి గ్రామాల అభివృద్ధికి నిధులు విరివిగా రానున్నాయన్నారు. గ్రామాల అభివృద్ధికి జిల్లా పరిషత్ చిత్తశుద్ధితో పనిచేయాలన్నారు. ప్రధానంగా విద్యా వ్యవస్థ, సూక్ష్మ, చిన్న, మధ్య తరహా పరిశ్రమల స్థాపన, యువత నైపుణ్యాల అభివృద్ధికి ప్రాధాన్యం ఇవ్వాలన్నారు. అప్పుడే అభివృద్ధి పట్టాల వైపు జిల్లా సాగుతుందన్నారు. యువత భవిష్యత్తు కొరకు పనిచేసే అవకాశం లభించిందన్నారు. బాపట్ల జిల్లాలో రూ.6వేల కోట్లతో రైల్వే పనులు, మరో రూ.ఐదు వేల కోట్లతో రహదారుల నిర్మాణాలు జరుగుతున్నాయన్నారు.



గ్రామీణ ప్రాంతాల అభివృద్ధికి నూతన పాలకవర్గం కృషి చేయాలని శాసనమండలి సభ్యురాలు పోతుల సునీత తెలిపారు. సాగు తాగునీరు విద్య విద్యుత్ వంటి సౌకర్యాలు కల్పించాలన్నారు. మెరుగైన సేవలు ప్రజలకు అందినప్పుడే అభివృద్ధి వైపు జిల్లా పయనిస్తుందన్నారు. వ్యవసాయ రంగంపై ఆధారపడిన బాపట్ల జిల్లాలో సాగునీటి వ్యవస్థను సరిచేయాలన్నారు. ప్రజలు మనకిచ్చిన బాధ్యతను గుర్తించి, ప్రజల సంక్షేమ కొరకు పని చేయాలని బాపట్ల శాసనసభ్యులు వేగేశన నరేంద్ర వర్మ తెలిపారు. జిల్లా అభివృద్ధికి నూతన పాలకవర్గం కృషి చేయాలన్నారు. అన్ని నియోజకవర్గాలలోని గ్రామీణ ప్రాంతాల అభివృద్ధికి నిధులు సమానంగా కేటాయించాలని సూచించారు. కూటమి సర్కారుకు ప్రజలు సహకరించడం సంతోషదాయకం అన్నారు. జిల్లాలోకి పెట్టుబడులు వస్తే సహకరించాలని, ప్రజల కొరకు సంక్షేమ పథకాల అమలు చేయాలన్నారు. జిల్లా ప్రజా పరిషత్ చైర్ పర్సన్, వైస్ చైర్ పర్సన్ పదవులు కూటమికి దక్కడం సంతోషదాయకమని పర్చూరు శాసనసభ్యులు ఏలూరి సాంబశివరావు అన్నారు. బాపట్ల జిల్లాలో జిల్లా ప్రజా పరిషత్ తొలి పాలకవర్గం ఏర్పాటు కావడంపై అభినందించారు. ప్రజల సహకారంతోనే సాధ్యమైందన్నారు. ఈ సమావేశంలో వేమూరు శాసనసభ్యులు నక్కా ఆనందబాబు, జిల్లా ప్రజా పరిషత్ సీఈవో విజయలక్ష్మి, బాపట్ల ఆర్డిఓ హరికుమార్, బుడా చైర్మన్ సలగల రాజశేఖర్ బాబు, అధికారులు, జిల్లా ప్రజా పరిషత్ నూతన పాలకవర్గ సభ్యులు, తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా బాపట్ల ప్రైవేట్ ఎలక్ట్రికల్ వర్కర్స్ అసోసియేషన్

28వ వార్షికోత్సవం



బాపట్ల నవంబర్ 20 (విజన్ ఆంధ్ర)

బాపట్ల పట్టణ ప్రైవేట్ ఎలక్ట్రికల్ వర్కర్స్ అసోసియేషన్ 28వ వార్షికోత్సవ వేడుకలను శుక్రవారం పెయింటర్స్ కాలనీలోని అసోసియేషన్ భవనంలో ఘనంగా నిర్వహించారు. అసోసియేషన్ ఏర్పడి 28 సంవత్సరాలు పూర్తయిన సందర్భంగా సభ్యులు వేడుకల్లో పాల్గొని ఆనందం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా అసోసియేషన్ అధ్యక్షుడు వినోద్ మాట్లాడుతూ ప్రతి నెల మొదటి ఆదివారం నిర్వహించే సర్వసభ్య సమావేశానికి సభ్యులందరూ హాజరై, అసోసియేషన్ అభివృద్ధికి తమ వంతు సహకారం అందించాలని కోరారు. అలాగే మరింత మంది ఎలక్ట్రికల్ వర్కర్లు అసోసియేషన్‌లో సభ్యత్వాలు నమోదు చేసుకుని, సంఘం ద్వారా అందే ప్రయోజనాలను పొందాలని సూచించారు. సభ్యుల ఐక్యత, సహకారంతో అసోసియేషన్‌ను మరింత బలోపేతం చేయాలని పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో సెక్రటరీ జి. శివప్రసాద్, జాయింట్ సెక్రటరీ ఏ. నాగరాజు, ట్రెజరర్ బి. మురళీకృష్ణ, సభ్యులు దుర్గాప్రసాద్, రఫీ, ఫరూక్, రాజా తదితరులు పాల్గొన్నారు.

అన్నదాన సత్రం ద్వారా ఎంతోమంది భక్తులకు సేవలందించడం అభినందనీయం : ఎమ్మెల్యే గళ్ళా మాధవి.



గుంటూరు, నవంబర్ 20. (విజన్ ఆంధ్ర)

గుంటూరు అమరావతి రోడ్డులోని అన్నదాన సత్రం ద్వారా నిత్యం ఎంతోమంది భక్తులకు, పేదలకు ఉపయోగం కలుగుతోందని, ఇలాంటి సేవా కార్యక్రమాలకు ఆధ్యాత్మిక కేంద్రాల నిర్మాణం మరింత తోడ్పాటునిస్తుందని ఎమ్మెల్యే గళ్ళా మాధవి పేర్కొన్నారు. 60వ డివిజన్ అమరావతి రోడ్డులోని అన్నదాన సత్రం వద్ద శ్రీ ఉమా మహేశ్వర స్వామి (భీమేశ్వర స్వామి) దేవస్థాన పునర్నిర్మాణ పనులకు ఎమ్మెల్యే గళ్ళా మాధవి, మేయర్ కోవెలమూడి లక్ష్మీ అపర్ణ శంకుస్థాపన చేశారు. ఆలయ నిర్మాణానికి పూర్తి ఖర్చును భరించేందుకు ముందుకొచ్చిన కోటేశ్వరరావును అభినందించారు. స్వామివారి ఆశీస్సులు స్థానిక ప్రజలందరికీ త్వరగా అందాలన్నదే తమ ఆకాంక్ష అని అన్నారు. దేవస్థానం ఈఓ, ఆలయ చైర్మన్ సాంబశివరావు పర్యవేక్షణలో నిర్మాణ పనులు వేగంగా ముందుకు సాగాలని, నిర్మాణానికి అవసరమైన సహాయ సహకారాలు అందించేందుకు స్థానిక కార్పొరేటర్లు సిద్ధంగా ఉన్నారని, ఎలాంటి అవసరాలున్నా తమను సంప్రదించాలని సూచించారు. అందరూ సమన్వయంతో పనిచేసి ఆలయ నిర్మాణాన్ని త్వరితగతిన పూర్తి చేయాలని పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో స్థానిక కార్పొరేటర్ ధనలక్ష్మి, ఇతర కార్పొరేటర్లు, ఆలయ కమిటీ సభ్యులు, టీడీపీ నాయకులు, కార్యకర్తలు, భక్తులు పాల్గొన్నారు.

ప్రధాన సమస్యల పరిష్కారం కోసం కృషి చేస్తాం...

ఇంటింటి ప్రచారంలో వైసీపీ అభ్యర్థులు

తాడేపల్లి నవంబర్ 20 (విజన్ ఆంధ్ర)

మంగళగిరి తాడేపల్లి నగరపాలక సంస్థ పరిధిలోని 46, 44 డివిజన్ లో వైసీపీ అభ్యర్థుల ఈదే నాగవిజయకుమార్, వడ్డేశ్వరపు స్టాలిన్ ప్రచార హోరు ఆరంభమైంది. ప్రతి గడపను పలకరిస్తూన్న అభ్యర్థులకు ఆత్మీయంగా స్వాగతం పలుకుతున్న ఓటర్లు, స్థానికులు పలికారు. ప్రజ సమస్య పరిష్కారం కోసం పనిచేయడానికి కార్పొరేషన్ లో ప్రజలకు అండగా ఉండేందుకు తమను గెలిపించాలని ప్రతి ఒక్కరికి చెతులు జోడించి ప్రార్థిస్తున్నా వైసీపీ అభ్యర్థులు ప్రచారం నిర్వహించడం స్థానికంగా ప్రధానంగా మంచినీటి సమస్య, పించన్ సమస్యలు అధికంగా స్థానికులు అభ్యర్థుల ముందు వాపోయారు. ఇంత కాలం చేశారని వీరు ఇప్పుడు ఎన్నికలు వచ్చాయి కాబట్టే సమస్యలు గుర్తుకు వచ్చాయని విమర్శించారు. ప్రజలు తమ స్థానిక సమస్యలతో పాటు విజయం తధాస్తు అనేలా వారి ప్రచారం జోరుగా సాగింది. ఈ కార్యక్రమంలో వైసీపీ నియోజకవర్గ మున్సిపల్ విభాగ అధ్యక్షుల సుబ్బారావు (సుబ్బు), నియోజకవర్గ ట్రేడ్ యూనియన్ అధ్యక్షులు రత్నకరం



శ్రీనివాస రాజు, తాడేపల్లి టౌన్ బిసి సెల్ అధ్యక్షులు కురుబర రమేష్, నేతలు, కార్యకర్తలు, సానుభూతి పరులు పాల్గొన్నారు

విస్తృతంగా ప్రచారం చేస్తున్న

వైసిపి 12వ(పెదవడ్లపూడి) డివిజన్ అభ్యర్థి భూక్య షాలిని...సిపిఎం, సిపిఐ

బలపరిచిన వైసిపి అభ్యర్థి షాలిని ఇంటింటా ప్రచారం..

మంగళగిరి,నవంబర్ 20(విజన్ ఆంధ్ర)

మంగళగిరి తాడేపల్లి నగరపాల సంస్థకు ఈనెల 26వ జరిగే ఎన్నికల్లో
12వ డివిజన్(పెదవడ్లపూడి) నుండి సిపిఎం, సిపిఐ బలపరిచిన వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి భూక్య షాలిని గడప గడపకు ప్రచారం చేస్తూ ఓట్లు వేసి గెలిపించాలని ఓటర్లను విజ్ఞప్తి చేస్తున్నారు.
శుక్రవారం 12 వ డివిజన్లోనివడ్లపూడి గ్రామంలోని వివిధ ప్రాంతాలలో విస్తృతంగా ప్రచారం చేస్తున్నారు. ఈ సందర్భంగా అభ్యర్థి భూక్య షాలిని.మాట్లాడుతూ గత వైసిపి ప్రభుత్వ హయాంలో జరిగిన అభివృద్ధి పనులను, సంక్షేమ పథకాలను ఓటర్లకు విన్నవిస్తూ ఈ నగర అభివృద్ధికి, డివిజన్ అభివృద్ధికి కృషి చేస్తానని ఆమె ఓటరు మహాశయులను కోరారు.ఈ డివిజన్లలోని సమస్యల పట్ల అవగాహన ఉందని వాటి పరిష్కారానికికృషి చేస్తానని షాలిని హామీ ఇచ్చారు.ఈప్రచారకార్యక్రమంలో వైసీపీ గుర్రం రాణి, దార్ల కవిన్య, గ్రామ అధ్యక్షులు గుర్రం భరత్, పెదవడ్లపూడి గ్రామ సీనియర్ నాయకులు షేక్ కరీముల్లా, పెదవడ్లపూడి గ్రామ కమిటీ ప్రధాన కార్యదర్శి రెడ్డి ప్రసాద్, మంగళగిరి మండల వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ కార్యదర్శి షేక్ బాజీ,పెదవడ్లపూడి గ్రామ సోషల్ మీడియా కార్యదర్శి రాజశేఖర్ ,పెదవడ్లపూడి గ్రామ మైనార్టీ సెల్ ప్రధాన కార్యదర్శి షేక్ నాగబాబు,నాయకులు, కార్యకర్తలు, అభిమానులు, మహిళలు,తదితరులు పాల్గొన్నారు.



నూతన జడ్పీటీసీ సభ్యులతో ప్రమాణ స్వీకారం చేయించిన జిల్లా కలెక్టర్ సాయికాంత్ వర్మ

గుంటూరు, నవంబర్ 20, (విజన్ ఆంధ్ర)

గుంటూరు జిల్లా పరిషత్ ప్రత్యేక సమావేశం నిర్వహించి, ఇటీవల జరిగిన జిల్లా పరిషత్ ప్రాదేశిక నియోజకవర్గాల ఎన్నికల్లో విజయం సాధించిన జడ్పీటీసీ సభ్యుల ప్రమాణ స్వీకార కార్యక్రమాన్ని శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ప్రిసైడింగ్ అధికారిగా జిల్లా కలెక్టర్ సి.ఎం. సాయికాంత్ వర్మ వ్యవహరించి నూతనంగా ఎన్నికైన జడ్పీటీసీ సభ్యులతో ప్రమాణ స్వీకారం చేయించారు. ప్రమాణ స్వీకారం చేసిన జడ్పీటీసీ సభ్యులు: 1. ప్రత్తిపాడు ఎ. బసవ బాబు. 2. దుగ్గిరాల టి. అశోక్ కుమార్. 3. చేబ్రోలు ఎం. కృష్ణయ్య. 4. మేడికొండూరు కె. సుమలత. 5. కొల్లిపర జి. సూర్యకుమారి. 6. గుంటూరు రూరల్ సి.హెచ్. సాంబశివరావు. 7. వట్టిచెరుకూరు డి. అరుణ. 8. పెదనందిపాడు డి. ఉషాకిరణ్మయి. 9. కాకుమాను డి. కోటేశ్వరరావు. 10. తెనాలి ఎన్. అన్నపూర్ణ. 11. ఫిరంగిపురం షేక్ జహంగీర్. 12. పెదకాకాని డి. సునీత. 13. పొన్నూరు సుధా ప్రభావతి.

అనంతరం జిల్లా కలెక్టర్ ఆధ్వర్యంలో జిల్లా పరిషత్ నూతన చైర్‌పర్సన్, వైస్ చైర్‌పర్సన్ ఎన్నిక ప్రక్రియ నిర్వహించారు. చైర్‌పర్సన్ పదవికి వట్టిచెరుకూరు జడ్పీటీసీ సభ్యురాలు డి. అరుణ పేరును ప్రత్తిపాడు జడ్పీటీసీ సభ్యుడు ఎ. బసవబాబు ప్రతిపాదించగా, కాకుమాను జడ్పీటీసీ సభ్యుడు డి. కోటేశ్వరరావు బలపరిచారు.



అదేవిధంగా వైస్ చైర్‌పర్సన్ పదవికి దుగ్గిరాల జడ్పీటీసీ సభ్యుడు టి. అశోక్ కుమార్ పేరును చేబ్రోలు జడ్పీటీసీ సభ్యుడు ఎం. కృష్ణయ్య ప్రతిపాదించగా, తెనాలి జడ్పీటీసీ సభ్యురాలు ఎన్. అన్నపూర్ణ బలపరిచారు. ఇతర అభ్యర్థులు పోటీలో లేకపోవడంతో జిల్లా పరిషత్ చైర్‌పర్సన్‌గా డి. అరుణ, వైస్ చైర్‌పర్సన్‌గా టి. అశోక్ కుమార్ ఏకగ్రీవంగా ఎన్నికైనట్లు జిల్లా కలెక్టర్ సి.ఎం. సాయికాంత్ వర్మ అధికారికంగా ప్రకటించి వారితో ప్రమాణ స్వీకారం చేయించారు.

జిల్లా అభివృద్ధికి సమష్టిగా కృషి చేయాలి:

ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ సి.ఎం. సాయికాంత్ వర్మ మాట్లాడుతూ, ప్రజల చేత నేరుగా ఎన్నుకోబడిన జడ్పీటీసీ సభ్యులందరికీ ముందుగా అభినందనలు తెలియజేశారు. ప్రజలు తమపై ఎంతో నమ్మకంతో అప్పగించిన బాధ్యతను ప్రతి ఒక్కరూ బాధ్యతాయుతంగా నిర్వర్తించాలని ఆకాంక్షించారు.రాబోయే రోజుల్లో జిల్లాలో ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలు, ఇబ్బందులను గుర్తించి, వాటి పరిష్కారానికి జిల్లా పరిషత్‌ను ఒక మంచి వేదికగా వినియోగించుకోవాలని సూచించారు. ప్రజాప్రతినిధులందరితో కలిసి పనిచేయడానికి జిల్లా యంత్రాంగం పూర్తి స్థాయిలో అందుబాటులో ఉంటుందని స్పష్టం చేశారు. ప్రజాప్రతినిధులు, జిల్లా యంత్రాంగం సమన్వయంతో పనిచేస్తూ గుంటూరు జిల్లాను అభివృద్ధి పథంలో ముందుకు తీసుకెళ్లాలని కలెక్టర్ ఆకాంక్షించారు. నూతనంగా ఎన్నికైన చైర్‌పర్సన్, వైస్ చైర్‌పర్సన్‌తో పాటు జడ్పీటీసీ సభ్యులందరికీ శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా పరిషత్ ముఖ్య కార్యనిర్వహణాధికారి జ్యోతి బసు , ఇతర అధికారులు తదితరులు పాల్గొన్నారు.

తాడేపల్లిలో వైఎస్సార్‌సీపీ ప్రచార హోరు



మంగళగిరి నవంబర్ 20 (విజన్ ఆంధ్ర)

మంగళగిరితాడేపల్లి నగరపాలక సంస్థ ఎన్నికల నేపథ్యంలో తాడేపల్లి సీతానగరం శ్రీ పెద్ద ఆంజనేయస్వామి ఆలయంలో పూజలు నిర్వహించి వైఎస్సార్‌సీపీ నేతలు ప్రచారం ప్రారంభించారు. నియోజకవర్గ సమన్వయకర్త బుర్రముక్కు వేణుగోపాల సోమిరెడ్డి, పట్టణ అధ్యక్షుడు దొంతిరెడ్డి రామకృష్ణారెడ్డి ఆధ్వర్యంలో జరిగిన ప్రచారంలో జిల్లా అధ్యక్షుడు అంబటి రాంబాబు, ఎమ్మెల్సీ మురుగుడు హనుమంతరావు, మాజీ సమన్వయకర్త దొంతిరెడ్డి వేమారెడ్డి, చిల్లపల్లి మోహన్‌రావు పాల్గొన్నారు.అంబటి రాంబాబు మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం సూపర్ సిక్స్ హామీలను అమలు చేయడంలో విఫలమైందని విమర్శించారు. బుర్రముక్కు వేణుగోపాల సోమిరెడ్డి మాట్లాడుతూ జగన్ పాలనలోనే కొలనుకొండలో సిమెంట్ రోడ్లు, కుంచనపల్లిలో పట్టణ ఆరోగ్య కేంద్రం ఏర్పాటయ్యాయని పేర్కొన్నారు. స్థానిక ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ అభ్యర్థులను గెలిపించాలని నేతలు ఓటర్లను కోరారు.మేయర్ అభ్యర్థి కేశవత్ పున్నా నాయక్ (పూర్ణ), 1వ డివిజన్ అభ్యర్థి ప్రాతూరు కోటిబాబు, 2వ డివిజన్ అభ్యర్థి పోకల రామకోటేశ్వరరావు, 5వ డివిజన్ అభ్యర్థి జాలి రమాదేవి తరపున ప్రచారం నిర్వహించారు. కార్యక్రమంలో కేశవత్ లక్ష్మి, బలసాని దేవసుందరం, జక్కిరెడ్డి వెంకటకృష్ణారెడ్డి, మేక అంజిరెడ్డి, దగ్గుపాటి వెంకటేశ్వర్లు, దొంతిరెడ్డి రామకృష్ణారెడ్డి, డోగిపర్తి చలపతి, మేకల సాంబశివరావు, నూతక్కి శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

మురసు తుపానుపనుల పునరుద్ధరణకు రూ.8.63 కోట్లు

- **116 అత్యవసర పనులకు కలెక్టర్ పరిపాలనా అనుమతులు**
- **ఎమ్మెల్యే ఏలూరి ప్రత్యేక చొరవతో నిధుల మంజూరు**
- **కాలువలు, డ్రైన్లకు తక్షణ మరమ్మతులు.. రైతులకు ఊరట**

పర్చూరు నవంబర్ 20 (విజన్ ఆంధ్ర)

మురసు తుపాను కారణంగా దెబ్బతిన్న సాగునీటి కాలువలు, డ్రైన్ల పునరుద్ధరణకు ప్రభుత్వం రూ.8.63 కోట్లు మంజూరు చేసింది. పర్చూరు ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు ప్రత్యేక చొరవ, ప్రభుత్వానికి చేసిన విజ్ఞప్తుల మేరకు 116 అత్యవసర మరమ్మతు పనులకు నిధులు విడుదలయ్యాయి. ఈ మేరకు బాపట్ల జిల్లా కలెక్టర్, జిల్లా మేజిస్ట్రేట్ డాక్టర్ వి. వినోద్ కుమార్ పరిపాలనా అనుమతులు జారీ చేశారు. మొత్తం రూ.863.19 లక్షలతో ఈ పనులు చేపట్టనున్నారు.

నవంబరు 3న సంభవించిన మురసు తుపాను ప్రభావంతో బాపట్ల జిల్లాలో 336.20 మిల్లీమీటర్ల భారీ వర్షపాతం నమోదైంది. గుంటూరు, పల్నాడు జిల్లాల ఎగువ ప్రాంతాల నుంచి వచ్చిన వరద నీరు నల్లమడ, రొంపేరు పరివాహక ప్రాంతాలను ముంచెత్తింది. కొమ్మమూరు కాలువతో పాటు పర్చూరు వాగు, రొంపేరు, ఆలేరు, సాకి వాగు, కప్పల వాగు తదితర కాలువలు, డ్రైన్ల గట్లు కోతకు గురయ్యాయి. పలుచోట్ల గండ్లు పడటంతో పాటు షట్టర్లు, ఇతర నిర్మాణాలు దెబ్బతిన్నాయి. ఫలితంగా పంట పొలాలు నీట మునిగి రైతులు తీవ్రంగా నష్టపోయారు. ఈ నేపథ్యంలో దెబ్బతిన్న సాగునీటి వ్యవస్థలను పునరుద్ధరించేందుకు ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు ప్రత్యేకంగా దృష్టి సారించారు. క్షేత్రస్థాయి పరిస్థితులను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి అత్యవసర మరమ్మతులకు నిధులు మంజూరు చేయాలని కోరారు. ఆయన కృషితో నీటిపారుదల శాఖ పరిధిలో 72 పనులకు, డ్రైనేజీ విభాగం పరిధిలో 44 పనులకు అనుమతులు లభించాయి.

మండలాల వారీగా పనులు ఇలా..

కారంచేడు మండలంలో అత్యధికంగా 54 పనులకు అనుమతులు లభించాయి. వీటిలో నీటిపారుదల శాఖ పరిధిలో 30, డ్రైనేజీ విభాగంలో 24 పనులు ఉన్నాయి. కొమ్మమూరు కాలువ, శాకి న్యూ సైడ్ ఛానల్, కారంచేడు పాత, కొత్త కాలువలు, బెంజమిన్ ఛానల్‌తో పాటు పర్చూరు వాగు, రొంపేరు ఎడమ కాలువ, ఆలేరు డ్రైన్, కప్పల వాగులకు మరమ్మతులు చేపట్టనున్నారు. పర్చూరు మండలంలో 38 పనులు మంజూరయ్యాయి. నీటిపారుదల శాఖ పరిధిలో 22, డ్రైనేజీ విభాగంలో 16 పనులు చేపట్టనున్నారు. కొమ్మమూరు కాలువ గట్ల పటిష్టత, ఆర్‌పీ స్కీమ్ ప్రధాన, బ్రాంచ్ కాలువల మరమ్మతులతో పాటు పర్చూరు వాగు, సాకి వాగు గండ్ల పూడ్చివేత, కోతల నివారణ పనులు చేపట్టనున్నారు.

చిన్నగంజాం మండలంలో 24 పనులకు అనుమతులు



వచ్చాయి. వీటిలో నీటిపారుదల శాఖ పరిధిలో 20, డ్రైనేజీ విభాగంలో నాలుగు పనులు ఉన్నాయి. కొమ్మమూరు కాలువ, పెదగంజాం, కనపర్తి, ఈమిలేరు సప్లై ఛానళ్లతో పాటు ఆలేరు, అప్పేరు, రొంపేరు కుడి కాలువ డ్రైన్లకు మరమ్మతులు చేయనున్నారు. నిధులు మంజూరు కావడంతో దెబ్బతిన్న సాగునీటి కాలువలు, డ్రైన్లకు త్వరలోనే మరమ్మతులు చేపట్టేందుకు మార్గం సుగమమైంది. పనులు వేగంగా పూర్తిచేస్తే సాగునీటి వ్యవస్థకు పూర్వవైభవం రావడంతో పాటు భవిష్యత్తులో వరదల సమయంలో పంట పొలాలకు నష్టం తగ్గుతుందని రైతులు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు.

మేయర్ అభ్యర్థి పేరం ఏడుకొండలకు బీసీ సంక్షేమ సంఘం సంపూర్ణ మద్దతు



మంగళగిరి నవంబర్ 20 (విజన్ ఆంధ్ర)

మంగళగిరితాడేపల్లి నగరపాలక సంస్థ ఎన్నికల్లో కూటమి బలపరిచిన మేయర్ అభ్యర్థి పేరం ఏడుకొండలకు రాష్ట్ర బీసీ సంక్షేమ సంఘం సంపూర్ణ మద్దతు ప్రకటించింది. ఈ మేరకు రాష్ట్ర కార్యాలయాన్ని సందర్శించిన పేరం ఏడుకొండలకు సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కేశన శంకరరావు, కమిటీ సభ్యులు స్వాగతం పలికి మద్దతు తెలిపారు. ఈ సందర్భంగా కేశన శంకరరావు మాట్లాడుతూ మేయర్ అభ్యర్థి పేరం ఏడుకొండలుతో పాటు 62 డివిజన్లలో పోటీ చేస్తున్న కూటమి అభ్యర్థులకు తమ సంఘం మద్దతు ఉంటుందని తెలిపారు. బడుగు, బలహీన వర్గాల ప్రజలంతా ఎన్నికల్లో పాల్గొంటున్న అభ్యర్థులకు మద్దతు ప్రకటించాలని కోరారు.మేయర్ పదవి ఎస్టీ రిజర్వేషన్ కావడంతో సామాన్య కుటుంబానికి చెందిన పేరం ఏడుకొండలకు మంత్రి, మంగళగిరి ఎమ్మెల్యే నారా లోకేష్ అవకాశం కల్పించడం ప్రజాప్రతినిధ్యానికి ప్రాధాన్యత ఇచ్చిన నిర్ణయంగా ఆయన అభివర్ణించారు. ప్రజలతో సత్సంబంధాలు కలిగిన వ్యక్తికి అవకాశం కల్పించారని పేర్కొన్నారు.రాజధాని ప్రాంతానికి కీలకమైన మంగళగిరితాడేపల్లి నగరపాలక సంస్థ అభివృద్ధిలో పేరం ఏడుకొండలు భాగస్వామి కావాలని, ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా సేవలందించాలని కేశనం శంకరరావు ఆకాంక్షించారు.ఈ కార్యక్రమంలో కుమ్మరి క్రాంతి కుమార్, పారెపల్లి మహేష్, ఉడతా శ్రీనివాస్, జంజనం వెంకటకృష్ణ, శివరామ్ బాబాజీ, వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

మాదకద్రవ్యాల రహిత సమాజ నిర్మాణంలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలి

బాపట్ల శ్రీ చైతన్య స్కూల్లో డ్రగ్స్‌పై ఈగల్ టీమ్ అవగాహన

బాపట్ల నవంబర్ 20 (విజన్ ఆంధ్ర)

బాపట్ల పట్టణంలోని భీమ వారి పాలెం, శ్రీ చైతన్య స్కూల్లో నందు శుక్రవారం పదవ తరగతి విద్యార్థులకు బాపట్ల ఈగల్ టీమ్ ఆధ్వర్యంలో గంజాయి, డ్రగ్స్, ఇతర మాదకద్రవ్యాల వినియోగం వల్ల కలిగే ప్రమాదాల పై ప్రత్యేక అవగాహన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో భాగంగా విద్యార్థులకు మాదకద్రవ్యాల వినియోగం వల్ల కలిగే శారీరక, మానసిక మరియు సామాజిక అనర్థాలను వివరించారు. ముఖ్యంగా చిన్న వయస్సులోనే చెడు అలవాట్లకు బానిసలైతే విద్యాభ్యాసం, ఆరోగ్యం, కుటుంబ జీవితం, భవిష్యత్తు పై తీవ్ర ప్రభావం పడుతుందని తెలియజేశారు. చెడు స్నేహాలు, తప్పుడు ప్రలోభాలు, స్నేహితుల ఒత్తిడికి లోనై గంజాయి, డ్రగ్స్ వంటి మత్తు పదార్థాల జోలికి వెళ్లకూడదని విద్యార్థులకు సూచించారు. ఎవరైనా మాదకద్రవ్యాల వినియోగానికి ప్రోత్సహించిన ధైర్యంగా తిరస్కరించాలని,



అలాంటి విషయాలు తమ దృష్టికి వస్తే వెంటనే ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు లేదా పోలీసుల దృష్టికి తీసుకురావాలని వివరించారు.విద్యార్థులు చదువుపై ప్రత్యేక శ్రద్ధ కనబరుస్తూ, క్రీడలు, మంచి వ్యాపకాలు అలవాటు చేసుకొని లక్ష్యసాధన దిశగా ముందుకు సాగాలని సూచించారు. మాదకద్రవ్యాల రహిత సమాజ నిర్మాణంలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. విద్యార్థులు డ్రగ్స్‌కు దూరంగా ఉంటూ, తమ జీవితాలను ఉన్నతంగా తీర్చిదిద్దు కోవాల్సిన ఆవశ్యకతను ఈగల్ టీమ్ వివరించారు.ఈ కార్యక్రమం లో ఎక్సైజ్ ఎస్సై ప్రభుదాస్, ఉమెన్ ఎస్సై సింధు సరస్వతి, పాఠశాల ప్రిన్సిపాల్ విజయ మాధురి, స్టాఫ్, ఈగల్ టీం తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థిని విద్యార్థులు అందరూ గ్రంథాలయంలో సభ్యత్వాన్ని తీసుకొని అక్కడున్న పుస్తకాలు చదువుకొని జ్ఞానాన్ని సంపాదించు కోవాలి

నేటి యువత సెల్ ఫోన్స్ ఆకర్షితులై పఠనాసక్తిని తగ్గించుకుంటున్నారు : బాపట్ల మున్సిపల్ కమిషనర్ యం .హాసిని

బాపట్ల నవంబర్ 20 (విజన్ ఆంధ్ర)

59 వ జాతీయ గ్రంథాలయ వారోత్సవాల ముగింపు కార్యక్రమం శుక్రవారం బాపట్ల శాఖ గ్రంథాలయం నందు నిర్వహించారు. ఈ వారోత్సవాల ముగింపు కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా బాపట్ల మున్సిపల్ కమిషనర్ యం .హాసిని,బాపట్ల మండల విద్యాశాఖ అధికారి డి. ప్రసాద్ పాల్గొన్నారు. వారోత్సవాల ముగింపు సభకు గ్రంథాలయ అధికారి ఏ .శివాజీ గణేషన్ అధ్యక్షత వహించి 59 వ జాతీయ గ్రంథాలయ వారోత్సవాలు ఈ నెల 14 వ తేదీ నుంచి నిర్వహించిన కార్యక్రమాలను వాటి ఆవశ్యకత ను సభకు తెలిపారు. బాపట్ల మున్సిపల్ కమిషనర్ యం .హాసిని మాట్లాడుతూ గ్రంథాలయాలు అంటే విజ్ఞాన కేంద్రాలని తప్పనిసరిగా విద్యార్థినీ విద్యార్థులు వారి ఖాళీ సమయం లో పాఠ్యపుస్తకాల తో పాటు గ్రంథాలయంలో ఉన్న పుస్తకాలను కూడా చదువుకొని ఉన్నత స్థానానికి రావాలని, నేటి యువత సెల్ ఫోన్స్ ఆకర్షితులై పఠనా శక్తిని తగ్గించుకుంటున్నారని అలా కాకుండా గ్రంథాలయాలకు వెళ్లి అక్కడ ఉన్న పుస్తకాలను చదువుకొని ఉన్నత స్థితికి రావాలని, గ్రంధాలయానికి నూతన భవనం తప్పనిసరిగా నిర్మిద్దామని





తెలిపారు. బాపట్ల మండల విద్యాశాఖ అధికారి డి.ప్రసాద్ మాట్లాడుతూ విద్యార్థిని విద్యార్థులు అందరూ గ్రంథాలయంలో సభ్యత్వాన్ని తీసుకొని అక్కడున్న పుస్తకాలు చదువుకొని జ్ఞానాన్ని సంపాదించుకోవాలని తెలియజేశారు. గ్రంథాలయాలు నిరుద్యోగులకు వారి జీవితంలో ఉన్నత స్థితికి చేరటానికి ఎంతో ఉపయోగపడతాయన్నారు. అనంతరం వివిధ పోటీలలో గెలుపొందిన విద్యార్థిని విద్యార్థులకు బాపట్ల మున్సిపల్ కమిషనర్ యం .హాసిని బాపట్ల మండల విద్యాశాఖ అధికారి డి. ప్రసాద్ల చేత బహుమతులు అందజేశారు. వచ్చిన పెద్దలందరూ కూడా గ్రంథాలయాల ఆవశ్యకత ను తెలిపారు.అనంతరం గ్రంథాలయ అధికారి ఈ వారోత్సవాలు విజయవంతంగా నిర్వహించడానికి సహాయ సహకారాలు అందించిన ప్రతి ఒక్కరికి ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో గ్రంథాలయ అభివృద్ధి కమిటీ అధ్యక్షులు వివిధ స్కూల్ కు చెందిన ఉపాధ్యాయులు పట్టణ పెద్దలు విద్యార్థిని విద్యార్థులు పాల్గొన్నారు.

23వ డివిజన్‌లో తాటిపాముల మణికంఠ సాయి విస్తృత ప్రచారం



మంగళగిరి నవంబర్ 20 (విజన్ ఆంధ్ర)

మంగళగిరి తాడేపల్లి నగరపాలక సంస్థ ఎన్నికల్లో 23వ డివిజన్ నుంచి సీపీఎం, సీపీఐ బలపరిచిన వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి తాటిపాముల మణికంఠ సాయి గడపగడపకు వెళ్లి విస్తృతంగా ప్రచారం నిర్వహించారు. శుక్రవారం డివిజన్‌లోని పలు ప్రాంతాల్లో పర్యటిస్తూ తనకు ఓటు వేసి గెలిపించాలని ఓటర్లను అభ్యర్థించారు.

గత వైఎస్సార్ కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో చేపట్టిన అభివృద్ధి పనులను వివరిస్తూ, భవిష్యత్తులో డివిజన్ అభివృద్ధికి, స్థానిక సమస్యల పరిష్కారానికి నిరంతరం కృషి చేస్తానని మణికంఠ సాయి హామీ ఇచ్చారు. డివిజన్‌లోని ప్రజా సమస్యలపై పూర్తి అవగాహన ఉందని, ప్రజలకు అందుబాటులో ఉంటూ సేవలందిస్తానని కోరారు.ఈ ప్రచారంలో వైసీపీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు, మహిళలు, తదితరులు పాల్గొన్నారు.

ఎంపీ వైఎస్ అవినాష్ రెడ్డి కాన్వాయ్ పై దాడి ప్రజాస్వామ్యానికే గొడ్డలిపెట్టు..

యువజన విభాగం నాయకులు చల్లా సునీల్ కుమార్ రాజకీయ కక్షలతో భౌతిక దాడులకు దిగడం అన్యాయం

వేముల, నవంబర్ 20 (విజన్ ఆంధ్ర)

ప్రజాస్వామ్యంలో ఎన్నికలు ప్రశాంత వాతావరణంలో జరగాలి.కోర్టు ఆదేశాల మేరకు వైకాపా మద్దతు కలిగిన సర్పంచ్ అభ్యర్థుల నామినేషన్ల ప్రక్రియలో పాల్గొనేందుకు వెళుతున్న కడప ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డి కాన్వాయ్‌పై దాడి జరగడం ప్రజాస్వామ్య విలువలకు విరుద్ధమని కడప జిల్లా వైఎస్ఆర్సీపీ యువజన విభాగం కార్యనిర్వహక సభ్యులు,వైసీపీ నేత చల్లా సునీల్ కుమార్ ఆగ్రహం వ్యక్తం చేశారు. శుక్రవారం సింహాద్రిపురం మండలం అంకాలమ్మగూడూరు సమీపంలో



చోటుచేసుకున్న ఈ ఘటనను ఆయన తీవ్రంగా ఖండించారు. పార్టీ అభ్యర్థులకు మద్దతుగా నామినేషన్ల కార్యక్రమానికి వెళ్తున్న ఎంపీ కాన్వాయ్‌ను అడ్డుకుని రాళ్లు, కర్రలు, పెట్రోల్ బాంబులతో దాడి చేసినట్లు ఆరోపించారు.ఈ ఘటనలో ఓ వాహనం ధ్వంసమైనట్లు తెలిపారు.ఎంపీ అవినాష్ రెడ్డి ముందుగానే స్థానిక సి ఐ,ఎస్ ఐ లకు సమాచారం అందించిన కూడా ఇలాంటి దాడులు జరగడం వెనుక పోలీసు లు ఉన్నారేమో అనే అనుమానం కూడా వ్యక్తం చేశారు.రాజకీయ ప్రత్యర్థులపై భౌతిక దాడులకు దిగడం, నామినేషన్ల ప్రక్రియకు ఆటంకాలు కలిగించడం ప్రజాస్వామ్య స్ఫూర్తికి విరుద్ధమని పేర్కొన్నారు. ఎన్నికల్లో పోటీ చేసే హక్కును ప్రతి ఒక్కరికీ కల్పించాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందని, ఘటనపై సమగ్ర విచారణ జరిపి బాధ్యులపై చర్యలు తీసుకోవాలని సునీల్ కుమార్ డిమాండ్ చేశారు.ఈ ప్రభుత్వం లో ఎంపీ పై దాడి చెయ్యడానికి కూడా వెనకాడటం లేదు అని,సెక్యూరిటీ ఉన్న వ్యక్తిపై దాడికి కూడా తెగబడు తున్నారు అని,కూటమి పార్టీ వాళ్ళు ఎన్ని వ్యవస్థలను వాడుకొని విరుచుకుపడినా,ప్రాణాలకు తెగించి అయినా పోరాటం చేసేందుకు మా పార్టీ నాయకులు కార్యకర్తలు సిద్ధంగా ఉన్నామన్నారు ఎంపీ పై దాడిని కేంద్రం సీరియస్ గా తీసుకోవాలి అని అన్నారు.ఈ దాడి ఘటనపై తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేస్తూ,ప్రజా స్వామ్యంలో ఇలాంటి భౌతిక దాడులకు తావులేదని స్పష్టం చేశారు.ఈ ఘటనను 'ప్రజాస్వామ్యంపై జరిగిన దాడి'గా అభివర్ణించారు. ఎన్నికల ప్రక్రియను ప్రశాంతంగా నిర్వహించేలా అధికారులు చర్యలు తీసుకోవాలని,శాంతి భద్రతలకు విఘాతం కలిగించేలా ప్రవర్తించిన నిందితులపై తక్షణమే కఠిన చట్టపరమైన చర్యలు తీసుకోవాలని చల్లా సునీల్ కుమార్ డిమాండ్ చేశారు

రెండో విడత పంచాయతీ ఎన్నికల్లో

4,336 నామినేషన్లు

- జిల్లా కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి డా. శ్రీధర్ చెరుకూరి

-సర్పంచ్ పదవులకు 1,079, వార్డు సభ్యుల పదవులకు 3,257 నామినేషన్లు



కడప,నవంబర్ 20 (విజన్ ఆంధ్ర):

వైఎస్ఆర్ కడప జిల్లాలో రెండో విడత గ్రామ పంచాయతీ ఎన్నికల నామినేషన్ల ప్రక్రియ ముగిసింది. మూడు రోజుల పాటు 13 మండలాల్లో జరిగిన నామినేషన్ల స్వీకరణలో మొత్తం 4,336 నామినేషన్లు దాఖలైనట్లు జిల్లా కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి డా. శ్రీధర్ చెరుకూరి తెలిపారు. ఇందులో సర్పంచ్ పదవులకు 1,079, వార్డు సభ్యుల పదవులకు 3,257 నామినేషన్లు వచ్చినట్లు వెల్లడించారు.నవంబర్ 18న మొదటి రోజు సర్పంచ్ పదవులకు 366, వార్డు సభ్యుల పదవులకు 765 కలిపి మొత్తం 1,131 నామినేషన్లు దాఖ లయ్యాయి. నవంబర్ 19న రెండో రోజు సర్పంచ్ పదవులకు 425, వార్డు సభ్యుల పదవులకు 1,354 కలిపి 1,779 నామినేషన్లు వచ్చాయి. చివరి రోజైన నవంబర్ 20న సర్పంచ్ పదవులకు 288, వార్డు సభ్యుల పదవులకు 1,138 కలిపి 1,426 నామినేషన్లు దాఖలైనట్లు కలెక్టర్ వివరించారు.మండలాల వారీగా చివరి రోజు సర్పంచ్ పదవులకు చక్రాయపేటలో 38, వి.ఎన్.పల్లిలో 31, లింగాలలో 30, సింహాద్రిపురంలో 26, సి.కె.దిన్నెలో 25, చెన్నూరులో 25, వేములలో 23, వేంపల్లిలో 22, పెండ్లిమర్రిలో 17, వల్లూరులో 16, కమలాపురంలో 14, తొండూరులో 11, పులివెందులలో 10 నామినేషన్లు దాఖలైనట్లు తెలిపారు.వార్డు సభ్యుల పదవులకు వి.ఎన్.పల్లిలో 135, చక్రాయపేటలో 127, లింగాలలో 123, సి.కె.దిన్నెలో 118, కమలాపురంలో 112, పెండ్లిమర్రిలో 94, వల్లూరులో 83, చెన్నూరులో 76, సింహాద్రిపురంలో 76, వేంపల్లిలో 70, తొండూరులో 48, పులివెందులలో 39, వేములలో 37 నామినేషన్లు వచ్చినట్లు కలెక్టర్ పేర్కొన్నారు.నామినేషన్ల పరిశీలన నవంబర్ 21న నిర్వహించనున్నట్లు, పరిశీలనలో తిరస్కరణకు గురైన నామినేషన్లపై నవంబర్ 22వ తేదీ సాయంత్రం 5 గంటల వరకు అప్పీల్ చేసుకోవచ్చని తెలిపారు. అప్పీళ్ల పరిష్కారం నవంబర్ 23న జరుగుతుందని, నవంబర్ 24వ తేదీ మధ్యాహ్నం 3 గంటల వరకు నామినేషన్ల ఉపసంహరణకు అవకాశం ఉంటుందని వివరించారు.నవంబర్ 29న ఉదయం 7 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు పోలింగ్ నిర్వహించనున్నట్లు, అదే రోజు మధ్యాహ్నం 2 గంటల నుంచి ఓట్ల లెక్కింపు చేపట్టి ఫలితాలు ప్రకటించ నున్నట్లు జిల్లా కలెక్టర్ డా. శ్రీధర్ చెరుకూరి తెలిపారు

బాలల భద్రత సమాజంలోని ప్రతి ఒక్కరి బాధ్యత

సీనియర్ సివిల్ జడ్జి బాబా ఫక్రుద్దీన్

చింతకొమ్మదిన్నె జిల్లా పరిషత్ హైస్కూల్‌లో విద్యార్థులకు అవగాహన కార్యక్రమం

కడప,నవంబర్ 20 (విజన్ ఆంధ్ర)

బాలల భద్రత, హక్కుల పరిరక్షణ అనేది కేవలం తల్లిదండ్రులు, ఉపాధ్యాయుల బాధ్యత మాత్రమే కాదని, సమాజంలోని ప్రతి ఒక్కరి బాధ్యత అని జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి, సీనియర్ సివిల్ జడ్జి ఎస్. బాబా ఫక్రుద్దీన్ అన్నారు. ప్రతి బాలుడికి విద్య, ఆరోగ్యం, రక్షణతో పాటు గౌరవప్రదమైన జీవనం పొందే హక్కు ఉందని పేర్కొన్నారు.నేషనల్ లీగల్ సర్వీసెస్ అథారిటీ ఆధ్వర్యంలో చేపట్టిన 'సురక్షిత బాల్యం సమాజ బాధ్యత' కార్యక్రమంలో భాగంగా, ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర న్యాయ సేవాధికార సంస్థ ఆదేశాల మేరకు, జిల్లా న్యాయ సేవాధికార సంస్థ చైర్మన్, జిల్లా ప్రధాన న్యాయమూర్తి జి. రామ గోపాల్ సూచనలతో శుక్రవారం చింతకొమ్మదిన్నె జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు.ఈ సందర్భంగా ముఖ్య అతిథిగా పాల్గొన్న ఎస్. బాబా ఫక్రుద్దీన్ మాట్లాడుతూ.బాలలపై జరిగే వేధింపులు, బాల్య వివాహాలు,బాల కార్మికత్వం, లైంగిక దాడుల పట్ల విద్యార్థులు అప్రమత్తంగా ఉండాలని సూచించారు.మంచి స్పర్శ, చెడు స్పర్శపై అవగాహన కలిగి ఉండాలని, ఏదైనా సమస్య ఎదురైతే భయ పడకుండా తల్లిదండ్రులు, ఉపాధ్యాయులకు తెలియ జేయాలని చెప్పారు.బాలల హక్కులకు భంగం కలిగినప్పుడు జిల్లా న్యాయ సేవాధికార సంస్థ ద్వారా ఉచిత న్యాయ సహాయం, చట్టపరమైన రక్షణ



పొందవచ్చని తెలిపారు. న్యాయ సహాయం కోసం 15100, బాలల సహాయం కోసం 1098 నంబర్లను సంప్రదించాలనిసూచించారు.ఈ కార్యక్రమంలో పాల్గొన్న సైబర్ క్రైమ్ సబ్ ఇన్‌స్పెక్టర్ శాంత మాట్లాడుతూ.ప్రస్తుత కాలంలో ఆన్‌లైన్ మోసాలు, నకిలీ లింకులు, సైబర్ బెదిరింపులు, సామాజిక మాధ్యమాల దుర్వినియోగం పట్ల విద్యార్థులు జాగ్రత్తగా ఉండాలని సూచించారు. అపరిచితులు పంపే లింకులను తెరవకూడదని, ఓటీపీలు, పాస్‌వర్డ్‌లు, వ్యక్తిగత వివరాలను ఇతరులకు తెలియ జేయరాదని చెప్పారు. సైబర్ నేరాలకు గురైతే వెంటనే 1930 నంబర్‌కు ఫిర్యాదు చేయాలని తెలిపారు.చైల్డ్ వెల్ఫేర్ కమిటీ సభ్యుడు సుభాష్ మాట్లాడుతూ.బాలల హక్కులు, రక్షణ, సంక్షేమం కోసం ప్రభుత్వం అనేక వ్యవస్థలను ఏర్పాటు చేసిందని తెలిపారు. బాలలపై వేధింపులు, నిర్లక్ష్యం, బాల కార్మికత్వం, బాల్య వివాహాలు వంటి అంశాలు గుర్తించినప్పుడు వెంటనే సంబంధిత అధికారులకు సమాచారం అందించాలని సూచించారు. ఆపదలో ఉన్న బాలలకు రక్షణ, పునరావాసం కల్పించడంలో చైల్డ్ వెల్ఫేర్ కమిటీ కీలక పాత్ర పోషిస్తుందని వివరించారు.బాలలకు సురక్షితమైన వాతావరణం కల్పించ డంలో కుటుంబం, పాఠశాల,సమాజం సమష్టిగా కృషి చేయాలని, ప్రతి చిన్నారికి భయంలేని బాల్యాన్ని అందించాలని కార్యక్రమంలో పిలుపు నిచ్చారు.ఈ కార్యక్రమంలో పాఠశాల ఇన్‌చార్జి ప్రధానోపాధ్యాయుడు రామాంజనేయ రెడ్డి, సైబర్ క్రైమ్ సబ్ ఇన్‌స్పెక్టర్ శాంత, చైల్డ్ వెల్ఫేర్ కమిటీ సభ్యుడు సుభాష్, లీగల్ ఎయిడ్ డిఫెన్స్ కౌన్సిల్స్, డీఎల్ఎస్ఏ సిబ్బంది, న్యాయ సేవా స్వచ్ఛంద కార్యకర్తలు,ఉపాధ్యా యులు, విద్యార్థులు పాల్గొన్నారు.

కార్తీక ఏకాదశి సందర్భంగా

పెద్ద అర్వపల్లిలో ఘనంగా సత్సంగం

రేపల్లె, నవంబర్ 20 (విజన్ ఆంధ్ర)


కార్తీకమాసం ఏకాదశి పర్వదినాన్ని పురస్కరించుకుని రేపల్లె మండలం పెద్ద అర్వపల్లి గ్రామంలోని శ్రీ రామాలయంలో శుక్రవారం సత్సంగం కార్యక్రమం అత్యంత భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. భజన సమాజ సభ్యులు వెంకట సుబ్బమ్మ, మారుతి లక్ష్మీ మరియు ఆలయ కమిటీ సభ్యులు వినుకొండ శివనాంచారయ్య ఆధ్వర్యంలో ఈ ఆధ్యాత్మిక కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా ఆలయ ప్రాంగణం భక్తుల నామస్మరణతో మారుమోగింది. కార్యక్రమంలో భాగంగా విశేష పూజలు, భజనలు మరియు సామూహిక నామసంకీర్తనలు నిర్వహించారు. గ్రామానికి చెందిన భక్తులు, మహిళలు పెద్ద సంఖ్యలో పాల్గొని స్వామివారిని దర్శించుకున్నారు. అనంతరం నిర్వాహకులు భక్తులకు తీర్థప్రసాదాలు పంపిణీ చేశారు.

పాఠశాల చెంతనే దుర్వాసన కూపం!

విద్యార్థులు, వ్యాపారులకు తీవ్ర ఇక్కట్లు..

తెనాలి నవంబర్ 20 (విజన్ ఆంధ్ర)

:విద్యాబుద్ధులు నేర్చుకోవాల్సిన చిన్నారులకు పాఠశాల పక్కనే ఉన్న పబ్లిక్ మరుగుదొడ్లు ఇబ్బందికరంగా మారాయి. అపరిశు భ్రత, దుర్వాసనతో విద్యార్థులు, స్థానిక వ్యాపారులు, పాదచారులు తీవ్ర అవస్థలు పడుతున్నారు. గతంలో భోజనం చేసే సమయంలో దుర్వాసన భరించలేక విద్యార్థులు వాంతులు చేసుకున్న సందర్భాలు కూడా ఉన్నాయని మానవ హక్కుల జాతీయ నాయకుడు పల్నాటి నాగరాజు ఆవేదన వ్యక్తం చేశారు. పట్టణంలోని సత్యనారాయణ టాకీస్ సందులో పాఠశాలను ఆనుకుని ఉన్న పబ్లిక్ మరుగుదొడ్లను తొలగించాలని కోరుతూ మున్సిపల్ కమిషనర్ జె.అప్పలనాయుడుకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా నాగరాజు మాట్లాడుతూ మరుగుదొడ్ల నుంచి వెలువడుతున్న దుర్వాసనతో విద్యార్థులు, రహదారిపై వెళ్లే పాదచారులు, సమీపంలోని బ్యాగుల దుకాణాల యజమానులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు. ప్రజారోగ్యం, చిన్నారుల ఆరోగ్యాన్ని దృష్టిలో ఉంచుకుని వాటిని వెంటనే తొలగించి ప్రత్యామ్నాయ ప్రాంతంలో ఏర్పాటు చేయాలని కోరారు. స్థానిక దుకాణాల యజమానులు సైతం ఈ మరుగుదొడ్ల వల్ల ఇబ్బందులు పడుతున్నారని, తమకు అవి



అవసరం లేదని తెలిపినట్లు పేర్కొన్నారు.దీనిపై కమిషనర్ జె.అప్పలనాయుడు స్పందిస్తూ గతంలోనూ మరుగుదొడ్లను శు భ్రం చేయించామని, ప్రస్తుతం కూడా పరిశుభ్రతకు చర్యలు తీసుకుని ప్రజలకు ఇబ్బందులు లేకుండా చూస్తామని హామీ ఇచ్చారు. అయితే కొంతమంది ప్రజల అవసరాల కోసం ఏర్పాటు చేసిన పబ్లిక్ మరుగుదొడ్లను దుకాణాల యజమానుల అభ్యర్థన మేరకు తొలగించడం సాధ్యం కాదని స్పష్టం చేశారు.సమస్య పరిష్కారం కాకపోతే దుకాణాల యజమానులతో కలిసి పెద్ద ఎత్తున ధర్నా నిర్వహిస్తామని నాగరాజు హెచ్చరించారు.అవసరమైతే అధికారుల నిర్లక్ష్యంపై హైకోర్టును ఆశ్రయించి న్యాయపోరాటం చేస్తామని స్పష్టం చేశారు.కార్యక్రమంలో దుకాణాల యజమానులు రమణ, శివ, వెంకటేష్, షేక్ గౌస్ తదితరులు పాల్గొన్నారు.

ప్రజల గుండెచప్పుడు ప్రజాదర్బార్ : తూర్పు ఎమ్మెల్యే నసీర్.

గుంటూరు, నవంబర్ 20. (విజన్ ఆంధ్ర)

ప్రజాదర్బార్ ప్రజల గుండెచప్పుడు వినే గొప్ప వేదిక అని, రాష్ట్రంలో త్వరలో అర్హులైన ప్రతి ఒక్కరికీ పింఛన్లు అందించబోతున్నామని గుంటూరు తూర్పు ఎమ్మెల్యే, అసెంబ్లీ మైనారిటీస్ కమిటీ చైర్మన్ నసీర్ తెలిపారు. శుక్రవారం స్థానిక తూర్పు కార్యాలయంలో ప్రజాదర్బార్ నిర్వహించారు. ప్రజల నుంచి వచ్చిన అర్జీలను ఎమ్మెల్యే స్వయంగా స్వీకరించారు. ప్రతి అర్జీకి జవాబుదారీగా ఉంటామని తెలిపారు. ప్రజాదర్బార్ కు వెళితే తమ సమస్యలు పరిష్కరించేందుకు భరోసా నిలుస్తుందనే నమ్మకం కలిగించామని చెప్పారు. తమ కార్యాలయంలో ప్రతి రోజూ ప్రజాదర్బార్ నిర్వహిస్తున్నామని, ప్రజల నుంచి వినతులు స్వీకరిస్తున్నామని తెలిపారు. ఎక్కువగా పింఛన్లు, ఇంటి స్థలాలు, శానిటేషన్, రేషన్ కార్డుల కోసం దరఖాస్తు వచ్చాయని, సంబంధిత అధికారులకు అర్జీలను పంపించి వెంటనే పరిష్కారానికి చర్యలు తీసుకోవాల్సిందిగా ఆదేశించామని చెప్పారు. పింఛన్ల కోసం గుంటూరు తూర్పు నియోజకవర్గంలో ఇప్పటికే అర్హులైన వారిని గుర్తించామన్నారు. అర్హులైన ఏ ఒక్కరికైనా సంక్షేమ పథకాలు అందకపోతే వెంటనే తమ కార్యాలయాన్ని సంప్రదించవచ్చని, ఎల్లప్పుడూ అందుబాటులో ఉండి సేవలందిస్తామని చెప్పారు. స్థానిక ఎన్నికల్లో విజయం సాధించిన కార్పొరేటర్లు క్షేత్రస్థాయిలో కలిసికట్టుగా ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి చేయాలన్నారు. గుంటూరు నగరంలో మరింత అభివృద్ధి సాధించే విధంగా పటిష్ట ప్రణాళిక రూపొందించబోతున్నామని చెప్పారు. గుంటూరు తూర్పు నియోజకవర్గంలో ఎన్నడూలేని విధంగా అన్ని రంగాల్లో ప్రగతి సాధించామని తెలిపారు. అభివృద్ధి, సంక్షేమానికి సుమారు రూ.4000 కోట్లు వెచ్చించామన్నారు. మురుగు శాశ్వత పరిష్కారానికి ప్రత్యేక చర్యలు తీసుకున్నామని చెప్పారు. అంతర్గత రోడ్లను సైతం సీసీలుగా తీర్చిదిద్దుతున్నామని, గత వైసీపీలో గుంతల రోడ్లతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారని చెప్పారు. కేవలం రోడ్లనే కాకుండా పార్కులు, క్రీడా ప్రాంగణాలు, వాకింగ్ ట్రాక్ నిర్మాణాలు చేపడుతున్నామని తెలియజేసారు.

వార్డు సమస్యలపై కమిషనర్‌కు క్షేత్రస్థాయి వినతి.

- పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి.



తెనాలి నవంబర్ 20 (విజన్ ఆంధ్ర)

ప్రజలు నిత్యం ఎదుర్కొంటున్న సమస్యలను క్షేత్రస్థాయిలో గుర్తించి, వాటికి పరిష్కారం చూపించడమే లక్ష్యంగా 3వ వార్డులో ప్రత్యేక పర్యటన నిర్వహించారు. వార్డు ఇన్‌ఛార్జి శిల్పాల శ్రీనివాస్ ఆధ్వర్యంలో మున్సిపల్ కమిషనర్ రామ అప్పలనాయుడుకు వార్డులోని పలు సమస్యలను ప్రత్యక్షంగా చూపించి వివరించారు.ఈ సందర్భంగా వార్డులో నెలకొన్న పారిశుద్ధ్య లోపాలు, మురుగునీటి సమస్యలు, రహదారుల దుస్థితి, వీధి దీపాలు, ఇతర మౌలిక వసతుల కొరతను కమిషనర్ దృష్టికి తీసుకెళ్లారు. ప్రజలు ఎదుర్కొంటున్న ఇబ్బందులను వివరించి, ఆయా సమస్యలను ప్రాధాన్యత క్రమంలో గుర్తించి త్వరితగతిన పరిష్కరించాలని కోరారు.వార్డులోని ప్రతి ప్రాంతాన్ని పరిశీలించిన కమిషనర్ సంబంధిత సమస్యలపై మున్సిపల్ సిబ్బందికి తగిన సూచనలు చేశారు. ప్రజలకు మెరుగైన సౌకర్యాలు కల్పించేందుకు అవసరమైన చర్యలు చేపట్టాలని సూచించారు.ఈ కార్యక్రమంలో 3వ వార్డు ఇన్‌ఛార్జి, వైకుంఠపురం ట్రస్టు బోర్డు సభ్యుడు శిల్పాల శ్రీనివాస్, వార్డు కౌన్సిలర్ షేక్ హన్ని, కూటమి నాయకులు, మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు.

24వ డివిజన్‌లో సైమాన్ ప్రచార హోరు..

ప్రత్యర్థులకు గట్టి సవాల్!


- కూటమి అభ్యర్థి కొదమల సురేష్ (సైమాన్)కు భారీ మెజార్టీ లక్ష్యంగా ఇంటింటా ప్రచారం..

మంగళగిరి నవంబర్ 20(విజన్ ఆంధ్ర)

మంగళగిరి తాడేపల్లి నగరపాలక సంస్థ పరిధిలో ఎన్నికల వేడి రోజురోజుకూ పెరుగుతోంది. ఈ నెల 26న జరగనున్న ఎన్నికల్లో 24వ డివిజన్‌ను కూటమి ఖాతాలో వేసుకోవడమే లక్ష్యంగా తెలుగుదేశం, జనసేన, బీజేపీ బలపరిచిన అభ్యర్థి కొదమల సురేష్ (సైమాన్) ప్రచార రంగంలో దూసుకుపోతున్నారు. డివిజన్ పరిధిలో ఇంటింటికీ వెళ్లి ఓటర్లను కలుస్తూ తనకు మద్దతు తెలిపి అత్యధిక మెజార్టీతో గెలిపించాలని అభ్యర్థిస్తున్నారు. 24వ డివిజన్‌లో ప్రజల ఆదరణే తన బలమని పేర్కొంటూ, డివిజన్ అభివృద్ధికి నిరంతరం కృషి చేస్తానని కొదమల సురేష్ (సైమాన్) ప్రజలకు విజ్ఞప్తి చేశారు. ఎన్నికల్లో కూటమి అభ్యర్థికి మద్దతు తెలిపి భారీ మెజార్టీతో గెలిపించాలని కోరారు. నాయకులు, కార్యకర్తలు సమన్వయంతో సాగిస్తున్న ఇంటింటి ప్రచారంతో డివిజన్‌లో ఎన్నికల సందడి నెలకొంది.ఈ ప్రచార కార్యక్రమంలో మాతంగి రవి కిరణ్,బుల్లా పిచ్చయ్య, రావూరి విజయానంద్, బుల్లా రాము, బుల్లా వేణు,కట్టేపోగు దాసు, నందిగం బిక్షలు, బుల్లా సతీష్, చిలకా ప్రభుదాస్, కలకోటి రాజ్ కుమార్ కట్టేపోగు సీమోను బుల్లా ఆదర్సులు, బుల్లా కోటి, బుల్లా సతీష్ , మాతంగి రవి కిరణ్, తదితరులు పాల్గొన్నారు.

ఎయిర్‌బీఎన్‌బీ ఆధ్వర్యంలో ఎట్ హోమ్ రాయ్‌చంద్





విశాఖపట్నం, నవంబర్ 20 (విజన్ ఆంధ్ర):

బాలీవుడ్ యొక్క అత్యంత ప్రసిద్ధ కుటుంబ గృహాలలో ఒకదానిలో గడిపే అవకాశాన్ని అభిమానులకు ఎయిర్‌బీఎన్‌బీ కల్పిస్తోంది.'కభీ ఖుషీ కభీ గమ్' (కే3జీ) 25 సంవత్సరాల వేడుకలను పురస్కరించుకుని, కరణ్, పూ పాత్రధారి కరీం కపూర్ ఖాన్ మరియు రోహన్‌లతో కూడిన బాలీవుడ్ అభిమానులు ఎక్కువ మంది ఇష్టపడే గృహాలలో ఒకదానిలో వినూత్న అనుభవాలను సొంతం చేసుకోవడానికి ఎయిర్‌బీఎన్‌బీ అభిమానులను ఆహ్వానిస్తోంది.ఈ చిత్రం తొలిసారిగా విడుదలై ప్రేక్షకుల హృదయాలను గెలుచుకున్న 25 సంవత్సరాల తర్వాత, కే3జీ ప్రపంచానికి జీవం పోస్తూ, పునఃరూపకల్పన చేయబడిన రాయ్‌చంద్ హౌస్‌లోకి అభిమానులు మొదటిసారిగా అడుగుపెట్టే అవకాశం కల్పిస్తోంది.ఈ సందర్భంగా ఎయిర్‌బిఎన్‌బి ఇండియా హెడ్ అయిన అమన్‌ప్రీత్ సింగ్ బజాజ్ మాట్లాడుతూ ' కే3జీ ' చిత్రం ద్వారా ప్రేక్షకులకు రాయ్‌చంద్ కుటుంబాన్ని తొలిసారిగా పరిచయం చేసిన ఇరవై ఐదు సంవత్సరాల తర్వాత, ఎయిర్‌బీఎన్‌బీ దీనిని సాధ్యం చేస్తోందన్నారు.ఈ చిత్రం యొక్క 25వ వార్షికోత్సవాన్ని పురస్కరించుకుని, ముంబైలో అత్యంత ప్రతిష్టాత్మకమైన రాయ్‌చంద్ హౌస్‌ను ఎయిర్‌బీఎన్‌బీ పునఃరూపకల్పన చేస్తోందని చెప్పారు. 'ఎట్ హోమ్ విత్ ది రాయ్‌చంద్స్' పేరుతో అభిమానులను ఆహ్వానిస్తున్నామని, కే3జీ ప్రపంచాన్ని సృష్టించిన సినీ దర్శకుడు కరణ్ జోహార్, పూ పాత్రధారి కరీనాకపూర్ ఖాన్, రోహన్ రాయ్‌చంద్ హోస్ట్‌లుగా వ్యవహరించనున్నారని చెప్పారు. ఈ ప్రత్యేక అనుభవం ఎయిర్‌బీఎన్‌బీలో మాత్రమే అందుబాటులో ఉంటుందని,భారతీయ సినిమాలోని కొన్ని అత్యంత ఆదరణ పొందిన పాత్రలు, సంభాషణలు మరియు ఫ్యాషన్ క్షణాలను మనకు అందించిన చిత్రంగా, రాయ్‌చంద్ హౌస్ ఎల్లప్పుడూ దానికదే ఒక ప్రత్యేక ప్రపంచంగా నిలిచింది. కుటుంబ నాటకీయ పరిణామాలు చోటుచేసుకున్నది ఇక్కడే. గ్రాండ్ ఎంట్రీలు జరిగాయి. పూ తనదైన ఫ్యాషన్ శైలితో ఆకట్టుకోగా, రోహన్ తన ఆకర్షణీయమైన వ్యక్తిత్వంతో అభిమానుల మనసులు గెలుచుకున్నాడు. ఇప్పుడు, అభిమానులు కేవలం తెరపైనే కాకుండా, ఆ ప్రపంచాన్ని స్వయంగా అన్వేషించే అవకాశం పొందవచ్చు అని చెప్పారు. పాత జ్ఞాపకాలు, ఫ్యాషన్, కుటుంబ అనుబంధాలు, కొంచెం డ్రామా మరియు మీలోని బాలీవుడ్ తారను బయటకు తీసుకువచ్చేందుకు ఎన్నో అవకాశాలు ఇప్పుడు ఇక్కడ మీకోసం ఎదురుచూస్తున్నాయి.ఈ సినిమాతో పెరిగి పెద్దయిన, అందులోని సంభాషణలను వల్లెవేసిన , ఐకానిక్ సన్నివేశాలను తిరిగి సృష్టించుకున్న తరతరాల అభిమానుల కోసం, 'ఎట్ హోమ్ విత్ ది రాయ్‌చంద్స్' ఒక సరికొత్త అనుభవాన్ని అందించనుందన్నారు. డిసెంబర్ 1 నుంచి 6 వరకు కేవలం 180 మందికి మాత్రమే ఈ అవకాశం ఉంటుందని తెలిపారు.

అమన్ గుప్తాతో కలిసి పురుషుల పర్సనల్ కేర్ బ్రాండ్ హెచ్‌ఐఎం (హ్యాండ్‌సమ్ ఇండియన్ మ్యాన్)ను ప్రారంభించిన రణ్‌వీర్ సింగ్



విశాఖపట్నం, నవంబర్ 20 (విజన్ ఆంధ్ర):

భారతీయ చర్మం, భారతీయ వాతావరణం, భారతీయ జీవశాస్త్రానికి అనుగుణంగా ప్రత్యేకంగా రూపొందించిన పురుషుల పర్సనల్ కేర్ బ్రాండ్ హెచ్‌ఐఎం (హ్యాండ్‌సమ్ ఇండియన్ మ్యాన్)ను రణ్‌వీర్ సింగ్, అమన్ గుప్తా ఈరోజు ప్రారంభించారు. ఫేస్, బాడీ, హెయిర్ విభాగాల్లో ఎనిమిది ఉత్పత్తులతో హెచ్‌ఐఎంమార్కెట్లోకి అడుగుపెట్టింది. ప్రతి ఉత్పత్తిలోనూ ఈ బ్రాండ్ కోసమే ప్రత్యేకంగా అభివృద్ధి చేసిన ఇన్ ఎక్స్ టీ అనే సొంత మాలిక్యూల్ ఉంది. ఈ లాంచ్‌తో పాటు ఇద్దరు సహ వ్యవస్థాపకులూ నటించిన ఒక బ్రాండ్ ఫిల్మ్‌ను కూడా విడుదల చేశారు. హెచ్‌ఐఎం భారతదేశంలో అత్యంత వేగంగా వృద్ధి చెందుతున్న బ్రాండ్. ఇది ఇప్పుడు వినియోగదారు విభాగాలలో ఒకదానిలోకి ప్రవేశిస్తోంది. 'రెడీసర్' అంచనా ప్రకారం, భారతదేశపు సౌందర్య మరియు వ్యక్తిగత సంరక్షణ మార్కెట్ విలువ ప్రస్తుతం సుమారు రూ. 2.2 లక్షల కోట్లుగా ఉంది; ఇది 2031 ఆర్థిక సంవత్సరం నాటికి దాదాపు రెట్టింపు అయి, సుమారు రూ. 4 లక్షల కోట్లకు చేరుకుంటుందని అంచనా. భారత్‌లో అత్యంత వేగంగా వృద్ధి చెందుతున్న వినియోగదారుల విభాగాల్లో ఒకదానిలోకి హెచ్‌ఐఎంప్రవేశించింది. రెడ్ సీర్ అంచనాల ప్రకారం, భారత బ్యూటీ, పర్సనల్ కేర్ మార్కెట్ విలువ సుమారు రూ. 2.2 లక్షల కోట్లు; ఎఫ్ వై 2031 నాటికి ఇది దాదాపు రెట్టింపై సుమారు రూ. 4 లక్షల కోట్లకు చేరుతుందని అంచనా. అయినప్పటికీ, ఈ విభాగంలో అత్యంత నిర్లక్ష్యానికి గురవుతున్న వినియోగదారుల్లో భారతీయ పురుషుడు ఇప్పటికీ ఒకడిగానే ఉన్నాడు. దేశ జనాభాలో పురుషులు దాదాపు సగం ఉన్నా, బ్యూటీ, పర్సనల్ కేర్ ఖర్చులో వారి వాటా పదో వంతు కంటే తక్కువే. భారత్‌లో పురుషుల గ్రూమింగ్ ఎప్పుడూ చివరి ప్రాధాన్యతగానే ఉంది వేరొకరి కోసం తయారైన ఉత్పత్తులను తర్వాత పురుషులకు తగ్గట్టుగా మార్చారు.

గ్రామీణ అభివృద్ధిలో జిల్లా పరిషత్ కీలకం కావాలి

జిల్లా కలెక్టర్ డా. శ్రీధర్ చెరుకూరి

- జిల్లా కలెక్టర్ అధ్యక్షతన జిల్లా పరిషత్ వైర్మన్, వైస్ వైర్మన్ ఎన్నిక ఏకగ్రీవం
- నూతన జెడ్పీ పాలక వర్గ సభ్యులతో ప్రమాణ స్వీకారం చేయించిన జిల్లా కలెక్టర్
- ప్రజలకు అందుబాటులో ఉంటూ అభివృద్ధికి కృషి చేయాలి:- జెడ్పీ చైర్మన్ పుత్తా నర్సింహారెడ్డి









కడప,నవంబర్ 20 (విజన్ ఆంధ్ర)

గ్రామీణ ప్రాంతాల సమగ్ర అభివృద్ధికి జిల్లా పరిషత్ కీలకం కావాలని. ప్రతి ఒక్కరు సమ స్వయంతో పనిచేసి, ప్రజల అవసరాలు,ఆకాంక్షలకు అనుగుణంగా అభివృద్ధి కార్యక్రమాలను క్షేత్రస్థాయిలో అమలు చేయాలని జిల్లా కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి డా. శ్రీధర్ చెరుకూరి నూతన జెడ్పీటిసి సభ్యులను కోరారు.శుక్రవారం జిల్లా పరిషత్ సమావేశ మందిరంలో జిల్లా కలెక్టర్ అధ్యక్షతన నూతనంగా ఎన్నికైన జెడ్పీటీసీ సభ్యుల ప్రమాణ స్వీకారం, జిల్లా పరిషత్ చైర్మన్, వైస్ చైర్మన్ ఎన్నికల కార్యక్రమాలు నిర్వహించారు.ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.జిల్లా పరిషత్ వ్యవస్థకు జిల్లాలో ప్రత్యేకమైన చరిత్ర ఉందని, గతంలో పలువురు చైర్మన్లు, వైస్ చైర్మన్లు, జెడ్పీటీసీ సభ్యులు అందించిన సేవలతో ఈ వ్యవస్థకు గుర్తింపు లభించిందన్నారు. పంచాయతీరాజ్ చట్టం ప్రకారం గ్రామీణ ప్రాంతాల్లో చేపట్టే అభివృద్ధి పనులను పర్యవేక్షించడం, గ్రామాలు, మండలాల్లో ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను గుర్తించి పరిష్కరించడం జిల్లా పరిషత్ ప్రధాన బాధ్యతలని తెలిపారు.జిల్లా పరిషత్ పరిధిలోని పాఠశాలలు, కళాశాలలు, ఇతర సంస్థలు, మండల పరిషత్‌ల పనితీరును పర్యవేక్షించడంతో పాటు వాటి ఆస్తులను కాపాడాల్సిన బాధ్యత కూడా ఉందన్నారు. జిల్లా పరిషత్‌కు వచ్చే ఆదాయాన్ని గ్రామీణ ప్రాంతాల్లో మౌలిక సదుపాయాల కల్పన, సాగునీరు, పారిశుధ్యం, విద్య వంటి ముఖ్యమైన రంగాలకు వినియోగిస్తూ అభివృద్ధికి ప్రాధాన్యం ఇవ్వాలని సూచించారు.వివి జీ-రామ్-జీ పథకం ద్వారా జిల్లాలో ప్రతి సంవత్సరం సుమారు రూ.300 కోట్ల నుంచి రూ.350 కోట్ల విలువైన పనులు చేపట్టేందుకు అవకాశం ఉందన్నారు. గ్రామ, మండల స్థాయిల్లో అవసరమైన పనులను గుర్తించి కార్యాచరణ ప్రణాళిక రూపొందించి జిల్లా కలెక్టర్‌కు పంపాలని, ఆమోదం పొందిన తర్వాత పనులు చేపట్టాలని వివరించారు. ఈ పనుల అమలును జిల్లా పరిషత్ సభ్యులు ఎప్పటికప్పుడు పర్యవేక్షించాలని సూచించారు.జిల్లాలోని స్వయం సహాయక సంఘాలకు ప్రతి సంవత్సరం సుమారు రూ.1,500 కోట్ల నుంచి రూ.1,700 కోట్ల వరకు బ్యాంకుల ద్వారా రుణాలు అందుతున్నాయని కలెక్టర్ తెలిపారు. మహిళా సంఘాలు ఈ రుణాలను ఆర్థిక అభివృద్ధికి వినియోగించుకుంటూ సకాలంలో తిరిగి చెల్లిస్తున్నాయని పేర్కొన్నారు. సంఘాల పనితీరును సమీక్షించడం, వాటి ఆర్థిక అభివృద్ధికి మరింత ప్రోత్సాహం అందించేలా జిల్లా పరిషత్ సభ్యులు చొరవ చూపాలన్నారు.వ్యవసాయం, సాగునీరు, విద్య, సాంకేతిక రంగం, తాగునీరు తదితర గ్రామీణ అవసరాలకు సంబంధించిన పథకాల అమలుపై జిల్లా పరిషత్ సర్వసభ్య సమావేశాల్లో ఎప్పటి కప్పుడు సమీక్షించాలని సూచించారు. గ్రామీణ ప్రాంతాల్లో నెలకొన్న సమస్యలను గుర్తించి, వాటి పరిష్కారానికి అవసరమైన చర్యలు తీసుకోవాలని తెలిపారు. ప్రజాప్రతినిధుల సూచనలు, సలహాలతో అభివృద్ధి కార్యక్రమాలను మరింత వేగంగా, పారదర్శకంగా అమలు చేయవచ్చన్నారు.ప్రజలు ఎన్నో ఆశలు, ఆకాంక్షలతో ప్రజాప్రతినిధులను ఎన్నుకున్నారని, వారి నమ్మకాన్ని నిలబెట్టుకునేలా ప్రతి ఒక్కరూ బాధ్యతగా పనిచేయాలని కలెక్టర్ కోరారు. గ్రామ, మండల స్థాయిలో పరిష్కారం కాని సమస్యలను జిల్లా పరిషత్ చైర్మన్ లేదా జిల్లా యంత్రాంగం దృష్టికి తీసుకురావచ్చని తెలిపారు. ప్రజాప్రతినిధులతో కలిసి పనిచేస్తూ గ్రామీణ ప్రాంతాల అభివృద్ధికి అవసరమైన సహకారం అందించేందుకు జిల్లా యంత్రాంగం ఎల్లప్పుడూ సిద్ధంగా ఉంటుందని స్పష్టం చేశారు.ప్రజలకు అందుబాటులో ఉంటూ మండలాల అభివృద్ధికి కృషి చేయాలి. జెడ్పీ చైర్మన్ పుత్తా నర్సింహారెడ్డి

నూతనంగా ఎన్నికైన జిల్లా పరిషత్ చైర్మన్ పుత్తా నర్సింహారెడ్డి మాట్లాడుతూ కొత్తగా ఎన్నికైన జెడ్పీటీసీ సభ్యులందరూ తమకు అప్పగించిన బాధ్యతలను సమర్థవంతంగా నిర్వహిస్తూ ఆయా మండలాల అభివృద్ధికి కృషి చేయాలని కోరారు. రాష్ట్ర ప్రభుత్వం అందిస్తున్న సహాయ సహకారాలు, అమలు చేస్తున్న అభివృద్ధి కార్యక్రమాల ప్రయోజనాలు క్షేత్రస్థాయిలో ప్రజలకు అందేలా చూడాలన్నారు.

ప్రధానంగా జిల్లాలో ఎన్నినో ప్రభావాన్ని నియంత్రించే చర్యలపై ప్రత్యేక దృష్టి సారించాల్సిన అవసరం ఉందన్నారు. గ్రామీణ ప్రాంతాల్లో ఎక్కడా కూడా తాగునీటి సమస్య లేకుండా.ప్రత్యామ్నాయ చర్యలను చేపట్టేందుకు ప్రత్యేక చర్యలు తీసుకుంటామన్నారు. జిల్లాలోని అన్ని నదుల ఆయకట్టు భూములు సాగునీటి కొరతతో ఉన్నాయని ప్రత్యామ్నాయ సాగునీటి కోసం జిల్లా యంత్రాంగంతో కలినికట్టుగా ప్రణాళికలు రూపొందిద్దామన్నారు. గ్రామీణ ప్రాంతాల్లో ప్రజలు ఎదుర్కొంటున్నసమస్యలను ఎప్పటికప్పుడు గుర్తించి, వాటిని జిల్లా పరిషత్ సర్వసభ్య సమావేశాల దృష్టికి తీసుకురావాలని సూచించారు. ఆయా ప్రాంతాల్లో పర్యటిస్తూ స్థానిక పరిస్థితులను పరిశీలించాలని, ప్రజలకు అందుబాటులో ఉంటూ సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని జెడ్పీటీసీ సభ్యులకు పిలుపు నిచ్చారు. గ్రామీణ ప్రాంతాల్లో మెరుగైన మౌలిక సదుపాయాల కల్పనకు ప్రాధాన్యం ఇవ్వాలన్నారు.

అభివృద్ధి కార్యక్రమాల అమలులో జిల్లా యంత్రాంగం సహకారం ఎల్లప్పుడూ ఉంటుందని, జిల్లా కలెక్టర్ సూచనలు, సహకారంతో గ్రామీణాభి వృద్ధికి అవసరమైన చర్యలు చేపడతామని తెలిపారు. ప్రజలకు సేవ చేసే అవకాశాన్ని ప్రతి ఒక్కరూ బాధ్యతగా భావించి సద్వినియోగం చేసుకోవాలని, ప్రజాప్రతినిధులందరి సమష్టి కృషితో వైఎస్సార్ కడప జిల్లాను అభివృద్ధి పథంలో ముందుకు తీసుకెళ్లాలనిఆకాంక్షించారు.


జెడ్పి అధ్యక్ష, ఉపాధ్యక్షుల ఎన్నిక సాగిందిలా

కార్యక్రమంలో ముందుగా. జిల్లా పరిషత్ సర్వసభ్య సమావేశానికి అధ్యక్షత వహించిన జిల్లా కలెక్టర్ తొలుత నూతనంగా ఎన్నికైన జెడ్పీటీసీ సభ్యులకు అభినందనలు తెలిపారు. అనంతరం వారందరితో ప్రమాణ స్వీకారం చేయించారు. ఆ తర్వాత జిల్లా పరిషత్ చైర్మన్, వైస్ చైర్మన్ ఎన్నికల కోసం ప్రత్యేక సమావేశాన్ని నిర్వహించి, నిర్దిత నిబంధనల ప్రకారం ఎన్నికల ప్రక్రియను చేపట్టారు.జెడ్పి చైర్మన్, పదవికి సంబంధించి వీరనాయునిపల్లె జెడ్పీటీసీ సభ్యుడు పుత్తా నర్సింహారెడ్డి పేరును, వైస్ చైర్మన్ పదవికి పోరుమామిళ్ల జెడ్పీటీసీ సభ్యురాలు హబీబున్నీసా చాంద్‌బాయి పేరును ప్రతిపాదిస్తూ.జెడ్పిటిసి సభ్యులు ప్రతిపాదనలు చేశారు.ఇతర సభ్యులు ఎవరూ నామినేషన్ చేయకపోవడంతో జిల్లా పరిషత్ చైర్మన్‌గా పుత్తా నర్సింహారెడ్డి, వైస్ చైర్మన్ గా హబీబున్నీసా చాంద్ బాయిలను ఏకగ్రీవంగా ఎన్నికైనట్లు జిల్లా కలెక్టర్ ప్రకటించారు.అనంతరం నూతనంగా ఎన్నికైన చైర్మన్ పుత్తా నర్సింహారెడ్డి, వైస్ చైర్మన్ హబీబున్నీసా చాంద్‌బాయిలతో కలెక్టర్ ప్రమాణ స్వీకారం చేయించారు భారత రాజ్యాంగంపై నిజమైన నమ్మకం, విధేయత కలిగి ఉంటూ తమకు అప్పగించిన బాధ్యతలను నిబద్ధతతో నిర్వహిస్తామని వారితో ప్రమాణం చేశారు. అనంతరం నూతన చైర్మన్, వైస్ చైర్మన్‌లను కలెక్టర్ అభినందించారు.ఈ కార్యక్రమంలో కమలాపురం ఎమ్మెల్యే పుత్తా కృష్ణ చైతన్య రెడ్డి, మైదు7ఎమ్మె6 పుట్టా సుధకర్ యాదవ్, జిల్లా తెదేపా ఇంఛార్జి భూపేష్ రెడ్డి, జెడ్పి సీతఃవో సుబ్రహ్మణ్యం, ప్రజాప్రతి నిధులు, అధికారులు తదితరులు పాల్గొన్నారు.

జర్నలిస్టు పట్ల దురుసుగా ప్రవర్తించిన రామచంద్రారెడ్డి పై చర్యలు తీసుకోవాలి

బద్వేలు రూరల్ సీఐ కృష్ణయ్యకు ఫిర్యాదు చేసిన పాత్రికేయులు

బద్వేలు,నవంబర్ 20(విజన్ ఆంధ్ర) బద్వేలు పట్టణంలో విధి నిర్వహణలో ఉన్న జర్నలిస్టు పట్ల దురుసుగా ప్రవర్తించి, అవమానించిన టిడిపి నాయకుడు బిజి వేముల రామచంద్రారెడ్డి పై వారిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని కోరుతూ బద్వేలు పట్టణ ప్రింట్, ఎలక్ట్రానిక్ మీడియా ప్రతినిధులందరూ కలిసి శుక్రవారం బద్వేలు రూరల్ సీఐ కృష్ణయ్యకు ఏపీ జె డబ్ల్యూ జె యూనియన్ అధ్యక్షులు భూమిరెడ్డి వెంకటేష్, సుదర్శన్ రెడ్డి దేవి రెడ్డి సురేష్ ఆవుల కృష్ణ కిషోర్ జింక జానీ, గంజికుంట మోహన్ కృష్ణ రాజా యాదవ్ తో పాటు పలువురు వినతిపత్రం అందజేశారు.ఈ సందర్భంగా పాత్రికేయ సోదరులు మాట్లాడుతూ బద్వేలు నియోజకవర్గ సాక్షి టీవీ రిపోర్టర్ రాజా గురువారం బద్వేలు ఎంపీడీవో కార్యాలయంలో జరిగిన ఎంపీపీ ఎన్నికల కవరేజీ నిమిత్తం వెళ్లారని తెలిపారు. జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు అక్రిడిటేషన్ ఉన్న జర్నలిస్టులను కవరేజీకి రావాలని ఎంపీడీవో, ప్రెస్ గ్రూపుల్లో సమాచారం ఇవ్వడంతో, అక్రిడిటేషన్ కార్డు కలిగిన రాజా తన వృత్తి ధర్మంలో భాగంగా అక్కడికి వెళ్లారన్నారు.అయితే, ఆ సమయంలో తెలుగుదేశం పార్టీకి చెందిన బిజివేముల రామచంద్రారెడ్డి, జీరం. జయరామిరెడ్డి వర్గాల మధ్య మాటల ఘర్షణ జరుగుతుండగా సాక్షి ఎలక్ట్రానిక్ మీడియా కు చెందిన విలేఖరి రాజా వీడియో చిత్రీకరిస్తుండటంతో,బిజివేముల రామచంద్రారెడ్డి అడ్డుకొని అనుచిత వ్యాఖ్యలు చేశారని పేర్కొన్నారు.అంతే కాకుండా రాజాపై అసభ్య పదజాలంతో దూషిస్తూ దురుసుగా ప్రవర్తించి, అనుచిత వ్యాఖ్యలతో అవమానపరిచి ఎంపీడీవో కార్యాలయం నుంచి గెంటివేశారని, బయటకు పంపించారని ఆవేదన వ్యక్తం చేశారు.ప్రజాస్వామ్యంలో నాలుగో స్తంభమైన మీడియా ప్రతినిధినీ విధి నిర్వహణకు ఆటంకం కలిగించడమే కాకుండా,ఆ ఘటనకు సంబంధించిన వీడియో సామాజిక మాధ్యమాల్లో వైరల్ కావడానికి కారణమైన బిజివేముల రామచంద్రారెడ్డిపై సమగ్ర విచారణ జరిపి, అతనిపై చర్యలు తీసుకోవాలని జర్నలిస్టుకు న్యాయం చేయాలని వినతిపత్రంలో రూరల్ సీఐ కృష్ణయ్యను కోరారు. ఈ కార్యక్రమంలో ప్రింట్ అండ్ ఎలక్ట్రానిక్ మీడియా ప్రతినిధులు పాల్గొన్నారు



ఇంటింటి ప్రచారంలో దూసుకుపోతున్న టిడిపి సర్పంచ్ అభ్యర్థి కార్తికేయ

బద్వేలు,నవంబర్ 20 (విజన్ ఆంధ్ర)

నియోజకవర్గ పరిధిలోని గోపవరం మండలం బ్రాహ్మణపల్లి గ్రామ పంచాయతీ టిడిపి సర్పంచ్ అభ్యర్థిగా బలపరిచిన తాళ్లూరి కార్తికేయ ఎన్నికల ప్రచారాన్ని బ్రాహ్మణ పల్లె పంచాయతీ పరిధిలోని బొడ్డుచర్ల, గ్రామంలో టిడిపి నాయకులు, తన అనుచరులతో.ముమ్మరంగా ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామ ప్రజలు సర్పంచ్ అభ్యర్థి కార్తికేయ కు, టిడిపి నాయకులకు

గ్రామస్తులందరూ కలిసి ఘన స్వాగతం పలికారు. అనంతరం సర్పంచ్ అభ్యర్థి కార్తికేయ ఇంటింటికీ వెళ్లి ఓటర్లను కలిసి నాకు మద్దతు ఇచ్చి నన్ను గెలిపించాలని గ్రామ ప్రజలను కోరారు అదేవిధంగా పంచాయతీ పరిధిలోని ఉండే గ్రామాలలో సమస్యలను గుర్తించి అభివృద్ధి చేయుటకు తోడ్పడుతానని ముఖ్యంగా గ్రామాలలో డ్రైనేజీ, మంచినీటి సౌకర్యం, వీధిలైట్లు సిసి రోడ్లు, వేయుటకు ప్రయత్నిస్తానని గ్రామ సమస్యలపై పూర్తి అవగాహనతో ఉన్నానని వాటి పరిష్కారం కొరకు పనిచేస్తానని తెలిపారు. గ్రామాలలో మౌలిక సదుపాయాల కల్పనకు, గ్రామ అభివృద్ధికి పాటుపడతానని ఆయన హామీ ఇచ్చారు.అదేవిధంగాసంక్షేమ పథకాలు అర్హులైన ప్రతి ఒక్కరికీ అందేలా చూస్తానని, పంచాయతీని ఆదర్శంగా తీర్చిదిద్దుతానని పేర్కొన్నారు. రాబోయే పంచాయతీ ఎన్నికల్లో తమను అత్యధిక మెజార్టీతో గెలిపించాలని ఓటర్లను కోరారు.ఈ కార్యక్రమంలో తెలుగుదేశం పార్టీ నాయకులు,కార్యకర్తలు, కార్తికేయ మిత్రులు, గ్రామ పెద్దలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.



The imprint line should be printed legibly as Printed by Published by JAKKULA NARENDER on behalf of JAKKULA NARENDER, printed at and published at 76-6-01 BHATSING ROAD CHATIYNA APTS NEAR SWATHI CENTER BHAVANIPURAM VIJAYAWADA editor JAKKULA NARENDER.